ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 22-8-2019 గురువారం సిటీ సంపుటి 46 సంచిక 13

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

హై డ్రామా.. అరెస్ట్

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఊపిరి సలపని ఉత్కంఠ..

- అరెస్టుపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో చిదంబరానికి లభించని ఊరట
- 24 గంటల పాటు ఆచూకీ చిక్కని నేత
- రంగంలోకి దిగిన సీబీఐ, ఈడీ
- విదేశాలకు పారిపోకుండా లుకౌట్ నోటీసు జారీ
- రాత్రి ఏఐసీసీ కార్యాలయంలో ప్రత్యక్షమైన కేంద్ర మాజీ మంత్రి
- కేసుపై ప్రకటన.. ఆ తర్వాత ఇంటికి
- అధికారుల్ని ఇంట్లోకి రానివ్వని వైనం
- గోడదూకి వెళ్లిన దర్యాప్తు అధికారులు
- ఎట్టకేలకు చిదంబరం అరెస్టు

ఈనాడు - దిల్లీ

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరాన్ని బుధవారం రాత్రి నాటకీయ పరిణామాల మధ్య సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం ఆయన చేసుకున్న విజ్ఞప్తిని మంగళవారం దిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో మొదలైన హైడ్రామా ఎన్నో మలుపులు తిరిగింది. హైకోర్టు తీర్పుపై స్టే కోసం వేసిన పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీం కోర్టు నిరాకరించడంతో ఆయనను అరెస్టు చేయడానికి సీబీఐకి స్వేచ్ఛ లభించింది.

మంగళవారం సాయంత్రం నుంచి అదృశ్యమైన చిదంబరం కోసం సీబీఐ, ఈడీ బృందాలు గాలిస్తుండగా.. అనూహ్యంగా బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఆయన దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యక్షమై, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఎటువంటి తప్పూ చేయలేదని స్పష్టం చేశారు. అనంతరం చిదంబరం జోర్‌బాగ్‌లోని తన నివాసానికి వెళ్లారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నేతలు, న్యాయవాదులు అయిన కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ కూడా ఉన్నారు. కొద్ది నిమిషాలకు 30 మందితో కూడిన సీబీఐ బృందం అక్కడికి వచ్చింది. చిదంబరం ఉండే బంగ్లా తలుపును తట్టింది. అటువైపు నుంచి స్పందన రాకపోవడంతో ముగ్గురు అధికారులు 5 అడుగుల ప్రహరీ గోడను ఎక్కి దూకి, ఇంట్లోకి ప్రవేశించారు. తలుపులను తెరిచి, మిగతా సీబీఐ బృందాన్ని లోపలికి అనుమతించారు. ...మిగతా 2లో

దిల్లీలో బుధవారం చిదంబరాన్ని అరెస్టుచేసి తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

"ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే చిదంబరాన్ని పిరికిపందలు వెంటాడుతున్నారు.
– ప్రియాంకగాంధీ

"రాజకీయ దురుద్దేశంతోనే నా తండ్రిని సీబీఐ అరెస్టు చేసింది. ఇది కక్షసాధింపు చర్య.
– కార్తీ చిదంబరం

"కక్ష సాధింపు చర్యలేం లేవు. దర్యాప్తులో కేంద్ర జోక్యం లేదు. తాను చేసిన పనులకు పర్యవసానాలను చిదంబరం అనుభవిస్తున్నారు.
– భాజపా

"నేను, నా కుటుంబం ఏ తప్పూ చేయలేదు. తప్పించుకున్నానన్నది దుష్ప్రచారం. రాత్రంతా న్యాయవాదులతో ఉన్నా. నాపై ఎఫ్ఐఆర్, ఛార్జిషీటులు కూడా లేవు.
- చిదంబరం

ఉత్తుత్తి బీపీ!

పరీక్షించేప్పుడే పెరుగుతున్న రక్తపోటు

- రాష్ట్రంలో 36% మందిలో గుర్తింపు
- కొందరిలో బీపీ ఉన్నా పైకి కనబడటం లేదు
- ఐహెచ్ఎస్ అధ్యయనంలో వెల్లడి

బీపీ... ఓ చిత్రమైన సమస్య... కొందరిలో అధిక రక్తపోటు ఉండదు... కానీ ఆసుపత్రిలో వైద్యుడు పరీక్షిస్తున్నప్పుడు మాత్రం అది అమాంతం పెరిగిపోతుంటుంది. ఈ రకం రక్తపోటును 'వైట్‌కోట్ హైపర్ టెన్షన్' అంటారు. తెలంగాణలో ఈ తరహా సమస్య ఉన్నవారు 36 శాతం వరకూ ఉన్నట్లు తాజా అధ్యయనం ఒకటి గుర్తించింది. మరోవైపు రాష్ట్రంలో అధిక రక్తపోటు సమస్య యువతలోనూ ఎక్కువగానే ఉంది. అయినా బాధితుల్లో చాలామందికి తమకు బీపీ ఉన్నట్లే తెలియకపోవడం గమనార్హం. ...వివరాలు 2లో

బీపీ వస్తున్న వారి సగటు వయసు	18 నుంచి 80 ఏళ్ల మధ్య వయసు వారిలో	హైబీపీ ఉండి కూడా వైద్య పరీక్షల్లో తేలని వారు
38.8	22%	14%

మీరు సరేనంటేనే మీ ఖాతాలోకి సొమ్ము!

ఈనాడు, దిల్లీ: ఎవరి బ్యాంకు ఖాతాలో కైనా ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయాలన్నా, నేరుగా సొమ్ము జమ చేయాలన్నా ఇకపై సంబంధిత ఖాతాదారు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఖాతాదారుకు తెలియకుండా ఆన్‌లైన్‌లో సొమ్ము బదిలీ చేయడానికి, నేరుగా నగదు జమ చేయడానికి అవకాశం ఉంది. ...మిగతా 2లో

కనీస పింఛను పెంచుతాం

త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం

రివ్యూ పిటిషన్‌పై తీర్పు ఆధారంగా వాస్తవిక వేతనంపై పింఛను

'ఈనాడు'తో కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ 6లో

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయిపల్లి వద్ద అటవీ పునరుద్ధరణ తీరుపై కలెక్టర్లకు వివరిస్తున్న సీఎం కేసీఆర్

అందరూ కదలాలి

వనాలు పెరగాలి

- మంత్రులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి
- క్షేత్రస్థాయి పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన కొత్తలో గజ్వేల్‌లోని అటవీ భూములు ఎడారిని తలపించేవి. ఎక్కడా చెట్లు కనిపించేవి కావు. ఇక్కడ అడవులను పునరుద్ధరించాలనే లక్ష్యంతో మూడేళ్ల క్రితం సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేశాం. ఆ ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతమంతా పచ్చదనంతో కళకళలాడుతోంది. వర్షపాతమూ పెరిగింది. 27 రకాల పండ్ల మొక్కలను ఇక్కడ పెంచాం. దీంతో ఇవి ప్రస్తుతం కోతులకు ఫుడ్‌కోర్టులుగా తయారవుతున్నాయి. ఇక్కడ చేపట్టిన పునరుద్ధరణ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఈ పనులకు శ్రీకారం చుట్టాలి.
–ముఖ్యమంత్రి కేసీఆర్

3లో మ్యుటేషన్ల బాధ్యత జేసీ లేదా ఆర్డీఓకు | కలెక్టర్ల సమావేశంలో చర్చ

ఇదీ సంగతి!

ప్రతివారినీ నిశితంగా పరిశీలించాకే ఎక్కనిద్దాం, సరేనా...

దాటితే గీత భారీ వాత

సెప్టెంబరు 1 నుంచే అమలు

- ట్రాఫిక్ ఉల్లంఘనలపై అపరాధ రుసుముల మోత
- మద్యం మత్తులో వాహనం నడిపితే రూ.10,000 జరిమానా
- దశల వారీగా నూతన నిబంధనల అమలు

ఈనాడు, హైదరాబాద్: నిబంధనలను అతిక్రమించిన వాహనదారుల జేబులు ఇక ఖాళీనే. ప్రస్తుతం వసూలు చేస్తున్న అపరాధ రుసుములను భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి అమలులోకి రానుంది. మోటారు వాహన నిబంధనల సవరణ చట్టానికి రాష్ట్రపతి ఇప్పటికే ఆమోద ముద్ర వేశారు. ఆ చట్టం ప్రకారం రవాణా నిబంధనలు కఠినతరమయ్యాయి. ...మిగతా 2లో

SUN DIRECT

సన్‌డైరెక్ట్‌లోని ఈటీవీ ప్రేక్షకులకు ముఖ్య గమనిక

ఇప్పటివరకు సన్‌డైరెక్ట్DTHలో ఈటీవీ బొకే ఛానల్స్ అన్నీ 'తెలుగు DPO ప్యాక్ 1'లో లభ్యమయ్యేవి.
ప్రస్తుతం ఈ ప్యాక్‌లో 7 ఈటీవీ బొకే ఛానల్స్ అందుబాటులో లేవని అనేక మంది అభిమాన ప్రేక్షకులు నిత్యం మమ్మల్ని సంప్రదిస్తున్నారు.

ఈ సరికే సన్‌డైరెక్ట్

'తెలుగు DPO ప్యాక్ A1' ను నెలకు రూ.166.1/-*
చెల్లించి పొందినవారు, అదనంగా మరో రూ.24/-* మాత్రం చెల్లించి
(మొత్తం నెలకు రూ.166.1 +24 =190.1*)
లేదా
'తెలుగు DPO ప్యాక్ A2' ను నెలకు రూ.216.1/-*
చెల్లించి పొందినవారు, అదనంగా మరో రూ.24/-* మాత్రం చెల్లించి
(మొత్తం నెలకు రూ.216.1 +24 =240.1*)

మీరెంతో ఇష్టపడే ఈటీవీ, ఈటీవీ ప్లస్, ఈటీవీ సినిమా, ఈటీవీ అభిరుచి, ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ ఛానల్స్‌ను నిరాటంకంగా పొందవచ్చు.

మరిన్ని వివరాలకు
సన్ డైరెక్ట్ కాల్ సెంటర్ నెం:18001037575/18001237575
SMS:ADDON అని టైప్ చేసి <space> ఇచ్చి SMC నంబర్ లేదా CDSN నంబర్ టైప్ చేసి <space> ఇచ్చి ETVFLYP24 అని టైప్ చేసి 9600058585 లేదా 58585 నంబర్‌కు SMS చేయండి.

జారీ చేసినవారు: ఈనాడు టెలివిజన్ ప్రై.లి., రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్-501512. ఫోన్:08415-246555

ఈటీవీ ఈటీవీ PLUS ఈటీవీ సినిమా ఈటీవీ అభిరుచి ఈటీవీ Life ఈటీవీ ఆంధ్రప్రదేశ్ ఈటీవీ తెలంగాణ

హైడ్రామా.. అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

కొద్దిసేపటికి ఈడీ అధికారులూ అక్కడికి చేరుకున్నారు. సీబీఐ అధికారులు బంగ్లా వెనుక ద్వారం వద్దకు వెళ్లారు. వెలుపలికి వెళ్లే అన్ని మార్గాల వద్ద సిబ్బందిని మోహరించారు. అరెస్టుకు సంబంధించిన లాంఛనాలన్నీ పూర్తిచేశాక చిదంబరాన్ని అదుపులోకి తీసుకొని కారులో సీబీఐ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఆ సమయంలో అక్కడ నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు ఆ కారు మీదకు దూకి, అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అక్కడున్న దిల్లీ పోలీసులు వారిని పక్కకు లాగేశారు. కోర్టు వారెంటు మేరకు ఆయనను అరెస్టు చేసినట్లు సీబీఐ ధ్రువీకరించింది. చిదంబరం రాత్రి మొత్తం సీబీఐ అతిథి గృహంలోనే ఉంటారని అధికార వర్గాలు చెప్పాయి. ఆయనకు వైద్య పరీక్షలు చేయించిన అనంతరం గురువారం ఉదయం కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది. ఆయన రిమాండ్‌కు సీబీఐ విజ్ఞప్తి చేయనుంది.

దిల్లీలో బుధవారం కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరాన్ని సీబీఐ అధికారులు తీసుకెళ్తున్న కారుకు అడ్డుపడిన ఓ కార్యకర్త

పార్టీ నేతల సంఘీభావం

అంతకుముందు దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని చిదంబరం వేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మరోవైపు చిదంబరానికి కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. 'వ్యక్తిత్వ హనన రాజకీయాల'కు ప్రభుత్వం పాల్పడుతోందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇందుకోసం సీబీఐ, ఈడీ, మీడియాలో ఒక వర్గాన్ని ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. తాము కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నామన్న ఆరోపణలను భాజపా ఖండించింది. దర్యాప్తులో కేంద్రం జోక్యం చేసుకోవడంలేదని పేర్కొంది. తాను చేసిన పనులకు పర్యవసానాలను చిదంబరం ఎదుర్కోవాలని స్పష్టంచేసింది.

ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు మంగళవారం నిరాకరించిన సంగతి తెలిసిందే. దీంతో చిదంబరం తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తక్షణం దీనిపై విచారణ చేపట్టాలన్న వీరి వినతిని కోర్టు ఒప్పుకోలేదు. బుధవారం సంబంధిత ధర్మాసనం ఎదుట దీన్ని ప్రస్తావించాలని సూచించింది. ఆ వెంటనే సీబీఐ, ఈడీ అధికారులు చిదంబరం నివాసానికి వెళ్లారు. ఆయన అక్కడ లేకపోవడంతో రెండు గంటల్లోగా దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలంటూ ఒక నోటీసును అక్కడ అతికించారు. ఆయన దేశం విడిచి వెళ్లకుండా చూసేందుకు బుధవారం సీబీఐ, ఈడీలు ఆయనపై 'లుకౌట్ సర్క్యులర్'ను జారీ చేశాయి. దేశంలోని అన్ని విమానాశ్రయాలు, పోర్టులను అప్రమత్తం చేశాయి. సీబీఐ బృందం బుధవారం మరోసారి ఆయన నివాసానికి వెళ్లింది. ఆయన ఆచూకీ లేకపోవడంతో వెనుదిరిగింది.

సుప్రీంలో దక్కని ఊరట..

మరోవైపు చిదంబరం తరపున కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది కపిల్ సిబల్ బుధవారం కూడా సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేశారు. జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ ఎం.శంతనుగౌడర్, జస్టిస్ అజయ్ రస్తోగిలతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన కేసును ప్రస్తావించారు. దీనిపై తక్షణ విచారణ చేపట్టడానికి అనుమతివ్వాలంటూ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగొయికి ఈ పిటిషన్‌ను నివేదించింది. అయితే ఆ తర్వాత తక్షణ లిస్టింగ్‌పై ఎలాంటి సమాచారం అందకపోవడంతో భోజన విరామం అనంతరం సిబల్ మరోసారి జస్టిస్ ఎన్.వి.రమణ ధర్మాసనం ఎదుట దీన్ని ప్రస్తావించారు. చిదంబరం పారిపోతారన్నట్లు దర్యాప్తు సంస్థలు ఇప్పటికే ఆయన వెంటపడుతున్నాయని సిబల్, ఇతర సీనియర్ న్యాయవాదులు సల్మాన్ ఖుర్షీద్, వివేక్ తంఖా, ఇందిరా జైసింగ్ తదితరులు అభ్యంతరం తెలిపారు. పిటిషన్‌లో కొన్ని లోపాలున్నాయని, వాటి గురించి రిజిస్ట్రీ తమకు తెలియజేసిందని ధర్మాసనం బదులిచ్చింది. లోపాలను సరిదిద్దామని సిబల్ చెప్పారు. దీంతో ధర్మాసనం రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) సూర్యప్రతాప్ సింగ్‌ను పిలిపించి, దీనిపై ఆరా తీసింది. పిటిషన్‌లోని లోపాలను 'ఇంత క్రితమే' సరిదిద్దారని, దాన్ని ప్రధాన న్యాయమూర్తి వద్దకు పంపామని ఆయన తెలిపారు. దీనికి సిబల్ స్పందిస్తూ బుధవారం ప్రధాన న్యాయమూర్తి రాజ్యాంగ ధర్మాసనంలో ఉన్నారని, సాయంత్రం 4 గంటల లోపు ఆయన వెలుపలికి వచ్చే అవకాశం లేదని చెప్పారు. తక్షణం తమ పిటిషన్‌ను విచారించాలని పదేపదే కోరారు. అయితే ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని తాము ఇప్పటికే సూచించినట్లు ధర్మాసనం సమాధానమిచ్చింది.

గతంలో మౌఖిక ప్రస్తావన ఆధారంగా అరెస్టుల నుంచి కోర్టు రక్షణ కల్పించిందని సిబల్ చెప్పారు. "పిటిషన్‌లో లోపాలను ఇంతక్రితమే సరిచేశారు. దాన్ని బుధవారం నాడే లిస్టింగ్ చేయడం కుదరదు. లిస్టింగ్ లేకుండా పిటిషన్‌పై విచారణ చేపట్టడం సాధ్యం కాదు" అని ధర్మాసనం తెలిపింది. పరారు కాబోనని హామీ ఇచ్చేందుకు చిదంబరం సిద్ధంగా ఉన్నారని సిబల్ చెప్పారు. దీన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోకుండా, స్వల్ప విచారణను ముగించింది.

అనంతరం చిదంబరం పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నిర్ణయించినట్లు సిబల్‌కు సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ తెలియజేశారు.

ఈడీ దర్యాప్తు ముమ్మరం

మరోవైపు చిదంబరంపై నగదు అక్రమ చలామణీ కేసుల్లో దర్యాప్తును ముమ్మరం చేయాలని ఈడీ నిర్ణయించింది. ఐఎన్ఎక్స్ మీడియాతో పాటు ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కాకుండా మరో నాలుగు వ్యాపార లావాదేవీలకు అక్రమంగా విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ) అనుమతులు మంజూరు చేయడంలో ఆయన పాత్ర ఉందని ఈడీ అనుమానిస్తోంది. ఇందుకు ప్రతిగా అనేక డొల్ల కంపెనీల ద్వారా కోట్ల రూపాయల మేర ముడుపులు అందినట్లు ఆరోపిస్తోంది. అక్రమంగా ఎఫ్ఐపీబీ అనుమతులకు బదులు చిదంబరం, ఆయన కుమారుడు కార్తి ముడుపులు అందుకున్న తర్వాత ఒకే డొల్ల కంపెనీలో రూ.300 కోట్లకుపైగా అక్రమ డిపాజిట్లను చేసినట్లు ఆధారాలు లభించాయని ఈడీ వర్గాలు తెలిపాయి. అందువల్ల సంక్లిష్టమైన ఈ లావాదేవీలు, ముడుపుల వ్యవహారాలపై తండ్రి, కుమారుడిని కస్టడీలోకి తీసుకొని విచారించాలని తాము కోరుతున్నట్లు తెలిపాయి.

దిల్లీలో చిదంబరం నివాసం వెలుపల పార్టీ కార్యకర్తలు, మీడియాను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు

చిదంబరం నివాసంలోకి ప్రవేశించేందుకు ప్రహరీ పైకి ఎక్కుతున్న సీబీఐ అధికారులు

ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చిదంబరం. చిత్రంలో పార్టీ నేతలు గులాంనబీ ఆజాద్, అభిషేక్ సింఘ్వీ, కపిల్ సిబల్, మల్లికార్జున ఖర్గే

నేను ఏ తప్పూ చేయలేదు

- కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం

ఈనాడు, దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో తానుకానీ, తన కుటుంబ సభ్యులుకానీ ఎలాంటి తప్పూ చేయలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం స్పష్టంచేశారు. ముందస్తు బెయిల్‌కోసం ఆయన దాఖలుచేసిన కేసుపై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో ఆయన బుధవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సహచరులైన న్యాయవాదులు కపిల్‌సిబల్, అభిషేక్‌సింఘ్వీ, మల్లికార్జున ఖర్గేలతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తాను చట్టాన్ని గౌరవిస్తున్నానని, దర్యాప్తు సంస్థలు కూడా చట్టంపై గౌరవం ఉంచి శుక్రవారం సుప్రీంకోర్టు ఉత్తర్వులు వెలువడేవరకు వేచి చూడాలన్నారు. ఆయన ముందస్తుగా తయారు చేసుకొచ్చిన ప్రకటనను చదివి వినిపించారు. విలేకరుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. "స్వేచ్ఛే మన రాజ్యాంగ పునాది అని నమ్ముతాను. నీకు జీవితం కావాలా? స్వేచ్ఛ కావాలా? అంటే నేను స్వేచ్ఛనే ఎంచుకుంటాను. గత 24 గంటల్లో జరిగినది అనేక మందికి ఆందోళన, అయోమయాన్ని కలిగించింది. ఈ పరిస్థితికి తెరదించడానికే ఈరోజు మీడియా ముందుకు వచ్చాను" అని చిదంబరం తెలిపారు.

మేం నిందితులం కాదు

"ఐఎన్ఎక్స్ మీడియా కేసు విషయానికొస్తే... అందులో నేనుకానీ, నా కుటుంబసభ్యులు కానీ నిందితులంకాదు. సీబీఐ, ఈడీలు ఏ కోర్టులోనూ చార్జిషీటు కూడా దాఖలుచేయలేదు. పైగా సీబీఐ దాఖలుచేసిన ఎఫ్ఐఆర్‌లో కూడా నేను తప్పుచేసినట్లు ఎక్కడా చెప్పలేదు. అయినా ఇందులో నేను, నా కుమారుడు ఘోరమైన నేరాలకు పాల్పడినట్లు విస్తృతమైన అభిప్రాయం నెలకొంది. ఇది నిరాధార ప్రచారం తప్పితే ఇందులో నిజంలేదు. సీబీఐ, ఈడీ నన్ను ప్రశ్నించడానికి పిలిచినప్పుడు అరెస్టు కాకుండా కోర్టు నుంచి రక్షణ కోరడం సహజం. నాకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ హైకోర్టు 2018 మే 31, జులై 25 తేదీల్లో ఉత్తర్వులు జారీచేసింది. గత 13-15 నెలలుగా నాకు ఆ రక్షణ ఉంది. ఈ అంశంపై 2019 జులై 25వ తేదీన చివరిసారి విచారించి హైకోర్టు తీర్పు రిజర్వుచేసింది. ఏడునెలల తర్వాత మంగళవారం హైకోర్టు నా ముందస్తు బెయిల్ పిటిషన్‌ను రద్దు చేసింది. అందువల్ల సుప్రీంకోర్టును ఆశ్రయించమని న్యాయవాదులు సూచించారు. నా తరపున ఈ రెండు రోజుల్లో అంతా వారే చూసుకున్నారు. నా అపీళ్లను అత్యవసరంగా విచారించి, మధ్యంతర రక్షణను పొడిగించాలని న్యాయవాదులు సుప్రీంకోర్టుకు పదేపదే విన్నవించారు. మేము రాత్రంతా కష్టపడి కేసు తయారుచేశాం. బుధవారం ఉదయానికి మా పని పూర్తయింది. సుప్రీంకోర్టులో కేసు దాఖలుచేశాం. నేను ఈ పనిలో రాత్రంతా న్యాయవాదుల వెంటే ఉన్నాను. నేను తప్పించుకుపోయానని ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగించింది. ఈరోజు సుప్రీంకోర్టును ఎంత వేడుకున్నా నా కేసును అత్యవసర విచారణకు స్వీకరించలేదని, శుక్రవారం తీసుకుంటారని లాయర్లు చెప్పారు. నేను సుప్రీంకోర్టు ఉత్తర్వులను శిరసావహిస్తున్నాను. ఈరోజు నుంచి శుక్రవారం వరకు తలెత్తుకు తిరుగుతా. ప్రస్తుత పరిస్థితుల్లో చట్టాన్ని గౌరవించడం అంటే శుక్రవారం సుప్రీంకోర్టు వెలువరించే ఉత్తర్వులకోసం వేచిచూడటమే" అని చిదంబరం పేర్కొన్నారు.

సీన్ రివర్స్..!

- చిదంబరం హోంమంత్రిగా ఉన్నప్పుడు అమిత్ షా అరెస్టు

దిల్లీ: 2010లో కాంగ్రెస్ నేత పి.చిదంబరం యూపీఏ సర్కారులో కేంద్ర హోంమంత్రిగా ఉండేవారు. అప్పట్లో అమిత్ షా గుజరాత్ హోంమంత్రి. ఆయన హయాంలోనే (2005లో) రాష్ట్ర పోలీసులు సోహ్రాబుద్దీన్ షేక్ అనే నేరస్థుడిని అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో సోహ్రాబుద్దీన్ మృతిచెందడం అమిత్‌షా మెడకు చుట్టుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో అపహరణ, హత్య ఆరోపణల కింద సీబీఐ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. ఇప్పుడు... అమిత్ షా కేంద్ర హోంమంత్రి. ఈ సమయంలో ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో చిదంబరాన్ని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు.

ఉత్తుత్తి బీపీ ఎక్కువే ఉంది!

ఈనాడు - హైదరాబాద్

ఇరిస్ లైఫ్ సైన్సెస్, ఇండియన్ హార్ట్ స్టడీ (ఐహెచ్ఎస్) సంస్థలు హైపర్ టెన్షన్‌పై 15 రాష్ట్రాల్లో తాజాగా అధ్యయనం చేశాయి. ఆ వివరాలను బుధవారం ఇరిస్ లైఫ్ సైన్సెస్ అధ్యక్షులు విరాజ్ సువర్ణ, అపోలో ఆసుపత్రి కార్డియాలజిస్ట్ సునీల్‌కపూర్, ఉస్మానియా ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ మనీషా సహాయ్ తదితరులు హైదరాబాద్‌లో వెల్లడించారు. తెలంగాణలో 1168 మంది సహా దేశవ్యాప్తంగా 18,918 మంది స్త్రీ, పురుషులపై (64% పురుషులు, 36% మహిళలు) 9 నెలల పాటు అధ్యయనం చేశారు. వీరి రక్తపోటును వరుసగా ఏడు రోజులపాటు రోజుకు నాలుగు సార్లు చొప్పున పరిశీలించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అధిక రక్తపోటును గుర్తించేందుకు సరైన విధానాలు లేవని, ఒక్కసారి బీపీ పరీక్షించి నిర్ధారణకు రాకుండా.. వారంలో వేర్వేరు సమయాల్లో వేర్వేరుగా బీపీ చూసి నిర్ధారణకు రావాలని, లేదంటే 24 గంటలపాటు పూర్తిగా పర్యవేక్షించిన తర్వాత ఒక నిర్ణయానికి రావాలని అధ్యయనకర్తలు సూచిస్తున్నారు.

వైట్‌కోట్ హైపర్‌టెన్షన్.. ఏం చెయ్యాలి?

వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు మాత్రమే కనిపించే హైబీపీ సమస్యకు మందుల అవసరం ఉండదు. వీరు ఆహారంలో ఉప్పు తగ్గించుకోవడం, నిత్యం గంట వ్యాయామం, సరైన నిద్ర, ఆందోళన తగ్గించుకోవడం వంటి చర్యలతో బీపీని నియంత్రణలో పెట్టుకోవచ్చని సూచిస్తున్నారు. వీరు అనవసరంగా మందులు వాడటం వల్ల హైపోటెన్షన్ (తక్కువ రక్తపోటు)కు దారి తీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి సమస్య ఉన్నవారికి ఒక పరీక్షతోనే నిర్ధారణకు రాకుండా.. వారంలో 3-4 సార్లు పరీక్షలు చేయాల్సి ఉంటుంది.

మాస్క్డ్ హైపర్‌టెన్షన్

కొందరిలో ఇంట్లో పరీక్ష చేసుకుంటే అధిక రక్తపోటు కనిపిస్తుంది. ఆసుపత్రికి రాగానే తగ్గిపోతుంది. ఇలాంటి బీపీని 'మాస్క్డ్ హైపర్‌టెన్షన్' అంటారు. తెలంగాణలో ఇలాంటివారు 14 శాతం మంది ఉన్నట్లు తేలింది. వీరు వైద్యుడి దగ్గరకు వెళితే అధిక రక్తపోటు లేదని చెప్పి ఔషధాలు ఇవ్వడం లేదు.

ఇలాంటివారిలో కొన్నిసార్లు గుండె విఫలం కావడం, పక్షవాతం, కిడ్నీల వైఫల్యం తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయి. మరో 22 శాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

అధ్యయనంలో వెల్లడైన ఫలితాలు

	దేశంలో	శాతం	రాష్ట్రంలో	శాతం
సాధారణ రక్తపోటు	5464	31	323	28
అధిక రక్తపోటు ఉన్నవారు	4952	28	256	22
వైట్‌కోట్ హైపర్‌టెన్షన్	4067	23	418	36
మాస్క్డ్ హైపర్‌టెన్షన్	3271	18	167	14

అధ్యయనం వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ సునీల్ కపూర్, డాక్టర్ విరాజ్ సువర్ణ, డాక్టర్ మనీషా సహాయ్

మెట్రో నగరాల్లో ఎక్కువగా ఉంది

-సునీల్ కపూర్, కార్డియాలజిస్టు, అపోలో

జీవనశైలి మార్పు, అధిక మసాలాలు తినడం వల్ల ఎక్కువ మంది హైపర్‌టెన్షన్ బారిన పడుతున్నారు. మెట్రో నగరాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఇంట్లో ఎప్పటికప్పుడు బీపీ పరీక్షించుకునే వెసులుబాటు ఉండాలి. ముఖ్యంగా గర్భిణులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న వారు హోమ్ బ్లడ్ ప్రెజర్ మానిటర్లు అందుబాటులో పెట్టుకోవాలి.

2.5 లక్షల మందికి కొత్తగా డయాలసిస్

-మనీషా సహాయ్, నెఫ్రాలజిస్టు, ఉస్మానియా

అధిక రక్తపోటు కారణంగా మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా ఏటా 2.5 లక్షల మందికి కొత్తగా డయాలసిస్ అవసరం అవుతోంది. 10 వేల మంది కిడ్నీల మార్పిడి కోసం చూస్తున్నారు. ఈ సమస్య రాకుండా బీపీని నియంత్రణలో పెట్టుకోవాలి. ఏటా ఒకసారి యూరిన్, క్రియాటిన్ పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకు రూ.50 కంటే ఎక్కువ ఖర్చు కాదు.

1869 - 2019 ఈనాడు మహోన్నతుడి 150వ జయంతి వేడుకలు

ప్రశాంత మార్గం

కిక్కిరిసిన మన దైనందిన జీవితాల్లోకి ఒక రకంగా క్రమబద్ధతనూ, శాంతి ప్రశాంతతలనూ తీసుకువచ్చే ఒకే ఒక్క మార్గం ప్రార్థన!

- మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

22-8-2019 గురువారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
సప్తమి: తె.3-11 తదుపరి అష్టమి
భరణి నక్షత్రం: రా.11-12 తదుపరి కృత్తిక
అమృత ఘడియలు: సా.6-07 నుంచి 7-48 వరకు
వర్జ్యం: ఉ.7-59 నుంచి 9-40 వరకు
దుర్ముహూర్తం: ఉ.9-57 నుంచి 10-47 వరకు
తిరిగి మ.2-58 నుంచి 3-48 వరకు
రాహుకాలం: మ.1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5-47; సూర్యాస్తమయం: సా.6.20

మీరు సరేనంటేనే మీ ఖాతాలోకి సొమ్ము!

(మొదటి పేజీ తరువాయి)

ఆ వ్యక్తి బ్యాంకు ఖాతా సంఖ్య, బ్యాంకు ఐఎఫ్ఎస్ కోడ్ తెలిస్తే చాలు..సులభంగానే నగదు బదిలీ చేసుకునే వీలుంది. నోట్ల రద్దు సమయంలో చాలా మంది ఖాతాదార్లకు తెలియకుండానే వారి జన్‌ధన్ ఖాతాల్లో కొందరు తమ అక్రమ సంపాదనను బదిలీ చేయడంతో అలాంటివి మళ్లీ జరగకుండా ఉండేందుకు ఈ నిబంధన తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై అభిప్రాయం చెప్పాలని రిజర్వు బ్యాంకును కోరింది. రిజర్వు బ్యాంకు అనుమతిస్తే కొత్త నిబంధన అమల్లోకి రానుంది. దీని ప్రకారం ఎవరైనా మరొకరి ఖాతాలో సొమ్ము జమ చేయాలని అనుకున్నప్పుడు బ్యాంకు తొలుత ఆ ఖాతాదారుకు సందేశం పంపిస్తుంది. ఇందుకు ఖాతాదారు అంగీకరిస్తే వారి నుంచి కొంత ఛార్జీ తీసుకొని నగదు బదిలీ చేస్తుంది. ఈ ఛార్జీలు చెల్లించడానికి ఇష్టపడనివారికి సొమ్ము బదిలీ చేయడానికి అవకాశం లేదు.

ఎస్టీపీపీకి జాతీయస్థాయిలో గుర్తింపు

జైపూర్, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం(ఎస్టీపీపీ) విద్యుదుత్పత్తిలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై వరకు 91.74 శాతం (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) ఫీఎల్ఎఫ్‌ను సాధించి దేశంలోనే అయిదో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఇళ్లపై సౌరవిద్యుదుత్పత్తిలో రాష్ట్ర పనితీరు భేష్

ఈనాడు, హైదరాబాద్: ఇళ్లపై సౌరవిద్యుదుత్పత్తి(రూఫ్‌టాప్) కార్యక్రమం అమలులో మెరుగైన పనితీరుతో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని కేంద్ర నూతన, సంప్రదాయేతర ఇంధన వనరుల మంత్రిత్వశాఖ బుధవారం ప్రకటించింది. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ది స్టేట్ రూఫ్‌టాప్ ఆకర్షణీయ సూచిక(సరశ్)' పథకాన్ని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్కే సింగ్ ప్రారంభించారు. సరశ్‌లో ఐదు రకాల సూచికల ఆధారంగా రాష్ట్రాలకు ర్యాంకులు కేటాయించారు. సౌరవిద్యుత్ పొందడానికి వినియోగదారులకు సమాచారం ఇవ్వడం, ఆర్థిక సాయం, ప్రభుత్వ విధానాలు, సులభంగా పథకం అమలు, వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం వంటి అంశాల ఆధారంగా రాష్ట్రాలను ఎంపిక చేశారు. రూఫ్‌టాప్ కార్యక్రమంలో వినియోగదారుల అనుభవాలు అనే సూచికలో తెలంగాణ ప్రథమ ర్యాంకును కైవసం చేసుకుంది. రూఫ్‌టాప్ కార్యక్రమం అమల్లో రెండో స్థానంలో నిలిచింది.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విశాఖపట్నం	35.2	27.0
హన్మకొండ	35.2	27.0
విజయవాడ	35.1	26.2
గుంటూరు	34.4	25.6
ఖమ్మం	34.0	29.0
ఆదిలాబాద్	32.8	25.4
తిరుపతి	32.8	24.7
రామగుండం	32.6	26.4
నిజామాబాద్	32.1	23.9
కరీంనగర్	32.0	25.0
హైదరాబాద్	31.9	25.0
నల్గొండ	29.4	22.6
సూర్యాపేట	29.0	28.0
మహబూబ్‌నగర్	28.7	24.5
మెదక్	24.3	21.0

దాటితే గీత.. భారీ వాత

(మొదటి పేజీ తరువాయి)

వాటిని దశలవారీగా అమలు చేయాలని కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. డీలర్ల వద్దే రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సుల జారీ, రహదారి భద్రతా నిధి, ప్రైవేటు క్యాబ్ వ్యవస్థల స్థిరీకరణ, రవాణా వ్యవస్థలో సంస్కరణలు తదితర అంశాలను దశలవారీగా అమలులోకి తీసుకురానుంది.

అధిక బరువు భారమే

అధిక బరువు(ఓవర్ లోడ్)తో నడిచే సరకు రవాణా వాహనాలు, ఎక్కువ సంఖ్యలో ప్యాసింజర్లను ఎక్కించుకుని నడిపే వాహనాలకు భారీగా రుసుం వడ్డించనుంది. సరకు రవాణా వాహనాలు అధిక బరువుతో పట్టుపడిన పక్షంలో ప్రస్తుతం రూ.రెండు వేలు అపరాధ రుసుముగా, ప్రతి అదనపు టన్నుకు రూ.వెయ్యి అదనంగా వసూలు చేసేవారు. ఆ మొత్తాన్ని రూ.ఇరవై వేలకు పెంచారు. అదనపు బరువు టన్ను ఒక్కింటికి రూ.రెండు వేలుగా నిర్ణయించారు. అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకుంటే ఒక్కొక్కరికి రూ.వెయ్యి అపరాధ రుసుముగా వసూలు చేయనున్నారు. ద్విచక్ర వాహనంపై అధిక బరువును వినియోగిస్తే రూ.రెండు వేల అపరాధ రుసుముతోపాటు 3 నెలలపాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తారు. గతంలో రూ.వంద రుసుముగా విధించేవారు.

నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు విధించే అపరాధ రుసుము (రూ. లలో)

అతిక్రమణ	ప్రస్తుతం	పెంపు అనంతరం
శిరస్త్రాణం వాడకపోతే	100	1000, 3 నెలల అనర్హత
మద్యం మత్తులో వాహనం నడిపితే	2,000	10,000
సీటు బెల్ట్ పెట్టుకోకపోతే	100	1,000
డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడిపితే	500	5,000
అనర్హత వేటేసినా వాహనం నడిపితే	500	10,000
అధిక వేగం	400	1000–2000
ప్రమాదకరంగా వాహనం నడిపితే	1,000	5000 వరకు
అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకపోతే	–	10,000
వాహనానికి బీమా లేకపోతే	1,000	2,000
పర్మిట్ లేని వాహనానికి	5,000	10,000

అందరూ కదలాలి.. అడవులు పెరగాలి

- ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు - సిద్దిపేట

రాష్ట్రవ్యాప్తంగా అడవుల పునరుద్ధరణే లక్ష్యంగా కదలాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. అడవుల్లో మొక్కలు నాటి సంరక్షించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. కలెక్టర్ల సమావేశంలో భాగంగా రెండో రోజు క్షేత్రస్థాయి పర్యటనను చేపట్టారు. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ పర్యటనలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం 11.20 గంటలకు వీరంతా రెండు బస్సుల్లో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని సింగాయిపల్లికి చేరుకున్నారు. అడవుల పునరుద్ధరణను అక్కడ విజయవంతంగా చేపట్టిన తీరును వారు పరిశీలించారు. అనంతరం గజ్వేల్ మీదుగా వెళుతూ కోమటిబండ సమీపంలో మొక్కలను సంరక్షిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గజ్వేల్‌లోని ఈ ప్రాంతాల్లో అడవులను అభివృద్ధి చేసిన తీరును సీఎం కేసీఆర్ స్వయంగా కలెక్టర్లకు వివరించారు. కోమటిబండ వద్ద భోజనాలు చేసిన తర్వాత మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండపై మిషన్ భగీరథ పైలాన్‌ను మంత్రులతో కలిసి పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఏం చేశారో స్పష్టంగా వివరించారు

గజ్వేల్ అటవీ ప్రాంతంలో పునరుద్ధరణ చేపట్టిన తీరును అటవీశాఖ పీసీసీఎఫ్ ఆర్.శోభ, అడిషనల్ పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ కలెక్టర్లకు వివరించారు. అడవుల్లో ఉన్న రూట్‌స్టాక్‌ను ఉపయోగించుకొని సహజమైన పద్ధతిలో చెట్లను పెంచుతున్న విధానాన్ని అందరికీ అర్థమయ్యేలా తెలియజేశారు. అడవి చుట్టూ కందకాలు తీయడం వల్ల రక్షణ ఏర్పడుతుందన్నారు. లోపలి జంతువులు బయటకు వెళ్లకుండా, బయట జంతువులు లోనికి రాకుండా కందకాలు ఉపయోగపడతాయని వారికి తెలిపారు. వీటిలో నీరు నిల్వ ఉండటం వల్ల మొక్కలకు కావాల్సిన తేమ అందుతుందన్నారు. కందకాల కట్టలపై గచ్చకాయ చెట్లను నాటడంతో అడవికి సహజమైన రక్షణ ఏర్పడుతుందని తెలిపారు. వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచుతుండటం వల్ల కోతులు గ్రామాలు, పట్టణాల నుంచి అడవులకు వాపస్ వస్తున్నాయన్నారు. కాలుష్య సమస్యకూ మొక్కల పెంపకం పరిష్కారం చూపుతుందన్నారు. అటవీ భూముల్లో మొక్కలు పెంచడానికి వీలుగా కాంపా నిధులూ అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా వారు కలెక్టర్లకు తెలిపారు.

వివిధ అంశాలపై చర్చ

గజ్వేల్ పట్టణ సమీపంలో ఉన్న కోమటిబండపై ఉన్న మిషన్ భగీరథ ట్యాంకులు, సంపులను పరిశీలించారు. భోజనవిరామం అనంతరం సీఎం కేసీఆర్ కలెక్టర్లతో సమావేశమయ్యారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం, కొత్త పురపాలక చట్టం అమలుపై చర్చించారు. కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పన తీరుపై మాట్లాడారు. పల్లెలు, పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడాలనేది ప్రభుత్వ లక్ష్యమని సీఎం వారికి వివరించారు. ఇందుకోసం 60 రోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని వారికి సూచించారు. అవినీతికి ఆస్కారం లేకుండా, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేలా పారదర్శకమైన రెవెన్యూ చట్టానికి ప్రభుత్వ రూపకల్పన చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లారాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సమావేశాన్ని ముగించుకొని తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి... అక్కడి నుంచి తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు.

జీవవైవిధ్యానికి దోహదం

"సామాజిక అడవుల పెంపకంతో ఆవాస ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అడవుల పెంపకంతో వాతావరణంలో మార్పు వస్తుంది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పాటు జీవవైవిధ్యమూ పెంపొందుతుంది. మన రాష్ట్రంలో 66.48 లక్షల ఎకరాల అటవీ భూములున్నాయి. ఇది మన భూభాగంలో 23.4శాతం. ఇంత భూమి ఉన్నప్పటికీ అదే నిష్పత్తిలో అడవులు మాత్రం లేవు. దీనిని పరిగణనలోకి తీసుకొని పచ్చదనాన్ని పెంచేలా చొరవ తీసుకోవాలి. తలచుకుంటే అసాధ్యమేమీ ఉండదు. అందుకు మిషన్ భగీరథ పథకమే నిదర్శనం". అని ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టర్లతో అన్నారు.

మ్యుటేషన్ల బాధ్యత జేసీ లేదా ఆర్డీఓకు?

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయలోపం
- భూ సమస్యలకు ఇదే ప్రధాన కారణం
- వీఆర్వోల వ్యవస్థలో మార్పులు
- కలెక్టర్ల సమావేశంలో చర్చ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో భూ వివాదాలు, సమస్యలకు ప్రధాన కారణం శాఖల మధ్య సమన్వయలోపమేనని పలువురు కలెక్టర్లు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖల మధ్య అంతరం వల్ల.. రెవెన్యూ సమస్యలు తీవ్రమవుతున్నాయని వారంటున్నారు. ఈ శాఖల మధ్య సమన్వయం పెంచడానికి ప్రత్యేక చర్యలు అవసరమని పేర్కొంటున్నారు. ప్రధానంగా రెవెన్యూ-రిజిస్ట్రేషన్ సమన్వయంతో చాలా వివాదాలకు ముగింపు పలకవచ్చని హైదరాబాద్, చుట్టుపక్కల జిల్లాల కలెక్టర్ల ఉద్దేశంగా ఉంది. ప్రస్తుతమున్న మ్యుటేషన్ విధానంలో మార్పులపై కలెక్టర్లు చర్చించారు. తహసీల్దార్‌లు మ్యుటేషన్ ప్రక్రియను నిర్వహిస్తుండగా దీన్ని జాయింట్ కలెక్టర్ లేదా ఆర్డీఓల పరిధిలోకి తెస్తే ఎలా ఉంటుందని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది ఆచరణ సాధ్యమా? కాదా? అనే అంశంపై మరింత దృష్టి సారించాలనే చర్చ జరగ్గా జేసీలు, ఆర్డీఓలకు పని ఒత్తిడితో ఇది ఎంతవరకూ సాధ్యమవుతుందనేది చూడాలని కొందరు కలెక్టర్లు సీఎం సమావేశంలో పేర్కొన్నట్లు సమాచారం.

20 శాతం సమస్యలు ఎందుకు పరిష్కరించడంలేదు

మొత్తంగా 80 శాతం రెవెన్యూ సమస్యలను పరిష్కరించిన నేపథ్యంలో మిగిలిన 20 శాతం సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు సమస్యలు వస్తున్నాయని కలెక్టర్లను ముఖ్యమంత్రి ప్రశ్నించినట్లు తెలిసింది. భూవివాదాల వల్లే చాలా సమస్యలు కొలిక్కి రాలేదని పలువురు కలెక్టర్లు చెప్పారు. వీఆర్వోలలో అర్హులను రెవెన్యూశాఖలో కొనసాగిస్తూ మిగిలిన వారి సేవలను వేరే రూపంలో ఉపయోగించుకుంటే ఎలాఉంటుందన్న అంశంపై చర్చ జరిగింది. వీరిని పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి తీసుకురావాలనే అభిప్రాయంపైనా మాట్లాడారు. భూముల సమగ్ర సర్వే సబ్‌డివిజన్ చేస్తేనే భూ సమస్యలు చాలా వరకూ పరిష్కారమవుతాయని కలెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్వే, భూరికార్డులశాఖ నిర్వహిస్తున్న విధులపై చర్చ జరిగింది. శాఖ పని తీరులో సమూల మార్పులు, సర్వేకు ప్రైవేటు సంస్థలకు బాధ్యతలు అప్పగించే అంశం పరిశీలనకు వచ్చింది. భూముల సమగ్ర సర్వే అనంతరమే భూములకు కన్‌క్లూజివ్ టైటిల్ వ్యవస్థ తీసుకురావడం సాధ్యమవుతుందని కలెక్టర్లు సమావేశంలో చెప్పారు. రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం ముసాయిదా రూపకల్పనకు సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కలెక్టర్ల వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది.

మంత్రి ఈటల.. పరుగు పరుగునా!

కదులుతున్న బస్సును అందుకోవడానికి మంత్రి ఈటల పరుగులు పెడుతున్నట్లు అనిపిస్తోంది కదా ఈ చిత్రాన్ని చూస్తుంటే. సీఎం కేసీఆర్ బుధవారం జిల్లా కలెక్టర్లతో కలిసి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయిపల్లి అటవీ ప్రాంతానికి బస్సులో వెళ్లారు. ఈ కార్యక్రమానికి స్థానికులను అనుమతించలేదు. కొందరు స్థానిక ప్రతినిధులు వినతిపత్రాలను చూపుతూ రోడ్డుపక్కన నిలబడి ఉండటాన్ని గమనించిన సీఎం కేసీఆర్ మంత్రి ఈటలను పిలిచి వాటిని తీసుకురావాలని పురమాయించినట్లు కనిపించింది. వెంటనే ఈటల బస్సు దిగివచ్చి వినతిపత్రాలను స్వీకరించి ఇలా పరుగుపరుగున వెళ్లి బస్సెక్కారు.

– ఈనాడు, హైదరాబాద్

త్వరలో సీఎం జిల్లాల పర్యటన

ఈనాడు, హైదరాబాద్: ప్రగతిపనుల పరిశీలన కోసం త్వరలో తాను జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం కేసీఆర్ జిల్లా కలెక్టర్లకు వెల్లడించినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధులతో, అధికారులతో సమావేశాలు నిర్వహిస్తానని, ప్రాజెక్టులను సందర్శిస్తానని, హరితహారం, 60 రోజుల ప్రణాళికల అమలును తనిఖీ చేస్తానని చెప్పినట్లు సమాచారం. అలాగే జనవరిలో మళ్లీ కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నట్లు తెలిసింది.

ఆలిపై కోపంతో.. నాలుక తెగ్గోసుకున్నాడు!

నాలుక తెగిన స్థితిలో వైద్యశాలకొచ్చిన ఈ యువకుడి పేరు చిగుర్ల చంద్రయ్య. ఊరు నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం సార్లపల్లి. భార్య లింగమ్మతో మంగళవారం గొడవపడి, ఆ రాత్రంతా ఆగ్రహంతో రగిలిపోయి, బుధవారం ఉదయం కత్తితో నాలుక కోసేసుకున్నాడు. నోటి నుంచి రక్తం కారడం చూసిన తల్లి ముత్తమ్మ ఆరా తీస్తే, తెగిన నాలుక భాగాన్ని తీసి ఆమె చేతిలో పెట్టాడు! వెంటనే అచ్చంపేటకు, అక్కడినుంచి జిల్లాకేంద్ర ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. అప్పటికే ఆలస్యమవడంతో, నాలుకను తిరిగి అతికించే అవకాశమే లేదని డాక్టర్లు తేల్చిచెప్పారు.

– అమ్రాబాద్, న్యూస్‌టుడే

బడి..ఇలా ఉంటే ఎలాగండీ?

చిన్న చిన్న పిల్లలు. అప్పుడప్పుడే బడికి అలవాటుపడే వారు కొందరు. మూడు నాలుగేళ్లుగా బడికి వెళ్లే వారు మరికొందరు. అంతా పదేళ్లలోపువారే. రోజూ బడికి పోవాలన్న ఆసక్తి వారికి కలగాలన్నా...వారు ఆరోగ్యంగా ఉండాలన్నా అక్కడి పరిస్థితులు ఎలా ఉండాలి? అందంగా.. పసి మనసులను ఆకట్టుకునేలా..ఆహ్లాదకరంగా ఉండాలి కదా? కనీసం పరిసరాలైనా పరిశుభ్రంగా ఉండాలనుకోవడం అత్యాశ కాదు కదా? మా ఈ బడి చూడండి ఎలా ఉందో..నిజామాబాద్ శివారు సారంగాపూర్ లేబర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కన మురుగునీరు వేరుకుపోయింది. పాములు, దోమలు, క్రిమికీటకాలకు కేంద్రంగా మారింది. దుర్వాసన వెదజల్లుతూ విద్యార్థుల ఆరోగ్యాలను హరిస్తోంది. ప్రమాదకరంగా కూడా మారింది. మా గోడు వినండి..మా బడి చుట్టూ గోడ కట్టండి, ఈ దుస్థితిని దూరం చేయండని చిన్నారులు కోరుతున్నారు. అధికారులూ.. వింటారా? వారిని ఆదుకుంటారా?

– ఈనాడు, నిజామాబాద్

రెవెన్యూకి కొత్త పేరు భూమాత!

- సీఎం కేసీఆర్ పరిశీలన
- రెవెన్యూ విభాగాల విభజన
- ఆబ్కారీ, వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లకు కొత్త శాఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టిన పాలన సంస్కరణల్లో భాగంగా రెవెన్యూ శాఖకు కొత్త పేరు పెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారని తెలిసింది. రెవెన్యూలో అధిక శాతం భూములకు సంబంధించిన అంశాలే కావడంతో దానికి భూమాత అనే పేరును ఆయన పరిశీలిస్తున్నారు. రెవెన్యూ స్థానంలో పేరు మార్పిడితో పాటు పాలనకు సంబంధించిన అంశాలతో కూడిన కొత్త చట్టాన్ని వచ్చే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఇప్పటికే సీఎం నిర్ణయించారు. దీనికి సంబంధించి కసరత్తు నడుస్తోంది. జిల్లా కలెక్టర్లతోనూ మంగళ, బుధవారాల్లో దీనిపై ఆయన విస్తృత స్థాయిలో చర్చించారు. రెవెన్యూ శాఖను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు పలు ప్రతిపాదనలు రూపొందించారు. వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల్లో దీనిని విలీనం చేయాలనే సూచనలు వచ్చాయి. భూములకు సంబంధించిన అంశాలు కీలకం అయినందున విలీనం కంటే ప్రత్యామ్నాయం గురించి ఆయన యోచిస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ పేరుపై సీఎం విముఖతతో ఉన్నారు. ఆ పదం ఆంగ్లేయుల పాలన కాలంలో భూమి శిస్తు, పన్ను వసూళ్లకు సంబంధించినదని, ఇప్పుడు భూములకు సంబంధించి ఎలాంటి పన్నులు లేనందున రెవెన్యూ పదాన్ని తొలగించాలని భావిస్తున్నారు. దీనిలో భాగంగా ఆయన పలు పేర్లను పరిశీలిస్తున్నారు. భూపరిపాలన, ధరణి వంటి పేర్లతో పాటు భూమాత పేరుపైనా ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో భూమాత పేరుపై కేసీఆర్ ఆసక్తి చూపుతున్నారని తెలిసింది.

విడిగా ఆదాయార్జన శాఖలు

రెవెన్యూ పరిధిలో భూములకు సంబంధించిన శాఖతో పాటు ఆబ్కారీ, వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. రెవెన్యూశాఖకు కొత్త పేరు దృష్ట్యా భూపరిపాలనకు ప్రత్యేకంగా శాఖను ఏర్పాటు చేసి, మిగిలిన మూడు విభాగాలకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని సీఎం భావిస్తున్నారు. దీనికి పలు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. రెవెన్యూ పేరు మార్పిడి తర్వాత దీనిపైనా తుది నిర్ణయం తీసుకోనున్నారు

మహబూబ్‌నగర్ జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు

ఎన్ఐసీ 'ఇన్‌ఫర్మేటిక్స్' సంచికలో కథనం

మహబూబ్‌నగర్ అర్బన్, న్యూస్‌టుడే : పరిపాలనలో సాంకేతికతను జోడిస్తూ.. కాగితరహిత పాలనతో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు మహబూబ్‌నగర్ జిల్లా యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలు, చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం (ఎన్ఐసీ) ప్రచురించిన 'ఇన్‌ఫర్మేటిక్స్' తాజా సంచికలో జిల్లాలో చేపడుతున్న డిజిటల్ పాలన విధానాలు, నూతన ఆవిష్కరణలపై నాలుగు పేజీల కథనం ప్రచురితమైంది. మూడునెలలకోసారి ఈ సంచిక వెలువడుతుంది. మహబూబ్‌నగర్ జిల్లా వెబ్‌సైట్‌ను ఆవిష్కరించి డిజిటల్ ఇండియా అవార్డ్స్ 2018లో భాగంగా 'వెబ్‌రత్న- డిస్ట్రిక్ట్' పురస్కారాన్ని జిల్లా అధికారులు సాధించారు. జిల్లా అధికార యంత్రాంగం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై నిర్వహిస్తున్న సమీక్షలు, సమావేశాలను క్షణాల్లో ప్రజలు తెలుసుకునేందుకు 'మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్' పేరుతో జిల్లా పరిపాలన యంత్రాంగం 'మొబైల్ యాప్'ను రూపొందించింది. జిల్లాలో కాగిత రహిత పాలనకు శ్రీకారం చుడుతూ జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రోస్ చేపట్టిన ఈ-ఆఫీస్ (ఈ-కార్యాలయం) స్కోచ్-2018 అవార్డును పొందింది. ప్రజావాణి, బయోమెట్రిక్ హాజరు విధానం, ప్రభుత్వ శాఖలన్నీ ఈ-కార్యాలయం పరిధిలోకి రావడం, దస్త్రాల డిజిటలైజేషన్, అంతర్జాలంలో సమాచారహక్కు చట్టం దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం తదితర అంశాల నేపథ్యంలోనే ఇన్‌ఫర్మేటిక్స్ సంచికలో కథనం ప్రచురితమైనట్లు జిల్లా అధికారులు తెలిపారు.

15 శాతం తక్కువగా ఖరీఫ్ సాగు

- 9 జిల్లాల్లో వర్షాభావం
- వ్యవసాయశాఖ తాజా నివేదిక

ఈనాడు, హైదరాబాద్: ఖరీఫ్(వానాకాలం) సీజన్ పంటల సాగు సాధారణంకన్నా 15 శాతం తక్కువగా ఉందని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. ప్రధాన పంట వరి నాట్లు ఇంకా 18 శాతం విస్తీర్ణంలో వేయలేదని తెలిపింది. వరి సాధారణ విస్తీర్ణం 9.64 లక్షల హెక్టార్లకు 82 శాతం విస్తీర్ణంలో నాట్లు పడ్డాయి. పత్తి, రాగి పంటలు సాధారణంకన్నా ఎక్కువ విస్తీర్ణంలో వేశారు. మరే పంటా వందశాతం సాగు కాలేదు. రాష్ట్ర సాధారణ విస్తీర్ణం 43.34 లక్షల హెక్టార్లకు 37 లక్షల హెక్టార్లలో పంటలు సాగుచేశారు. గతేడాది ఇదే సమయానికి ఇంతకన్నా మరో లక్షా 13 వేల హెక్టార్లు ఎక్కువగా సాగైంది. జూన్, జులై నెలల్లో వర్షాభావం వల్ల పంటల సాగు తక్కువగా ఉంది. జూన్ ఒకటి నుంచి బుధవారానికి రాష్ట్ర సాధారణ వర్షపాతం 528.8 మిల్లీమీటర్ల(మి.మీ.)కు 491.2 మి.మీ.లు కురిసింది. గతేడాది ఇదే సమయంలో 565.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది ఇప్పటికి సాధారణంకన్నా 7 శాతం తక్కువ కురిసింది. మొత్తం 9 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 నుంచి 45 శాతం వరకు ఉంది. గత వారంలో వర్షాలు బాగా తగ్గడంతో 47 శాతం లోటు నమోదైంది.

కాంగ్రెస్‌ను వీడే యోచనలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కాంగ్రెస్‌ను వీడే యోచనలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం నుంచే తెరాస, భాజపా నాయకులు ఆయనతో మంతనాలు జరుపుతుండగా కాంగ్రెస్‌ను వీడేది లేదంటూ వారికి చెబుతూ వచ్చారు. ప్రస్తుతం ఆయన మనసు మార్చుకున్నట్లు తెలిసింది. మంగళవారం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లోని ప్రేమ్‌సాగర్‌రావు నివాసానికి వెళ్లి పార్టీని వీడవద్దంటూ కోరగా కాంగ్రెస్‌లో కొనసాగలేనని ఆయన తేల్చిచెప్పినట్లు సమాచారం.

మణుగూరులో ఎన్‌కౌంటర్

మావోయిస్టు దళ సభ్యుడి మృతి

పీవీకాలనీ (మణుగూరు), న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో బుధవారం ఉదయం మావోయిస్టులతో ఎదురు కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో జాడి వీరస్వామి (26) అనే మావోయిస్టు దళ సభ్యుడు మృతి చెందాడని వెల్లడించారు. ఘటనా స్థలంలో రెండు తపంచాలు, బుల్లెట్లు, ఒక బ్యాగు, విప్లవ సాహిత్యం పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరస్వామి మృతదేహాన్ని భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. మండలంలోని బుగ్గపంచాయతీ పరిధి ఆదివాసీ గ్రామం బుడుగుల సమీప అడవిలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక పోలీసు బలగాలు రెండు రోజుల నుంచి జల్లెడ పడుతున్నాయి. వీరస్వామి స్వస్థలం గుండాల మండలం దామరతోగు గ్రామం. తొలుత న్యూడెమోక్రసీలో అజ్ఞాత దళ సభ్యుడిగా పని చేసిన వీరస్వామి తరువాత మావోయిస్టు దళ సభ్యుడిగా చురుగ్గా పనిచేస్తున్నాడు. వీరస్వామి ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఘటనా స్థలానికి గ్రామస్థులను, మీడియాను పోలీసులు అనుమతించలేదు. ఎన్‌కౌంటర్ జరిగిందని చెబుతున్న ప్రదేశానికి బుడుగుల గ్రామం కూతవేటు దూరంలోనే ఉంది. తెల్లవారుజాము సమయంలో పెద్ద శబ్దం వినపడినట్లు ఆదివాసీలు తెలిపారు. బుడుగులలో ప్రతి ఇంటిని పోలీసులు తనిఖీ చేసి గ్రామస్థులను తీవ్రంగా కొట్టినట్లు వాపోయారు.

ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన జాడి వీరస్వామి

గోదావరి నీటి మళ్లింపుపై సమావేశం మళ్లీ వాయిదా

ఈనాడు హైదరాబాద్: గోదావరి నీటిని కృష్ణాబేసిన్‌కు మళ్లించడంపై రెండు రాష్ట్రాల ఇంజినీర్ల మధ్య గురువారం జరగాల్సిన సమావేశం వాయిదాపడింది. గోదావరి వరద నీటిని నేరుగా శ్రీశైలానికి, లేదా నాగార్జునసాగర్ ద్వారా శ్రీశైలానికి రోజూ నాలుగు టీఎంసీల నీరు మళ్లించేలా పథకం చేపట్టడంపై జూన్ ఆఖరులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల మధ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లు పాల్గొన్నారు. ముఖ్యమంత్రుల సమావేశానికి కొనసాగింపుగా ఇంజినీర్లు సమావేశమై పలు ప్రత్యామ్నాయాల గురించి చర్చించారు. జూలై 15లోగా రెండోసారి సమావేశం కావాలని, అప్పటికి ప్రతిపాదనలను ఓ కొలిక్కి తేవాలని నిర్ణయించారు. దీనికి తగ్గట్టుగానే తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్లు రెండేసి ప్రతిపాదనలు రూపొందించారు. పలు వాయిదాల అనంతరం తాజాగా ఈ నెల 22న సమావేశం కావాలని నిర్ణయించారు. అయితే వచ్చే వారం బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ సమావేశాలు ఉండటం తదితర కారణాల వల్ల సెప్టెంబరు మొదటి వారంలో సమావేశమవుదామని తెలంగాణ ఇంజినీర్లు సూచించినట్లు తెలిసింది. మొత్తమ్మీద గోదావరి నుంచి శ్రీశైలానికి నీటిని మళ్లించే పథకంపై ఆరంభంలో కనిపించిన ఉత్సాహం తర్వాత లేదని, మళ్లీ ముఖ్యమంత్రులు కలిసి చర్చిస్తే తప్ప ముందడుగు పడే పరిస్థితి కనపడటం లేదని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ సీనియర్ ఇంజినీర్ వ్యాఖ్యానించారు.

ఈనాడు

ఊరికి వైద్యం!

స్వాతంత్ర్యం పొందిన ఏడు దశాబ్దాల తరవాతా- ఆరోగ్య వ్యవస్థ వేరూనుకోని పల్లెపట్టుల్లో ప్రాథమిక వైద్యసేవలు సైతం నీరోడుతున్న దేశం మనది. స్వస్థ సేవల అందుబాటు, వాటి నాణ్యతల రీత్యా 195 దేశాల జాబితాలో భారత్ ఇప్పటికీ 145వ స్థానాన ఈసురోమంటోంది. అసంఖ్యాక పౌరులకు సర్కారీ వైద్యం అందని మానిపండైన తరుణంలో, గ్రామీణ ప్రాంతాలకు ఉపశమనం కలిగించే తీపికబురు అందించింది సర్వోన్నత న్యాయ స్థానం. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో స్నాతకోత్తర పట్టభద్ర(పీజీ), స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశం కోరే విద్యార్థులు విధిగా బాండునొ కదాన్ని సమర్పించాలని రాష్ట్రాలు షరతు విధిస్తుండటం తెలి సిందే. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్, గోవా, హిమా చల్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ్‌బంగ, రాజస్థాన్, తమిళనాడు ఎంబీబీఎస్ తరవాత చదువు కొనసాగించదలచిన ప్రతి వైద్య విద్యార్థీ గ్రామాల్లో కొన్నాళ్లు విధిగా సేవలందించాల్సిం దేనంటున్నాయి. ఆ మేరకు లిఖితపూర్వకంగా సమ్మతి తెలిపి నియమోల్లంఘనకు పాల్పడితే రూ.50లక్షల వరకు జరిమానా చెల్లించాల్సిందేనంటున్నాయి. జరిమానా మొత్తాన్ని రూ.20లక్షలకు పరిమితం చేయాలన్న సుప్రీంకోర్టు, గ్రామసేవ వ్యవధిని దేశవ్యా ప్తంగా రెండేళ్లుగా స్థిరీకరించాలని తాజాగా గిరిగీసింది. అందుకు అనుగుణంగా జాతీయస్థాయి విధాన రూపకల్పన బాధ్యతను కేంద్రప్రభుత్వానికి, కొత్తగా అవతరించనున్న ఎన్ఎమ్‌సీ (జాతీయ వైద్య కమిషన్)కి దఖలుపరచింది. రాష్ట్రాలు విధించిన షరతు దేశ పౌరులందరికీ జీవించే హక్కు ప్రసాదించిన ఇరవై ఒకటో రాజ్యాంగ అధికరణ స్ఫూర్తికి పట్టం కట్టిందని న్యాయమూర్తులు ప్రత్యేకంగా ప్రస్తుతించడం విశేషం. రాష్ట్రానికో తీరుగా కొలువుతీ ర్చిన నిబంధనల ఏకరూపతకు ఉద్దేశించిన ప్రక్షాళన కసరత్తు దరి మిలా దేశమంతటా పల్లెలకు వైద్యసేవలు ఇనుమడిస్తే, ఎన్నో కోట్లమందికి నిజంగానే అది మహాభాగ్యం!

కేంద్రీయ స్వాస్థ్య నిఘా సంస్థ (సీబీహెచ్ఐ) నాలుగేళ్ల క్రితం రూపుదిద్దిన 'జాతీయ ఆరోగ్య చిత్రణ'- దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 4.92 లక్షలు, ఊళ్లలో 1.83 లక్షల మేర ఆస్పత్రి పడ కలు ఉన్నట్లు నిర్ధారించింది. జనాభాలో 68 శాతానికి పైగా ప్రాతినిధ్యం కలిగిన పల్లెపట్టులు నేటికీ సరైన వైద్యసేవలు ఎండ మావులై అలమటిస్తున్నాయనడానికి ఆ అధ్యయనమే సాక్ష్యం పలుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో 19 శాతం లోపు అలోపతీ వైద్యులే వృత్తిపరమైన ప్రామాణిక నైపుణ్యాలు కలిగినవారన్న నివేదికాంశాలు నిరుడు గగ్గోలు పుట్టించాయి. దేశం నలుమూ లలా 20 శాతానికి పైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తరుగుప డ్డట్లు ఆమధ్య ప్రభుత్వమే లోక్‌సభాముఖంగా అంగీకరించింది. ఎకాయెకి 20 లక్షలమంది వైద్యులకు, 40 లక్షలమంది నర్సులకు కొరత జనభారతాన్ని కుంగదీస్తున్నట్లు గణాంకాలు సూచిస్తు న్నాయి. తమ జీవితకాలంలో ఏనాడూ స్పెషలిస్ట్ డాక్టర్ని చూడని భారతీయుల సంఖ్య సుమారు 70 కోట్లుగా లెక్కతే లింది. వెరసి, గ్రామీణ వైద్యం గాలిలో దీపమైంది! ఒక్కో ఎంబీ బీఎస్ విద్యార్థిపైనా ఏటా రూ.31 లక్షలకు పైగా వ్యయం చేస్తు న్నట్లు లోగడ అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ అధ్యయనం మదింపు వేసింది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న 'సుప్రీం' న్యాయమూర్తులు- ప్రభుత్వపరంగా ప్రతి వైద్యవిద్యార్థి మీదా భారీ ఖర్చు దృష్ట్యా గ్రామాల్లో వారి సేవలు పొందగోరడమన్నది చట్టవ్యతిరేకం, నిర్హేతుకం కానేకాదని కరాఖండీగా తీర్మానిం చారు. పల్లెలకు స్పెషలిస్ట్ వైద్యసేవలు ఒనగూడాల్సిందేనన్న ఈ విశిష్ట తీర్పు సత్వరం అక్షరాలా అమలుకు నోచుకునేలా విధివి ధానాల కూర్పు, కార్యాచరణ చురుకందుకోవాలిప్పుడు!

దేశంలో వైద్యుల కొరతను అధిగమించేందుకంటూ వారి పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచుతూ ప్రధాని మోదీ, 'ఆరోగ్య సేవలు అందకుండా పేదలు అవస్థలపాలు కారాదు' అని మూడు సంవత్సరాల క్రితం యంత్రాంగానికి పథనిర్దేశం చేశారు. అప్పట్లోనే పార్లమెంటరీ స్థాయీసంఘం ధ్రువీకరణ ప్రకారం- దేశంలో సరైన వైద్యసేవలందక ఏటా కడతేరిపోతున్న అభాగ్యుల సంఖ్య దాదాపు 24 లక్షలు. సకాలంలో చికిత్స చేస్తే ప్రాణాంతకం కాని 32 రకాల వ్యాధులు, గాయాల పాలబడి నేలరాలిపోతున్న దీనుల సంఖ్య ప్రాతిపదికన దేశీయ వైద్య రంగ ప్రతిష్ఠ తెగ్గోసుకుపోతూనే ఉంది. 70 శాతం ఆస్పత్రులు పట్టణాల్లోనే ఉన్న కారణంగా, సర్కారీ వైద్యం అక్కరకు రాని చుట్టమైన పల్లెవాసులు- కుటుంబంలో ఎవరు అనారోగ్యం పాలబడినా నిస్సహాయంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అలా ఏటా ఆర్థికంగా చితి కిపోతున్నవారి సంఖ్య ఆరు కోట్లకు పైబడినట్లు పార్లమెంటరీ స్థాయీసంఘమే గణించింది. ఈ దురవస్థకు, వైద్యుల నిర్బంధ గ్రామసేవ ఒక్కటే విరుగుడు కాబోదు. చాలాచోట్ల ప్రాథమిక వస తుల నిత్యక్షామం వెక్కిరిస్తోంది. తాగునీరు, విద్యుత్తు వంటి మౌలి కావసరాలూ తీరనిచోట్ల సేవలందించాలంటేనే ఎందరో బెంబేలెత్తి పోతున్నారు. కొరతల కొలిమిలో మగ్గుతున్న గ్రామాల ముఖచి త్రాన్ని తేజరిల్లజేసే విధ్యుక్త ధర్మ నిర్వహణను ప్రభుత్వాలిక ఎంత మాత్రం ఉపేక్షించే వీల్లేదు. ఊళ్లు తేటపడితే వైద్యుల తలపై మొట్టి నిర్బంధంగా వారిని పల్లెబాట పట్టించాల్సిన అగత్యం ఏముం టుంది? గ్రామాల్లోని భిన్న వాతావరణ స్థితిగతుల్లో రకరకాల వ్యాధుల చికిత్సా పద్ధతుల్లో ఆరితేరితే, ఆ విశేషానుభవం అనంతర కాలంలో వైద్యులకు ఎంతగానో ఉపయుక్తమవుతుంది. స్వచ్ఛం దంగా ఆ అవకాశాన్ని వైద్యవిద్యార్థులు అందిపుచ్చుకోగల స్థితిగ తులు నెలకొల్పడంలో ప్రభుత్వాలు నెగ్గుకురావాలి!

వాస్తవాలకు వక్ర భాష్యం



కె.రామకోటేశ్వరరావు

గత కొద్దిరోజులుగా పాకిస్థాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ అసహనంగా ఉన్నారు. నోటి దురు సుతనం చూపిస్తున్నారు. జరగరానిది ఏదో జరి గినట్లు, ప్రపంచం మొత్తం భారత్ చర్యల్ని ఖండించాలని అదేపనిగా కోరుతున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. త్వరలో ప్రపంచ ఉగ్ర వాద వ్యతిరేక సంస్థ (ఎఫ్ఏటీఎఫ్) ముందు పాకి స్థాన్ తన నిర్దోషిత్వం నిరూపించుకోలేకపోతే దానిని 'బ్లాక్‌లిస్ట్'లో చేర్చడం ఖాయంగా కనిపిస్తోంది. తాజాగా జమ్ము-కశ్మీర్‌కు సంబం ధించి భారత ప్రభుత్వం తీసుకున్న సంస్థాగత, పాలన మార్పులపై ఇమ్రాన్ గగ్గోలు పెడుతున్నారు. చైనా, పరిమిత స్థాయిలో బ్రిటన్ తప్ప అంతర్జాతీయ సమాజం దీనిపై పెద్దగా స్పందించలేదు. ఇరుదేశాలు ద్వైపాక్షికంగా పరిష్క రించుకోవలసిన అంశమని దాదాపుగా అన్ని దేశాలూ తేల్చిచెప్పాయి. కశ్మీ ర్‌కు సంబంధించి పాక్ వాదనలో సహేతుకత లోపించింది. అర్థరహిత వాద నలతో అది అంతర్జాతీయ సమాజాన్ని నమ్మించాలని చూస్తోంది. చరిత్రను పరికిస్తే పాక్ వాదనలోని డొల్లతనం బయట పడుతుంది.

అదను చూసి దాడి

భారత్, పాకిస్థాన్ విభజన జరిగిన 1947 నాటికి జమ్ము-కశ్మీర్ మహా రాజు హరిసింగ్ ఏ దేశంలో చేరకుండా స్వతంత్ర దేశంగా ఉండాలని నిర్ణ యించుకున్నారు. అదే ఏడాది అక్టోబరులో పాకిస్థాన్ ప్రభుత్వం ఆదివా సులను, వాయవ్య సరిహద్దు రాష్ట్రంలోని పఠాన్లను రెచ్చగొట్టి శ్రీనగర్‌పై దాడికి దిగింది. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో హరిసింగ్ భారత్‌తో విలీన ఒప్పందంపై సంతకం చేశారు. ఆ ప్రతిపై మౌంట్ బాటన్ ఆమోదముద్ర వేసిన తరవాతనే భారత సైన్యం శ్రీనగర్‌కి వెళ్లింది. కానీ ఒప్పందంలో లేక పోయినా మరుసటిరోజు మౌంట్‌బాటన్ మహారాజుకి ఉత్తరం రాస్తూ పరి స్థితులు కుదుటబడిన తరవాత ప్రజల అభిప్రాయాన్ని కోరతామని చెప్పడం వెనుక పెద్ద కుట్ర ఉంది. పాకిస్థాన్ అధీనంలో కొంత భూభాగం ఉండటం, దానిపై భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితికి విన్నవించడం, జమ్ము-కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కావాలని మనమే అడగటం అందరికి తెలిసిందే. ఆ తరవాత ఐక్యరాజ్యసమితి దానిపై తీర్మానం చేసింది. అందులో మొదటి షరతు పాకిస్థాన్ తన సైన్యాన్ని, తాను మద్దతిచ్చిన ఆదివాసులను ఉపసంహరించాలని చెప్పింది. ఆ తరవాత భారత సైన్యాన్ని రక్షణ అవసరాల వరకు ఉంచి దఫాల వారీగా ఉపసంహరించాలని పేర్కొంది. పరిస్థితులు కుదుటపడిన అనంతరం ప్రజాభి ప్రాయసేకరణ జరగాలని సూచించింది. దీన్ని పాకిస్థాన్ తిరస్కరించింది. ఆ తరవాత అందుకు భారత్ సైతం ఒప్పుకోలేదు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. ఐక్యరాజ్య సమితి తీర్మానంలోగాని, 1947 భారత ప్రభుత్వ చట్టంలోగానీ సంస్థానాలు స్వతంత్రంగా ఉండా లని చెప్పలేదు. అవి ఏదో ఒక దేశంతో ఒప్పందం చేసు కోవాలని మాత్రమే ఉంది. 1947 భారత ప్రభుత్వ చట్టం, 1935 భారత ప్రభుత్వ సవరణ చట్టంలోగానీ ప్రజాభి ప్రాయం జరపడానికి ఏ నిబంధన లేదు. మహారాజు

కశ్మీర్‌పై పాక్ కట్టుకథలు

చేసే ఒప్పందమే అంతిమం. న్యాయపరంగా చూస్తే ఆ ఒప్పందం స్పష్టమైన హక్కు కలిగిన దస్తావేజు.

పాకిస్థాన్ ఆక్రమించుకున్న ప్రాంతానికి వారు 'ఆజాద్ కశ్మీర్' అని పేరు పెట్టారు. ఆజాద్ అంటే స్వేచ్ఛ. ప్రస్తుతం అక్కడ అదే కరువయ్యింది. ఆజాద్ కశ్మీర్‌కు అసెంబ్లీతో పాటు 'మండలి' కూడా ఉంది. దీనికి ఎక్కువ అధికారాలు ఉన్నాయి. అందులో ఎనిమిది మంది సభ్యులు కశ్మీర్ నుంచి, ఆరుగురు పాక్ ప్రభుత్వం నుంచి ప్రతినిధులుగా ఉంటారు. దీనికి ఛైర్మన్‌గా పాక్ ప్రధానమంత్రి వ్యవహరిస్తారు. దీన్నిబట్టే 'ఆజాద్ కశ్మీర్' కు ఏపాటి స్వేచ్ఛ ఉందో అర్థమవుతుంది. 'ఆజాద్ కశ్మీర్'లోనైనా, గిల్గిట్ బాల్టిస్థాన్‌లోనైనా రాజకీయ కార్యకలాపాలు సాగించాలంటే ముందుగా పాకిస్థాన్‌కు విధేయు డినని ప్రకటించాలి. లేనట్లయితే ఇంతే సంగ తులు. అటువంటిది భారత్ ఆధీనంలోని జమ్ము-కశ్మీర్‌కు సంబంధించిన అధికరణలు 370, 35ఏ గురించి మాట్లాడే హక్కు పాక్‌కు లేనేలేదు. ఈ విషయమై పాక్ అంతర్జాతీ యంగా నానా యాగీ చేస్తోంది. భద్రతామం డలి జోక్యానికి అర్థించి భంగపడింది. ఇటీవల తమ దేశంలోని పంజాబ్ ప్రావిన్స్‌కి మేలు చేయడం కోసం ముజఫరాబాద్ మీదుగా ప్రవహించే నీలం నది నీటిని టన్నెల్ ద్వారా జీలం నదికి మళ్లించింది. దీనితో ముజఫరాబాద్ నగరం నీళ్లు లేక అల్లాడుతోంది. ఇది 'ఆజాద్ కశ్మీర్' రాజధాని. అక్కడ స్థానికులకు బదులుగా క్రమంగా పాక్ పంజాబీల ఆధి పత్యం మొదలయ్యింది. కశ్మీరీలకు అక్కడ ఎటువంటి స్వయం పాలన లేదు.

రహస్యంగా ఆక్సాయిచిన్ ప్రాంతంలో టిబెట్- సింకియాంగ్ రహదారిని చైనా 1950లలో నిర్మించి భారత్‌తో స్నేహానికి తూట్లు పొడిచింది. నెహ్రూ మొదట్నుంచీ చైనా అంటే అభిమానంగా ఉండేవారు. భారత్ పట్ల ఆ కమ్యూనిస్ట్ దేశం ఉదారంగా వ్యవహరిస్తుందని భావించారు. కానీ భారత్‌పై దాడి చేస్తుందని ఆయన కలలో సైతం ఊహించలేదు. 1962 యుద్ధంతో చైనాపై భ్రమలన్నీ తొలగిపోయాయి. తాజాగా వివాదాస్పద భూభాగం నుంచి చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా నిర్మాణానికి పూనుకోవడం ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీసింది.

దెయ్యాలు వేదాలు వల్లించడమే...

మానవ హక్కుల గురించి పాకిస్థాన్, చైనా మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లో పాకి స్థాన్ పూర్తిగా మానవ హక్కులను మంటగలిపింది. ఒక్క జింజెర్ జిల్లా లోనే 300కు పైగా యువకులు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని పత్రికలు ఇటీవల బయటపెట్టాయి. 2016 మార్చి 14న బలవరిస్థాన్ నాయకుడు అబ్దుల్ హమీద్ ఖాన్ గిల్గిట్-బాల్టిస్థాన్‌లో రాజకీయ, మతపరమైన వేధింపులు ఎక్కువయ్యాయని అప్పటి ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి బాన్‌కి మూన్‌కి విన్నవించారు. న్యాయ, రాజ్యాంగ పరమైన హక్కులను పాలకులు హరించివే స్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బలూచిస్థాన్‌లో ఏ విధంగా మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయో తెలిసిందే. దేశ విభజన సమయంలో పాకిస్థాన్ వెళ్లిన ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ ముస్లిములు అక్కడ రెండో తరగతి పౌరు లుగా దుర్భర జీవనం సాగిస్తున్నారు. వాళ్లనే ముజాహిర్లని పిలుస్తారు.

ఇక చైనా విషయం సరే సరి! 1950లో టిబెట్‌ని బల వంతంగా ఆక్రమించింది మొదలుకొని టిబెటన్లు వేధింపులకు గురి చేస్తోంది. ప్రభుత్వ నిర్బంధాన్ని తట్టుకోలేక దలైలామా నాయ కత్వాన 1959లో టిబెటన్లు భారత్ పారిపోయి వచ్చిన సంగతి తెలిసిందే. బౌద్ధ భిక్షువులను ఏ విధంగా హింసిస్తుందీ చూస్తున్నాం. ఇటీవల కాలంలో జింజియాంగ్ ప్రావిన్స్‌లో వీగర్ ముస్లిములపై చైనా ఉక్కుపాదం మోపింది. వారిని వివిధ రకాలుగా వేధింపులకు గురి చేస్తోంది. దాదాపు 10 లక్షల మంది వీగర్లను పునర్విద్య పేరుతో నిర్బంధ శిబిరాల్లో ఉంచారు. రెండో ప్రపంచయుద్ధంలో యూదులను హిట్లర్ ఏ విధంగా శిబిరాల్లో నిర్బంధిం చారో ఇప్పుడు చైనా అధినేత షి జిన్‌పింగ్ సైతం జింజి యాంగ్ ప్రావిన్స్‌లో వీగర్ ముస్లిముల పట్ల అదే విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. చివరకు వీగర్ ముస్లిములు ఏ పేరు పెట్టుకోవాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి, ఏ రకమైన ప్రార్థనలు చేయాలో కూడా ప్రభుత్వమే నిర్దేశిస్తోంది. 'మొహమ్మద్' లాంటి పేర్లు పెట్టు కుంటే అంగీకరించడం లేదు. అలాంటి చైనా మానవ హక్కులు, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యా స్పదం! దురుద్దేశంతో పాక్, చైనా చేసే వ్యాఖ్యలను భారత్ పట్టించుకోవలసిన పని లేదు. దారి తప్పిన కశ్మీర్ యువ తను ఎంత త్వరగా ప్రధాన స్రవంతిలోకి తీసుకురాగలమా అన్న విషయంపైనే దృష్టి పెట్టాలి. ఈ దిశగా వేగంగా అడుగులు వేయడం ఇప్పుడు న్యూదిల్లీ ముందున్న కర్తవ్యం!

(రచయిత– సామాజిక, రాజకీయ విశ్లేషకులు)

మౌంట్‌బాటన్ మోసం

భారత్ విభజనకు సూత్రధారి బ్రిటన్. ఇందులో మహమ్మదాలీ జిన్నా పాత్రధారి మాత్రమే. ఇటీవల వెలుగులోకి వచ్చిన సాక్ష్యాధారాలు ఈ విషయాన్ని వెల్లడిస్తు న్నాయి. అప్పట్లో బ్రిటన్, నాటి సోవియట్ యూనియన్ మధ్య ఆధిపత్యపోరు నడిచేది. ఇందులో భాగంగా తమకు భారత నైరుతి సరిహ ద్దులోని కరాచీ నుంచి కశ్మీర్ దాకా ఓ సురక్షిత స్థావరం కావాలని బ్రిటన్ భావించి విభజనకు కుట్ర పన్నింది. వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో ఎన్నికైన పార్లమెంటు సభ్యులను విస్మరించి ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్‌కి కట్టబెట్టింది. అంతకు ముందు జరిగిన ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ మెజారిటీ స్థానాలు సాధించింది. మౌంట్‌బాటన్ శ్రీనగర్ వెళ్లి కశ్మీర్ మహారాజుకు పాకిస్థాన్‌లో చేరమని సలహా ఇచ్చారు. అది కుద రకపోవటంతో గిల్గిట్-బాల్టిస్థాన్ ప్రాంతంలో మేజర్ బ్రౌన్ నాయక త్వాన తన సైన్యాధికారులతో తిరుగుబాటు చేయించి పాకిస్థాన్‌కు ఆ భాగాన్ని అప్పజెప్పారు. ఆ తరవాత చెప్పిన పని సక్రమంగా చేసినందుకు మేజర్ బ్రౌన్‌కి యోధుడుగా మహారాణి బిరుదు ఇచ్చి సన్మానం చేసింది.

రక్షకులను కాటేస్తున్న భక్షకులు

తరతరాలుగా వస్తున్న వార సత్వ సంపదనే కాదు పర్యావర ణాన్ని, సహజ వనరులను రక్షిం చుకోవడం ప్రస్తుతం ఒక సవా లుగా మారింది. ఈ ప్రయ త్నంలో పర్యావరణ పరిరక్షకులు, ఉద్యమకారులు ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. గడచిన 15 ఏళ్లలో 1,700 మంది పర్యావరణ రక్షకులు మృత్యువాత పడ్డా రని 'గ్లోబల్ విట్నెస్' అనే స్వచ్ఛంద సంస్థ నివేదిం చింది. 2018లోనే 164 హత్యలు చోటుచేసుకున్నాయి. అత్యధికంగా 30 హత్యలు ఫిలిప్పీన్స్‌లో నమోద య్యాయి. కొలంబియా 24, భారత్ 23 హత్యలతో తర వాతి స్థానాల్లో నిలిచాయి. తమిళనాడులో స్టెరిలైట్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో 13 మంది చని పోవడం 2018లోనే అతిపెద్ద పర్యావరణ వ్యతిరేక నరమేధంగా 'గ్లోబల్ విట్నెస్' అభివర్ణించింది. ప్రాణాలు కోల్పోయినవారిలో సామాజిక కార్యక ర్తలు, న్యాయవాదులు, పాత్రికేయులు, ఇతర స్వచ్ఛంద సంస్థల సిబ్బంది ఉంటున్నారు. మైనింగ్ తవ్వకాలు, నీటి ప్రాజెక్టులు, వ్యవసాయ, వాణిజ్య పారిశ్రామిక రంగాల్లో హత్యల పరంపర కొనసాగుతున్నట్లు అధ్యయనం స్పష్టీకరించింది.

మెక్సికోకు చెందిన జులియన్ కరిల్లో అనే సామాజిక ఉద్యమకారుడు మాదకద్రవ్యాల సాగు, గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాటం చేసినందుకు రెండేళ్ల వ్యవధిలో అయి దుగురు కుటుంబ సభ్యులతో పాటు ఇంటిని కూడా కోల్పోయారు. చివరకు నిరుడు అక్టోబ రులో సాయుధ దుండగుల చేతిలో కరిల్లో దారుణ హత్యకు గురికావడం ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల సంఘాలను కలవరపరచింది. ఈ తరహా పోరాటాల్లో నమోదుకాని హత్యలు మరెన్నో ఉంటాయన్నది నిర్వివాదం. అత్యంత హింసాత్మక ఘటనలు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయని అంత ర్జాతీయ నివేదికలు స్పష్టీకరిస్తున్నాయి.

'వనరుల రక్షణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని సాధికారతవైపు నడిపించే పర్యావరణ రక్షకులను హింసిస్తూ చంపుతున్నారు. ప్రతి పోరాటం వెనక పదుల సంఖ్యలో కార్యకర్తలు వేధింపులకు గుర వుతుంటారు. చట్టవిరుద్ధ అరెస్టులు, పరువు నష్టం వ్యాజ్యాల వంటివి అందులో ఉంటాయి.

పర్యావరణ పరిరక్షకులపై దాడుల ఘటనలు అధి కంగా లాటిన్ అమెరికా దేశాల్లో జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా భారత్‌లోనూ ఈ విపరీత పోకడ పెచ్చరిల్లు తోంది. ఫలితంగా పర్యావరణ వ్యతిరేక దేశమన్న అప వాదు పడుతోంది. 2015లో ఆరు, 2016లో 16, 2017లో మూడు హత్యలు మనదేశంలో చోటుచేసుకోగా, నిరుడు ఏకంగా 23 హత్యలు నమోదుకావడం విషాదం. కర్ణా టక, తమిళనాడు మొదలు మేఘాలయా వరకు దాడుల పరంపర కొనసాగుతోంది. కర్ణాటకలోని ధాండేలి ప్రాంతంలో 'కాళీనది'పై నిర్మిస్తున్న వరస డ్యాములకు వ్యతిరేకంగా పోరాడుతున్న అజిత్ మానికేశ్వర్ నాయక్ అనే సామాజిక ఉద్యమకారుడు సాయుధ దుండగుల చేతిలో అత్యంత కిరాతకంగా హతుడయ్యారు. నిరుడు తమిళనాడులో ఇసుక అక్రమ తవ్వకాలపై పరిశీలనకు వెళ్లిన కానిస్టేబుల్ జగదీశన్ హత్య అక్కడి మాఫియా బరితెగింపునకు తిరుగులేని దాఖలా. ఒడిశాలో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా డోంగ్రియా కోంధుల ఆక్రోశం, మేఘాలయలో అక్రమ మైనింగ్‌పై పోరాడిన అగ్నెస్ కార్షింగ్‌పై దాడి, తెలుగు రాష్ట్రాల్లో ఇసుక మాఫియా అరాచకాలు మచ్చుకు కొన్ని మాత్రమే.

తమిళనాడులో స్టెరిలైట్ వ్యతిరేక ఉద్యమం (పాతచిత్రం)

పర్యావరణ వేత్తల హత్యలు

సహజ వనరులకు ప్రపంచ వ్యాప్తంగా పెద్దయెత్తున గిరాకీ ఏర్పడటంతో ఈ రంగంలో తీవ్రపోటీ నెలకొంది. మరోవైపు పర్యావరణ చట్టాలు బలహీ నంగా ఉన్నాయి. దీనివల్ల అవినీతి పెచ్చరిల్లుతోంది. సహజవనరులు అడ్డగోలుగా దోపిడీకి గురవుతు న్నాయి. అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన చోటు చేసుకుంటోంది. కలప, ఇసుక, ఇంధనం, ఖనిజవనరుల కోసం కావాల్సిన భూభాగాన్ని స్థానికులనుంచి బలవం తంగా లాక్కునే ధోరణి ప్రపంచంవ్యాప్తంగా కొనసాగు తోంది. వనరులున్న భూభాగాన్ని ప్రజావసరాల పేరిట చేజిక్కించుకునే పెడధోరణి ప్రబలుతోంది. కార్పొరేట్ సంస్థలు, గుత్తేదారులు, రాజకీయ నాయకులు, మాఫియాల కన్నుపడి సాగుతున్న భూదందాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తమ ప్రయో జనాల కోసం ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు ఉద్యమకారుల్ని అణచివేయడానికి భౌతిక దాడు లకూ తెగబడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో చట్టాలను అడ్డుపెట్టుకుని ఉద్యమకారులను ఖరీ దైన కోర్టు వ్యవహారాల్లోకి లాగుతున్న వైనాన్నీ 'గ్లోబల్ విట్నెస్' విశదీకరించింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలతోపాటు అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లోనూ పర్యా వరణ పరిరక్షణ ఉద్యమకారులకు బెదిరింపులు, వేధింపులు తప్పడం లేదని పలు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆందోళన చెందుతున్నాయి.

మనదేశంలో ఇలాంటి కేసుల సత్వర పరి ష్కారం కోసం ప్రత్యేక మానవ హక్కుల కోర్టులను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు పలుమార్లు ఆదేశిం చినా, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసు కోవడం లేదు. 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మెరుగైన పర్యావర ణాన్ని, ప్రకృతి ప్రసాదించిన వనరులను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది' అన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పర్యావరణ పరి రక్షణ పట్ల స్పృహతో మెలగాలి. పర్యావరణ పరిరక్ష ణకు పాటుపడుతున్న కార్యకర్తలకు అండగా నిలుస్తూ ఆయా స్వచ్ఛంద సంస్థలను బలోపేతం చేయాలి!

– అనిల్ కుమార్ లోడి

ఈనాడు లేఖలు

అవినీతిని అరికట్టాలి

సాంకేతిక పరిజ్ఞానంతో అవినీతికి కళ్లెం వేయవ చ్చనే ఆలోచనతో తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చారు. 'ఈ-సేవ, ధరణి, మీ భూమి...' వంటి సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నారు. దీనివల్ల ఆశించిన స్థాయిలో ఫలితం రావడం లేదు. అవినీతి అధికారుల కార్య కలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి. పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు, రుణాలు పొందా లంటే ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. లంచాలిస్తేనే పనులు త్వరగా అవుతున్నాయి. అవినీతి నిరోధక శాఖ ఎందరినో ప్రత్యక్షంగా పట్టుకుంటున్నా, ప్రయో జనం ఉండటంలేదు. అధికారులు కక్షగట్టి ప్రభుత్వ పథకాలు అందకుండా చేస్తారనే భయంతో ఫిర్యాదు చేసేందుకు ఎందరో వెనకాడుతున్నారు. అవినీతిని కూకటివేళ్ళతో పెకలించేందుకు ప్రభుత్వాలు సాహ సోపేత నిర్ణయాలు తీసుకోవాలి.

- బి.గురులింగం, అబ్దుల్లాపూర్ మెట్, హైదరాబాద్

సహ చట్టంపై చైతన్యం

రాష్ట్రంలోని ప్రభుత్వాధికారులకు సమాచార హక్కు (సహ) చట్టంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇటీవల వాతావరణ వివరాలు అడిగినందుకు ఓ పౌరుడిని లక్షల రూపాయల్లో రుసుం చెల్లించాల్సిం దిగా అధికారులు డిమాండ్ చేసి, అందరినీ ఆశ్చర్యప రచారు. పలుచోట్ల ఇలాంటి చేదు అనుభవాలే చాలా మందికి ఎదురవుతున్నాయి. ఈ ధోరణులు చట్టం ఉద్దేశాలకే తూట్లు పొడిచేలా ఉన్నాయి. ఇప్పటికే ఈ చట్టానికి పలు సవరణలు చేశారు. ఫలితంగా ఈ చట్టం నిస్సారంగా మారిందన్న అభిప్రాయాలు వినపడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం పొందడం ప్రజల హక్కు. ప్రజా ప్రయో జనాలకోసం రూపొందిన ఈ చట్టంపై జిల్లా స్థాయి అధికారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టాలి.

- వావిలాల రాజశేఖరశర్మ, నాగర్ కర్నూల్

అంతర్యామి

త్యాగం ఒక యోగం

చేసే పనిని కర్మగా వర్ణించింది భగవద్గీత. ఇంద్రియాలతో ఆచరించే ప్రతి పనీ కర్మయో గమే. చూడటం, వినడం, తాగడం, తినడం... ప్రతిదీ కర్మలోని భాగమే. కర్మల ఫలితమే మనిషి జీవన విధానమని భగవద్గీత అయిదో అధ్యాయం చెబుతోంది.

పూర్వం చేసిన పనులు సంచితమని, వర్త మానంలో ఆచరించేవి ప్రారబ్ధమని, రాబోయే కాలంలో చేయబోయే పనులు ఆగామిగా విభజించారు. కర్మను అనుసరించి ఫలం అందుతుంది.

ధ్వనికి ప్రతిధ్వని, స్పందనకు ప్రతిస్పందన ఎలా సాధార ణమో కర్మకు ఫలితం అలాంటిదే. రెండు చేతులు చరిస్తే వచ్చే చప్పట్ల శబ్దాన్ని చెవులు అనుభవిస్తాయి. మనసు, శరీరం కలిసి చేసే కర్మల ఫలాన్ని మనిషి పొందుతాడు. నవ్వుతూ తప్పుచేస్తే

ఈ-కామర్స్‌పై మాంద్యం ప్రభావం స్వల్పమే

- అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్
- హైదరాబాద్‌లో అమెజాన్ అతిపెద్ద కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్‌లో నూతన అమెజాన్ ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ. పక్కన ఆ సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్, జాన్ స్కాట్లర్

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ముసురుకుంటున్న నేపథ్యంలో ఈ-కామర్స్‌పై దాని ప్రభావం స్వల్పమేనని అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, కంట్రీ మేనేజర్ అమిత్ అగర్వాల్ పేర్కొన్నారు. భారత్‌లోని రిటైల్ వ్యాపారంలో కేవలం 3 శాతమే ఈ-కామర్స్ వాటా ఉందని, ఇది చాలా స్వల్పమేనని అన్నారు. ఇప్పటివరకు ఆర్థిక మాంద్యం ప్రభావంతో వ్యాపారం తగ్గిందన్న సూచనలు కనిపించలేదన్నారు. ఈ-కామర్స్ వ్యాపారంలో వృద్ధికి ఎంతో అవకాశం ఉందని తెలిపారు. ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచంలో అతిపెద్దదైన ప్రాంగణాన్ని బుధవారం తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. ఆ సంస్థకు అమెరికా వెలుపల ఉన్న సొంత కార్యాలయాల్లో ఇదే మొదటిది. ఆర్థిక రాజధాని నానక్‌రామ్‌గూడలో 9.5 ఎకరాల్లో 30లక్షల చదరపు అడుగుల మేరకు దీన్ని నిర్మించింది. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. సులభతర వ్యాపార నిర్వహణలో ముందున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. అమెజాన్ ఇక్కడ డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అమిత్ అగర్వాల్ మాట్లాడుతూ.. భారత్‌లో తమ సంస్థకు దాదాపు 62,000 మంది పూర్తి స్థాయి ఉద్యోగులు ఉన్నారని, అందులో మూడోవంతు హైదరాబాద్‌లోనే పనిచేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ ప్రాంగణంలో అమెజాన్ ప్రైం, అమెజాన్ పే లాంటివి ప్రధానంగా ఉండబోతున్నట్లు తెలిపారు. దేశీయంగా దాదాపు 5,00,000 మంది వ్యాపారులు అమెజాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని అమిత్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలోనే కాకుండా.. అంతర్జాతీయంగా కూడా వస్తువులను విక్రయించేందుకు 50,000 మంది ముందుకు వచ్చారని తెలిపారు. అమెజాన్ వినియోగదారులకు ఇక్కడి నుంచి వస్తువులను ఎగుమతి చేయడం ప్రారంభించామని, ఇప్పటికే ఈ వ్యాపారం 100 కోట్ల డాలర్లను దాటిందన్నారు. మూడేళ్లలో ఇది 500 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అమెజాన్ స్థిరాస్తి, వసతుల విభాగం వైస్ ప్రెసిడెంట్ జాన్ స్కాట్లర్ మాట్లాడుతూ.. తమ సంస్థ 40 దేశాల్లో 300 ప్రదేశాల నుంచి వ్యాపారాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. తెలంగాణలో 32 లక్షల క్యూబిక్ ఫీట్ల నిల్వ సామర్థ్యంతో మూడు ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలున్నాయన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ తెలంగాణకు గర్వకారణం: కేటీఆర్

అమెజాన్ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాంగణాన్ని హైదరాబాద్‌లో నిర్మించడంపై తెరాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంపై తాను ఎంతో ఆనందిస్తున్నట్లు చెప్పారు. ఇది తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తుందని బుధవారం ట్విటర్‌లో తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతిదాయక ఐటీ విధానాలతో తెలంగాణ అగ్రస్థానంలో నిలవడానికి ఆ శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ సహకరిస్తున్నారని పేర్కొన్నారు. 2016లో అమెజాన్ ప్రాంగణ శంకుస్థాపన ఫోటోలను ఆయన ఈ సందర్భంగా జత చేశారు.

కాన్సుల్ జనరల్ జోయెల్ రిఫ్మాన్‌ను కాన్సులేట్‌లోకి ఆహ్వానిస్తున్న సిబ్బంది

కాన్సుల్ జనరల్‌గా జోయెల్ రిఫ్మాన్ బాధ్యతల స్వీకరణ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కాన్సుల్ జనరల్‌గా జోయెల్ రిఫ్మాన్ బాధ్యతలు స్వీకరించారు. బంగ్లాదేశ్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. మంగళవారం రిఫ్మాన్ బాధ్యతలు స్వీకరించినట్లు బుధవారం కాన్సులేట్ ఓ ప్రకటనలో పేర్కొంది. రిఫ్మాన్ గతంలో వాషింగ్టన్ డీసీ, అఫ్గానిస్థాన్, ఇరాక్, పనామా, పాకిస్థాన్‌లలో వివిధ హోదాల్లో పనిచేశారు. స్టేట్ డిపార్ట్‌మెంట్‌లో చేరకముందు ఆయన అమెరికా ఎయిర్ ఫోర్స్ జడ్జిగా పనిచేశారు. మిషిగన్ విశ్వవిద్యాలయం నుంచి ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ, సదరన్ మెథడిస్ట్ వర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఇటీవలి వరకు కాన్సుల్ జనరల్‌గా ఉన్న కేథరిన్ హడ్డా మూడేళ్ల పదవీ కాలం పూర్తికావటంతో తిరిగి అమెరికా వెళ్లారు.

భారత్-అమెరికా బంధం పటిష్ఠమైంది: రిఫ్మాన్

భారత్-అమెరికాబంధం పటిష్ఠమైందని జోయెల్ రిఫ్మాన్‌అన్నారు. ప్రత్యేకించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశారాష్ట్రాలతో బలమైన వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలున్నాయని చెప్పారు. రెండు దేశాలమధ్య బంధాలను మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానని వెల్లడించారు.

వడ్డేపల్లికి 25న 'సరస్వతీ సమ్మాన్' ప్రదానం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఈ సంవత్సరం విఖ్యాత సరస్వతీ సమ్మాన్ పురస్కారాన్ని సాహితీవేత్త వడ్డేపల్లి కృష్ణకు ప్రకటించారు. గత ఐదున్నర దశాబ్దాలుగా ఆయా రాష్ట్రాల భాషల్లోని నిష్ణాతులకు ఈ జాతీయస్థాయి అవార్డులిస్తున్నామని అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ (భోపాల్) హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు ఆచార్య కడారి సత్యమూర్తి తెలిపారు. సమ్మాన్‌తో పాటు భారత్ భాషా భూషణ పురస్కారాల ప్రదానోత్సవం ఈ నెల 25వ తేదీన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి చేతులమీదుగా జరుగుతుందన్నారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు సతీష్ చతుర్వేది ఆధ్వర్యంలోని కమిటీ ఈసారి వడ్డేపల్లిని ఎంపిక చేసిందని బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో మరింత తెలుగు సమాచారం, సేవలు

'గూగుల్'తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్ : ప్రభుత్వ సమాచారాన్ని, సేవలను ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా పూర్తిగా తెలుగులో పొందవచ్చు. దీనికి అనుగుణంగా సమాచార లభ్యతను పెంచడంతో పాటు, డిజిటల్ సేవలు రాష్ట్ర మంతటా విస్తరించేలా ఉమ్మడి కృషి జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం..ప్రముఖ సంస్థ గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పత్రాలపై బుధవారం హైదరాబాద్‌లో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, గూగుల్ దక్షిణాసియా సంచాలకుడు చేతన్ కృష్ణస్వామి సంతకాలు చేశారు. డిజిటలీకరణ లక్ష్యాలు సాధించడం, వాటిల్లో భాగంగా ఆ ప్రాజెక్టులను విజయవంతంగా అమలుచేయడం, వివిధ విభాగాలకు సాంకేతిక సహాయం-సలహాలను విస్తరించడం..కీలకం. నవలేఖ పేరిట ప్రజలకు, స్థానిక అంకుర పరిశ్రమలకు, చిన్న-మధ్యత రహా పరిశ్రమలకు అంతర్జాలం నుంచి సమాచారమివ్వడం మరింత ప్రధానం. వీటన్నింటికీ ఈ ఒప్పంద అంశాలు సహకరిస్తాయి.

కాళేశ్వరం జ్ఞాపికలకు రూ.1.66 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభ సమయంలో అతిథులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన వెండి జ్ఞాపికలకు రూ.1.66 కోట్లు వ్యయం కాగా ఇందులో 83.43 లక్షలను విడుదల చేస్తూ సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధరొన్హా బుధవారం ఉత్తర్వులు వెలువరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభ సమయంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులతోపాటు ఇతర ముఖ్యులు, ప్రాజెక్టు నిర్మాణానికి తోడ్పాటు అందించిన బ్యాంకుల ఉన్నతాధికారులు, పలువురు అతిథులను రాష్ట్ర ప్రభుత్వం సన్మానించింది. ఈ సందర్భంగా వెండితో తయారు చేసిన జ్ఞాపికలను అందజేసింది. వీటి తయారీకి మొత్తం 180 కిలోల వెండి వినియోగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుపూర్ స్థాయికి చేరుకోవాలి

- సిరిసిల్ల వస్త్రోత్పత్తి పరిశ్రమ విస్తరణకు ప్రణాళికలు
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

సమీక్షలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో చేనేతడైరెక్టర్ శైలజారామయ్యర్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్యే బాలకిషన్

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల: దేశం గర్వించదగ్గ వస్త్రోత్పత్తులకు నిలయమైన తిరుపూర్ స్థాయికి సిరిసిల్ల వస్త్రోత్పత్తులు చేరుకోవాలని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆకాంక్షించారు. మరమగ్గాల వస్త్రోత్పత్తి పరిశ్రమలోకి కొత్తతరాన్ని ఆహ్వానించేలా బహుముఖ వ్యూహంతో ప్రభుత్వం ముందుకుసాగుతోందని ఆయన తెలిపారు. బుధవారం ఆయన సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సిరిసిల్లలో ఒకప్పటి నేతన్నల చేదు జ్ఞాపకాలను దూరం చేస్తూ నవీన ఆవిష్కరణలు తీసుకువచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని నేతన్నలకు గణనీయమైన మద్దతు, గౌరవం, భద్రతతో జీవనోపాధిని కల్పించామన్నారు. సిరిసిల్లలో 40.50 కోట్ల మీటర్ల వస్త్రాల ఆర్డర్లను కేటాయించామని, తద్వారా ప్రస్తుతం ఒక్కో కార్మికునికి నెలకు సగటున రూ.16 వేల నుంచి రూ.20 వేల ప్రతిఫలం వరకు లభిస్తోందని చెప్పారు.

నేరుగా సంక్షేమ ఫలాలు

నేతన్నల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఐదేళ్లుగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ నేతృత్వంలో రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాలను విడివిడిగా జియోట్యాగింగ్ చేసినట్లు చెప్పారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా పరిశ్రమలోని అన్నివర్గాలకు చేరుతాయన్నారు. సిరిసిల్ల వస్త్రోత్పత్తులు తిరుపూర్‌తో పోటీపడాలంటే.. కార్మికుల్లో నైపుణ్యాలు మెరుగుపడాలని కేటీఆర్ అన్నారు. ఇందుకోసం టెక్స్‌టైల్ పార్కులో రూ.108 కోట్లతో ఉమ్మడి వసతుల కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పార్కులో ఇప్పటికే రూ.14.50 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, జేసీ యాస్మిన్‌బాషా, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

ఈనాడు, దిల్లీ: ఓబీసీల అభ్యున్నతి కోసం మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఓబీసీల సమస్యల పరిష్కారంపై వెనుకబడిన తరగతుల సాధికార సంఘం (బీసీసీఈ), అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య (ఏఐబీసీఎఫ్) సంయుక్తాధ్వర్యంలో దిల్లీలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో కేంద్ర మాజీ మంత్రి శరద్‌యాదవ్ మాట్లాడుతూ.. ఓబీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. బీసీసీఈ అధ్యక్షుడు, మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీలు, ఆ పరిధిలోకి రాకుండా ఆయా రాష్ట్రాల్లో బీసీలుగా ఉన్న వారిని ఏకం చేసేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. దామాషా ప్రకారం అన్నివర్గాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. సమావేశంలో జస్టిస్ ఎం.ఎన్.రావు, జస్టిస్ రామలింగేశ్వరరావు, ప్రొఫెసర్ తిరుమలి, పలువురు ప్రొఫెసర్లు, న్యాయవాదులు, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీంలో పిటిషన్

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో ఇంటర్ పరీక్షల మూల్యాంకనం తప్పిదాలతో విద్యార్థుల ఆత్మహత్యలకు దారితీసిన పరిణామాలపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరుతూ బాలల హక్కుల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు సంఘం గౌరవాధ్యక్షుడు అచ్యుతరావు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

'నవయుగ' వ్యాజ్యంలో మధ్యంతర ఉత్తర్వులపై నేడు నిర్ణయం

ఈనాడు, అమరావతి: పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు పనుల ఒప్పందాన్ని ఏపీజెన్‌కో రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ నవయుగ సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై గురువారం హైకోర్టు నిర్ణయాన్ని వెల్లడించనుంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్‌ఎస్ సోమయాజులు ముందుకు ఈ వ్యాజ్యం విచారణ జాబితాలోకి వచ్చింది. జల విద్యుత్ ప్రాజెక్టు పనులను ఇతరులకు అప్పగించకుండా నిలువరించాలని, తమనే కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ హైకోర్టును అభ్యర్థించిన విషయం తెలిసిందే.

బొప్పాయి చెట్టు.. పెరిగింది అదిరేట్టు

తాటి చెట్టును పోలిన బొప్పాయి చెట్టు ఇది. బొప్పాయి చెట్టు పది అడుగుల వరకు పెరగడం సర్వసాధారణం. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో కత్తుల వెంకన్న ఇంట్లో 30 అడుగుల ఎత్తు పెరిగింది. మూడేళ్లలోనే తాటి చెట్టంత ఎత్తుకు పెరిగిందని వెంకన్న తెలిపారు.

- న్యూస్‌టుడే, తుంగతుర్తి గ్రామీణం

20 రోజులు.. 850 టీఎంసీలు

- ఆగస్టులో ఇంత ప్రవాహం.. శ్రీశైలం చరిత్రలో రెండోసారి
- 2006-07లో 1054 టీఎంసీలు

ఈనాడు - హైదరాబాద్

ఎగువ నుంచి వరద తగ్గడంతో జూరాల, శ్రీశైలం గేట్లు మూత పడ్డాయి. జులై 31న జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయగా, ఆగస్టు తొమ్మిదిన శ్రీశైలం గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి ప్రవాహం తగ్గడంతో ఈ రెండు ప్రాజెక్టుల నుంచి గేట్ల ద్వారా నీటి విడుదలను నిలిపివేసి విద్యుదుత్పత్తి ద్వారానే బుధవారం దిగువకు వదిలారు. ఇరవై రోజుల్లో శ్రీశైలంలోకి 850 టీఎంసీలు వచ్చాయి. ఆగస్టులో ఇంత అత్యధిక ప్రవాహం రావడం జలాశయం చరిత్రలో ఇది రెండోసారి. 1967-68 నుంచి శ్రీశైలం వద్ద నెలల వారీగా వచ్చిన ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2006-07 సంవత్సరం ఆగస్టు నెలలో 1054 టీఎంసీల నీరు వచ్చింది. దీనిని అధిగమించాలంటే వచ్చే పది రోజుల్లో మరో 204 టీఎంసీలు రావాల్సి ఉంటుంది. ఆలమట్టి లేదా తుంగభద్రకు మళ్లీ భారీ వరద వస్తేనే ఇది సాధ్యమవుతుంది.

జులై 30న జూరాలలో విద్యుదుత్పత్తి చేసి దిగువకు విడుదల చేయగా, జులై 31న గేట్లు ఎత్తి నీటిని వదిలారు. జూరాలలోకి మొత్తం 800 టీఎంసీల నీరు వచ్చింది. జూరాల ఆయకట్టుతోపాటు నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, 9.357 టీఎంసీలు ఉంది. బుధవారం సాయంత్రం ఆరుగంటల సమయానికి జూరాల విద్యుత్తు కేంద్రం ద్వారా 32,712 క్యూసెక్కులు, తుంగభద్ర నుంచి వచ్చే నీరు సుంకేశుల వద్ద 22,613 క్యూసెక్కులు కలిపి 55,325 క్యూసెక్కులు దిగువకు వస్తోంది. దీంతో రాత్రికి శ్రీశైలంలోకి ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉండటంతో గేట్లు మూసేశారు.

10 లక్షల క్యూసెక్కుల విడుదల

కుడి, ఎడమగట్టు విద్యుదుత్పత్తి కేంద్రాలు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, కల్వకుర్తి, హంద్రీనీవా ఎత్తిపోతల పథకాలకు కలిపి లక్షా పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, 884.90 అడుగుల మేర నీరు ఉంది. పూర్తిస్థాయిలో 215 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. దిగువన నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ అన్నీ పూర్తి స్థాయి నిల్వలతో ఉన్నాయి. తుంగభద్రకు కూడా ఈ సంవత్సరం ఆగస్టులో 190 టీఎంసీలు వచ్చింది.

6వ మోటారు ద్వారా గ్రావిటీ కాలువలోకి చేరుతున్న నీరు

గోలివాడ పంప్‌హౌస్ 6వ మోటారుకు వెట్‌రన్

రామగుండం, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడలోని కాళేశ్వరం పథకం పార్వతి(సుందిళ్ల) బ్యారేజీకి సంబంధించిన పంపుహౌస్ 6వ మోటారును బుధవారం సాయంత్రం ప్రయోగాత్మకంగా (వెట్‌రన్) పరీక్షించారు. మోటారును అరగంట పాటు నడిపించి, కాళేశ్వరం జలాలను గ్రావిటీ కాలువలోకి పంపారు. అక్కడి నుంచి నీరు ఎల్లంపల్లి జలాశయంలోకి చేరింది. గోలివాడ పంపుహౌస్‌లో ఇప్పటివరకు 6 మోటార్ల వెట్‌రన్ పూర్తి చేసినట్లు ప్రాజెక్టు ఈఈ బండ విష్ణుప్రసాద్, డీఈ నీరటి నరేష్‌లు తెలిపారు. ఈ నెలాఖరులోగా 7, 8వ మోటార్లు, సెప్టెంబరు 15లోగా 9వ మోటారు వెట్‌రన్‌ను పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు.

అక్టోబరులో హుజూర్‌నగర్ ఉపఎన్నిక!

కేసీఆర్ అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలి: ఉత్తమ్

దేవరకొండ, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ శాసనసభ నియోజకవర్గానికి అక్టోబరులో ఉపఎన్నిక జరిగే అవకాశముందని టీపీసీసీ అధ్యక్షుడు, నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప ఎన్నికలో పోలీసులు అధికార తెరాసకు అనుకూలంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అవినీతి పాలన కొనసాగిస్తూ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిని కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు.

4 నెలలు.. 100 వాట్సాప్ ఆదేశాలు

పాఠశాల విద్యాశాఖ అధికారులకు సూచనలు

ఈనాడు, హైదరాబాద్: కొన్ని ఆదేశాలు.. మరికొన్ని సూచనలు.. అదీ వాట్సాప్ గ్రూపులోనే. కేవలం నాలుగు నెలల్లో మొత్తం 100కు చేరుకున్న నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి బుధవారం వాటిపై అధికారులతో సమీక్షించారు. ప్రతి ఆదేశానికి, సూచనకు ఒక సర్క్యులర్ రూపొందించడం కాకుండా ఎప్పటికప్పుడు పాఠశాల విద్యాశాఖలోని వివిధ విభాగాధిపతులకు వివిధ అంశాలు, సమస్యలపై సలహాలు, ఆదేశాలు ఇచ్చేందుకు జనార్దన్‌రెడ్డి 'డెడికేటెడ్ ఇన్‌స్ట్రక్షన్స్ స్కూల్ వాట్సాప్ గ్రూపు రూపొందించారు. ఏప్రిల్ 28వ తేదీన మొదటి సూచన ఇచ్చారు. బుధవారంతో వంద పూర్తయ్యాయి. ఈక్రమంలో వాటిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారు? వాటి పురోగతిపై ఆయన సమీక్షించారు. అందులో ఒకటి డీఈఓ కార్యాలయాలను ఈ-ఆఫీసులుగా తీర్చిదిద్దాలని ఆదేశాలివ్వగా ఇప్పటివరకు పురోగతి లేదు. దాంతో అక్టోబరు 2 వరకు ఆ పని పూర్తి చేయాలని తుదిగడువు నిర్ణయించారు.

రిజర్వేషన్ అమల్లో ఆదర్శంగా నిలవాలి: ఎర్రోళ్ల శ్రీనివాస్

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ నిబంధనలు(రూల్ ఆఫ్ రిజర్వేషన్) పాటించడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా రిజిస్ట్రార్లు చొరవ చూపాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కోరారు. వర్సిటీల్లో అమలవుతున్న రిజర్వేషన్లపై ఆయన తన కార్యాలయంలో వర్సిటీల రిజిస్ట్రార్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీ, బ్యాక్‌లాగ్ ఖాళీల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్ఓఆర్) అమలు చేయాలని కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా గస్తీ సిబ్బందికి మార్గదర్శకంగా ఉండేలా ప్రామాణిక నిర్వాహక విధానానికి(స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్) సంబంధించి రూపొందించిన పుస్తకాన్ని డీజీపీ మహేందర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. బ్లూకోల్ట్స్‌తో ఇతర గస్తీ సిబ్బంది విధి నిర్వహణ సమయంలో అనుసరించాల్సిన విధానాలను ఇందులో పొందుపరిచారు. కార్యక్రమంలో అదనపు డీజీలు రవిగుప్తా, గోవిందసింగ్, జితేందర్ పాల్గొన్నారు.

–ఈనాడు, హైదరాబాద్

'ఎంఈవోలు, ఎస్‌వోలుగా సంఘ నేతలొద్దు'

ఈనాడు, హైదరాబాద్: ఇన్‌చార్జి మండల విద్యాధికారులు(ఎంఈవో), డీఈవో కార్యాలయాల్లో సెక్రటేరియల్ అధికారులు(ఎస్‌వో)గా ఉపాధ్యాయ సంఘాల నేతలను నియమించరాదని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య కోరారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘాల నేతలు ఉండటం వల్ల తనిఖీల పేరిట ఉపాధ్యాయులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కో ఎంఈవోకు నాలుగైదు మండలాల బాధ్యతలు ఇవ్వడం వల్ల వారు న్యాయం చేయలేకపోతున్నారని, సీనియర్ ప్రధానోపాధ్యాయుడిని ఇన్‌చార్జి ఎంఈవోగా ఒక్క మండలానికే నియమించాలని సూచించారు.

109 రోజులను 8కి కుదించలేదు

- వార్డుల విభజనకు మాత్రమే 8 రోజులు
- అభ్యంతరాలన్నీ నిబంధనల ప్రకారమే పరిష్కారం
- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని 109 రోజుల నుంచి 8 రోజులకు కుదించలేదని, వార్డుల విభజన ప్రక్రియకు మాత్రమే 8 రోజులు గడువు నిర్దేశించినట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. వార్డుల విభజన నిమిత్తం ఇచ్చిన జీవో 459లో 8 రోజులు గడువు విధించామని, అన్ని మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు సులభంగా ఏకరూప విధానంలో విభజన ప్రక్రియ కొనసాగించడానికి ఈ జీవో జారీ చేసినట్లు తెలిపింది. జూన్ 30 నుంచి జులై 7లోగా విభజన షెడ్యూలును నిర్దేశిస్తూ జీవో 459 జారీ చేశామంది. వార్డుల విభజనకు మార్గదర్శకాలతో జారీ చేసిన జీవో 78లో ఎలాంటి గడువు లేదని హైకోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఎన్నికల గడువును కుదించడంపై ఆదిలాబాద్‌కు చెందిన అంజుకుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్ కుమార్ హైకోర్టులో అదనపు అఫిడవిట్ దాఖలు చేశారు. వార్డుల విభజన తరువాత మూడో దశలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రచురణకు షెడ్యూలు జారీ చేసిందని, సింగిల్ జడ్జి దీనికి 30 రోజుల గడువు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ దీన్ని 7 రోజులకు కుదించిందన్నారు. ఈ పిటిషన్‌లపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. అదనపు కౌంటరు దాఖలు చేశామని గురువారం విచారణ చ

ఆదిలాబాద్‌లోని విమానాశ్రయ మైదానాన్ని పరిశీలిస్తున్న ఏఏఐ డీజీఎం అమిత్‌కుమార్, చిత్రంలో ఎంపీ సోయం బాపురావు, జడ్పీఛైర్మన్ రాథోడ్ జనార్దన్

విమానాశ్రయాల ఏర్పాటుకు త్వరలో నివేదిక

ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఏఏఐ బృందం

ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఈనాడు, నిజామాబాద్: విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించి స్థలం పరిశీలనలో భాగంగా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) బృందం బుధవారం ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పర్యటించింది. ముందుగా ఆదిలాబాద్ పట్టణ శివారులోని ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. రన్‌వే, గాలి వీడనం, ప్రయాణికుల రాకపోకలు, అందుబాటులో ఉన్న వనరులు, స్థలసేకరణ వంటి సాంకేతిక అంశాలను క్రోడీకరించి నెల రోజుల్లోగా ప్రాథమిక నివేదికను రూపొందిస్తామని ఏఏఐ బిజినెస్ విభాగం డీజీఎం అమిత్‌కుమార్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్, అర్గుల్, కొలిప్యాక్, తొర్లికొండ గ్రామాల నడుమ ఉన్న 1,600 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు బృందానికి చూపించారు. వాయు దిశ, అవసరమైన భూమి, ఈ ప్రాంతం నుంచి విమాన ప్రయాణ అవసరం అంశాలు పరిశీలిస్తున్నట్లు డీజీఎం అమిత్‌కుమార్ తెలిపారు. తాము చూసిన భూమి ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు.

యూనిట్ జాతీయ సగటు ధర రూ.3.60

కేంద్ర ఈఆర్‌సీ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ కొనుగోలుకు జాతీయ సగటు ధర(ఏపీపీసీ)ను నిర్ణయిస్తూ కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) తాజాగా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ సగటు ధర యూనిట్‌కు రూ.3.60గా ఖరారు చేసింది. దీన్నే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2019-20)లో విద్యుత్ కొనుగోలుకు ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఐదేళ్ల(2015-20)లో ఏపీపీసీ యూనిట్ ధరను మండలి రూ.3.40 నుంచి రూ.3.60కు పెంచింది. గతేడాది అన్ని రాష్ట్రాల విద్యుత్ కొనుగోలు ధరలు, కొన్న కరెంటు వివరాల ఆధారంగా ఈ ఏడాదికి ఏపీపీసీని ఖరారు చేసినట్లు మండలి స్పష్టం చేసింది. ఇందులో కరెంటు సరఫరా వ్యయం కలపలేదని తెలిపింది.

అప్పీలును ఉపసంహరించుకున్న చెన్నమనేని

అనుమతించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: భారత పౌరసత్వం వ్యవహారంలో అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం వెలువరించాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ గత నెల సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన అప్పీలును వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బుధవారం ఉపసంహరించుకున్నారు. పౌరసత్వం విషయంలో తాను తప్పుడు సమాచారం ఇచ్చానని సింగిల్ జడ్జి తప్పుగా పేర్కొన్నారంటూ చెన్నమనేని దాఖలు చేసిన అప్పీలుపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అనుకూలంగా వచ్చిన తీర్పుపై అప్పీలు దాఖలు చేయడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. పౌరసత్వం వ్యవహారంలో చెన్నమనేని తప్పు చేసినట్లుగా కేంద్రం పేర్కొన్నప్పటికీ.. సింగిల్ జడ్జి ఆ మాట వాడలేదన్న విషయాన్ని గమనించాలంది. ఇందులో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో అప్పీలును ఉపసంహరించుకుంటానన్న చెన్నమనేని అభ్యర్థనను అనుమతించింది.

ఎన్‌కౌంటర్‌పై సాక్షుల వాంగ్మూలం నమోదుకు ఆదేశం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జులై 31న జరిగిన లింగయ్య ఎన్‌కౌంటర్‌కు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయాలని ఇల్లెందు మేజిస్ట్రేట్‌కు బుధవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సాక్షులకు రక్షణ కల్పించాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పిటిషన్‌పై బుధవారం మరోసారి విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

ఏప్రిల్ 1 నుంచి జనగణన

ఈనాడు, హైదరాబాద్: దేశంలో 2021 జనాభా లెక్కల రిజిస్టర్ తయారీ కోసం వచ్చే సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా జనాభా గణన జరగనుంది. అసోం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం సెప్టెంబరు 30 వరకు సాగుతుంది. ప్రతి పది సంవత్సరాల కొకసారి జనాభా గణన జరుగుతోంది. తాజా ఇంటింటా పౌరుల గణన కోసం కేంద్రహోంశాఖ ప్రకటన విడుదల చేయగా దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంసెట్ బైపీసీ తుది విడత సీట్ల కేటాయింపు పూర్తి

ఈనాడు, హైదరాబాద్: బీఫార్మసీ, ఫార్మా డి, బీటెక్ సాంకేతిక కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి, ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు చివరి విడత సీట్లను బుధవారం కేటాయించారు. తుది విడత సీట్లు పొందినవారు ఈ నెల 26వ తేదీలోపు వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కళాశాలల్లో చేరాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిత్తల్ తెలిపారు.

వైద్యవిద్య యాజమాన్య కోటా ప్రవేశాలు రేపే

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్యకళాశాలల్లో యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాలకు సంబంధించి రెండో విడత ప్రవేశ ప్రక్రియను ఈ నెల 23న నిర్వహిస్తారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆచార్య రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో ధ్రువపత్రాల పరిశీలన, ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటాయని కాళోజీ ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్య కోటా అర్హుల జాబితాలోని అభ్యర్థులందరూ మొదటి నుంచి చివరి ర్యాంకు వరకు హాజరు కావచ్చని తెలిపారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించినా కళాశాలల్లో చేరనివారు రెండో విడతకు అనర్హులని, మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు. తొలి విడత ప్రవేశాల అనంతరం యాజమాన్య కోటాలో 65 ఎంబీబీఎస్ సీట్లు, ప్రవాస భారతీయ కోటాలో 145 సీట్లు మిగిలి ఉన్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానములు
నిఘా మరియు భద్రత విభాగం, తిరుపతి

ఈ-టెండరు ప్రకటన

దిగువ దేవాలయాలకు వర్క్ కాంట్రాక్ట్ క్రింద సెక్యూరిటీ సర్వీసెస్ ఏర్పాటుకుగాను ఆన్‌లైన్ ద్వారా (ఈ-టెండరు) టెండర్లు ఆహ్వానిస్తూ ఈ-టెండర్లు కోరడమైనది.

(1) File Roc.No.C1/2077/V&SO/TTD/TPT/2019:
శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, తిరిదే ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్, చెన్నై, వివిఆర్ ధర్మశాల, రాయచేటి, తిరిదే ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్స్, కురిచి, వేలూరు మరియు మదురై.
బిడ్స్ స్వీకరించుటకు ఆఖరు తేదీ మరియు సమయం : 30-08-2019

(2) File Roc.No.C1/15822/V&SO/TTD/TPT/2017:
మొత్తం సెక్యూరిటీ సర్వీసులన్నీ కూడా తి.తి.దే విద్యాసంస్థల పద్దనే అనగా ప్రీ స్కూల్స్ 1వ తరగతి నుంచి 12వ తరగతి/ ఇంటర్మీడియేట్ విద్యాసంస్థల పద్దనే
బిడ్స్ స్వీకరించుటకు ఆఖరు తేదీ మరియు సమయం : 07-09-2019

వెబ్‌సైట్: https://tender.apeprocurement.gov.in నుంచి టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం: 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నెం: 2264554 మరియు మెయిల్ ఐడి: cvsoofficettd@gmail.com

టెండరు సమయంలో అప్‌లోడ్ చేయవలసిన అటెస్టెడ్ డాక్యుమెంట్ల జాబితా:
(1) డిమాండు డ్రాఫ్ట్ రూపములో ధరావతు.
(2) ప్రీ-క్వాలిఫికేషన్ క్రైటీరియాలో తెలియచేసిన డాక్యుమెంట్లు.
(3) వర్క్ రిజిస్ట్రేషన్. (4) జిఎస్‌టి రిజిస్ట్రేషన్.
(5) పాన్ కార్డ్/ ఇన్‌కం టాక్స్ డాక్యుమెంటు.

Roc.No.PR4/13909/Adv.No.216/PRO/2019, Dated: 21-08-2019. కార్యనిర్వహణాధికారి

ఎగరని ఆశలు!

- 11 ఏళ్లుగా ఒక్కటీ సాకారం కాలేదు
- అధ్యయనాలతో గడుస్తున్న కాలం
- రాష్ట్రానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టే దిక్కు
- కేంద్రం వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తి
- విమానాశ్రయాల ప్రాధికార సంస్థ తాజా సర్వే ప్రారంభం

తెలంగాణ జనాభా 3.5 కోట్లు.. విమానాశ్రయం 1..

రాష్ట్ర రాజధానిలో శంషాబాద్ విమానాశ్రయం తప్ప మరే జిల్లాలోనూ కొత్తగా ఏర్పాటుకాలేదు. కొత్తవాటి ప్రతిపాదనలు 11 ఏళ్లుగా కాగితాలకే పరిమితమయ్యాయి. పలు దఫాలు సర్వేలు జరిగినా ప్రయోజనం శూన్యం. తాజాగా జాతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా-ఏఏఐ) సాంకేతిక సంభావ్యత అధ్యయనం (టెక్నో ఫీజిబిలిటీ సర్వే) చేపట్టింది. దీనికి అవసరమైన రుసుము చెల్లించాలని రాష్ట్రానికి సూచించింది. సర్వేల పేరిట కేంద్రం కాలయాపన చేస్తోందంటూ అసంతృప్తితో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం రుసుము చెల్లించలేదు. అయినప్పటికీ ఏఏఐ తన అధ్యయనాల్లో భాగంగా బుధవారం నుంచి సర్వే ప్రారంభించింది.

వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయ రన్‌వే విహంగ వీక్షణం

ఆరుచోట్ల అభివృద్ధికి అవకాశం

తెలంగాణలోని ఆరు విమానాశ్రయాల అభివృద్ధికి అవకాశం ఉంది. జక్రాన్‌పల్లి, మహబూబ్‌నగర్, కొత్తగూడెంలలో హరిత కేటగిరీ, బసంత్‌నగర్, వరంగల్, ఆదిలాబాద్‌లలో బ్రౌన్ కేటగిరీలో విమానాశ్రయాలను నిర్మించవచ్చు. ఇప్పటికే వరంగల్, ఆదిలాబాద్‌లలో విమానాల విడిది సౌకర్యం ఉంది. బసంత్‌నగర్‌లోని రామగుండం విమానాశ్రయానికి వాయుదూత్ విమానాలు నడిచాయి. జక్రాన్‌పల్లి, కొత్తగూడెం, మహబూబ్‌నగర్‌కు విమానాశ్రయాల అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వీటికి అవసరమైన భూములను ఇప్పటికే ఎంపిక చేసింది. ఈ విమానాశ్రయాలు శంషాబాద్‌కు 150 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలోనే ఉన్నందున నిర్మాణాలకు సమస్య లేదు. కేంద్రం విమానాశ్రయాలను మంజూరు చేసిన పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వాటిని పూర్తి చేసే వీలుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోనూ వీటిని చేపట్టవచ్చు.

12 విమానాశ్రయాల కోసం ప్రతిపాదనలు

- తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 12 ప్రాంతీయ విమానాశ్రయాల కోసం ప్రతిపాదనలు చేసి కేంద్రానికి నివేదించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రులను, అధికారులను సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కలిసి విన్నవించారు.
- వరంగల్ జిల్లా మామునూరు మొదలుకొని కొత్తగూడెంలో విమానాశ్రయ ప్రతిపాదిత స్థలాన్ని ఏఏఐ పలుమార్లు సందర్శించి నివేదికలను రూపొందించింది.
- వరంగల్ జిల్లా మామునూరు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్‌లలో అధ్యయనం చేసింది. ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, రామగుండం సమీపంలోని బసంత్‌నగర్‌లలో అధ్యయనం చేయాల్సి ఉండగా బుధవారం ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో సర్వే చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే సత్వర నిర్మాణం

–కాసం వెంకటేశ్వర్లు, ఏఏఐ సభ్యుడు

రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే వెంటనే విమానాశ్రయాల నిర్మాణం చేపడతాం. ఏపీలో అయిదేళ్లలో అయిదు విమానాశ్రయాలను అభివృద్ధి చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం దీనికి చొరవ చూపాలి. ఏఏఐ సర్వే రుసుం రూ.4.5 కోట్లను ఇప్పటి వరకూ చెల్లించలేదు. 20 శాతం నిధులను డిపాజిట్ చేయాలంటే రూ.90 లక్షల చెక్కు మాత్రమే ఇచ్చారు. నిధులు విడుదల చేయలేదు. భూకేటాయింపులు ఇతర చర్యలు చేపట్టాలి.

సహకరిస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఏఏఐకి పూర్తిగా సహకరిస్తున్నామని చెబుతున్నాయి. ఏఏఐ బృందానికి అవసరమైన సమాచారం ఇస్తున్నామని తెలిపాయి. సలహా రుసుమును విడుదల చేస్తామని వెల్లడించాయి. సర్వే నిధులు అంత ప్రాధాన్యాంశం కాకపోయినా వాటి కోసం ఒత్తిడి తేవడం సరికాదనే భావన రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లో ఉంది.

– ఈనాడు, హైదరాబాద్

28న భవిష్యనిధి ఉద్యోగుల దేశ వ్యాప్త సమ్మె

- ఉద్యోగ సంఘాల జాతీయ నేతల వెల్లడి

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: భవిష్యనిధి ఉద్యోగుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కనీస స్పందన కరవైందని ఈపీఎఫ్ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నేతలు పేర్కొన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ బుధవారం హైదరాబాద్ బర్కత్‌పురలోని ప్రాంతీయ భవిష్యనిధి కార్యాలయంలో ఉద్యోగులు నినాదాలు చేసి నిరసన తెలిపారు. అనంతరం ఈపీఎఫ్ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి డి.గోపాల్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కృపాకరణ్(చెన్నై), జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు మోహన్‌కుమార్ ఉపాధ్యాయ (పట్నా), జాతీయ ఉపాధ్యక్షుడు బి.సతీశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరశివ రావు తదితరులు మాట్లాడారు. భవిష్యనిధి ఉద్యోగుల డిమాండ్లపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఈ నెల మొదటి వారం నుంచి దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 28న దేశవ్యాప్త సమ్మెకు దిగనున్నట్లు చెప్పారు. గ్రూపు-బి, సి, డి కేడర్లకు సంబంధించిన అన్ని నియామక నిబంధనలను తక్షణమే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న పని నిబంధనలను పునఃసమీక్షించాలని, అంతర్‌రాష్ట్ర బదిలీలను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని, ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. డిమాండ్లు సాధించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు.

హైదరాబాద్ బర్కత్‌పురలోని ప్రాంతీయ భవిష్యనిధి కార్యాలయంలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఈపీఎఫ్ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నేతలు, ఉద్యోగులు

సీఎంకు చేతనైతే అవినీతిని అరికట్టాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: అవినీతిరహితంగా తెలంగాణ ఉండాలంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఐదేళ్ల పాలనలో ఆ పని ఎందుకు చేయలేకపోయారని బాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. ఇన్నాళ్లు తన వ్యవసాయక్షేత్రంలో నిద్రపోయిన ముఖ్యమంత్రి.. అవినీతి జరుగుతోందని ఎట్టకేలకు ఒప్పుకోవడం సంతోషకరమన్నారు. బుధవారమిక్కడ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై భాజపా ప్రశ్నిస్తే ప్రభుత్వం ఎదురుదాడి చేసిందన్నారు. కలెక్టర్ల సదస్సులో సీఎం వ్యాఖ్యలు చూస్తుంటే.. అవినీతి మరకను అధికారులకు రుద్దేసి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నట్లుందని అన్నారు. పాలనలో తెలంగాణ స్ఫూర్తి లేదంటున్నారు మరి తెలంగాణ వ్యతిరేకుల్ని మంత్రులుగా నియమించలేదా? అని ఆయన ప్రశ్నించారు. అవినీతి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, లేదంటే బాధ్యతల నుంచి తప్పుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

కనీస పింఛను పెంచుతాం

శ్రీనగర్, లద్దాఖ్‌లలో ఈపీఎఫ్‌వో కార్యాలయాలు ◆ ఇకపై ప్రైవేటు బాండ్లలో ఈపీఎఫ్‌వో పెట్టుబడులు పెట్టం

సామాజిక భద్రత కోడ్‌లో ఈపీఎఫ్, ఈఎస్ఐ పరిమితి పెంపు ◆ 'ఈనాడు'తో కేంద్ర కార్మికశాఖ మంత్రి గంగ్వార్

ఈనాడు – హైదరాబాద్

వేతన జీవులకు ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) కనీస పింఛను పెంచే ఆలోచనలో ఉన్నట్లు కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ తెలిపారు. త్వరలోనే కేంద్ర ఆర్థిక మంత్రితో చర్చించి ఎంత మేరకు పెంచాలో నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈపీఎఫ్‌పై ఉద్యోగులకు 8.65 శాతం వడ్డీ చెల్లించేందుకు త్వరలో ఆర్థికశాఖ అనుమతి రానుందని చెప్పారు. దేశంలో ఉద్యోగిత రేటు పెరుగుతోందని ఈపీఎఫ్‌వో చందాదారుల సంఖ్య 6 కోట్ల నుంచి 8 కోట్లకు పెరగడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. బుధవారమిక్కడ ఈఎస్ఐసీ సనత్‌నగర్ ఆసుపత్రి ఓపీడీ భవనాన్ని ప్రారంభించారు. ఈఎస్ఐసీ పనితీరు సమీక్షించారు. హైదరాబాద్‌లో ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ) సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ ఈఎస్ఐ ఆసుపత్రికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, ఇక్కడి కార్మికుల సంఖ్య మేరకు అవసరమైతే 1,500 పడకల ఆసుపత్రిగా మార్చుతామని ప్రకటించారు. విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. 'సచివాలయానికి రావడం లేదు. ఫామ్‌హౌస్‌లో ఉంటున్నారు. ఇలాగైతే సామాన్యులకు ప్రభుత్వ పాలన అందుతుందా'ని ప్రశ్నించారు. దేశం అభివృద్ధి వైపు వెళ్తుంటే, తెలంగాణ తిరోగమనంలో వెళ్తోందన్నారు. అనంతరం వివిధ అంశాలపై 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

● సీబీటీ సమావేశంలో ఏ అంశాలు చర్చకు వచ్చాయి?

ఈపీఎఫ్ వడ్డీ రేటు; పెట్టుబడులు; కార్మికుల కనీస పింఛను పెంపు; ఆర్టికల్ 370 రద్దుతో శ్రీనగర్, లద్దాఖ్‌లలో ఈపీఎఫ్‌వో కార్యాలయాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించాం. మూణ్నెల్లలోగా అక్కడ కార్యాలయాలు ఏర్పాటు చేస్తాం.

● కనీస పింఛనుపై గత సమావేశంలోనే ప్రతిపాదన వచ్చింది కదా?

ప్రస్తుతం కనీస పింఛను వెయ్యి రూపాయలు ఉంది. రూ.2వేలు, రూ.3వేలు, రూ.5వేల వరకు పెంచాలంటూ డిమాండ్లు వస్తున్నాయి. పెంచాలంటే కొంత కేంద్ర ప్రభుత్వం భరించాలి. 15 రోజుల్లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రితో సీబీటీ చర్చించాక ఒక నిర్ణయానికి వస్తాం.

● వాస్తవిక వేతనంపై పింఛను చెల్లించాలన్న సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అమలు చేస్తారా? ఇప్పటికే ఆ మేరకు పింఛను తీసుకుంటున్నవారికి నిలిపివేశారు కదా?

దీనిపై ఈపీఎఫ్‌వో రివ్యూ పిటిషన్ వేసింది. ఇప్పటికే వాస్తవిక వేతనంపై పింఛను పొందుతున్న విశ్రాంత కార్మికులు ఇందులో భాగస్వాములవుతారు. అందుకే వారికి పెరిగిన పింఛను నిలిచిపోయింది. సుప్రీంకోర్టు ఇచ్చే సూచన మేరకు నిర్ణయం తీసుకుంటాం.

● రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రుల్లో మందులు, పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు మీ దృష్టికొచ్చాయా?

తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. పశ్చిమబెంగాల్‌లో కొంత పరిస్థితి మెరుగ్గా ఉంది. ఈఎస్ఐసీ బోర్డు సమావేశంలో ఆయా రాష్ట్రాల అధికారుల నుంచి వివరాలు తీసుకుని తగిన చర్యలు తీసుకుంటాం.

● ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణంపై ఎలా ముందుకెళ్లబోతున్నారు?

తెలంగాణతో పాటు ఏపీలోనూ ఈఎస్ఐ కార్మికుల సంఖ్య మేరకు ఆసుపత్రులను నిర్మించాలని నిర్ణయించాం. ప్రతిపాదనలు తెప్పించుకుంటున్నాం. 50 వేల మంది ఈఎస్ఐ కార్మికులు ఉన్నచోట 100 పడకలు, 20వేల మంది ఉన్నచోట 30 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేస్తాం.

● ఈపీఎఫ్‌వో పెట్టుబడులపై ఏమైనా పునరాలోచన జరిగిందా?

ఈపీఎఫ్‌వో పెట్టుబడులు ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్, డీహెచ్‌ఎఫ్‌ఎల్ బాండ్లలో కొన్ని ఉన్నాయి. వాటిని వెనక్కు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ప్రైవేటు బాండ్లలో పెట్టుబడులు పెట్టకూడదని సీబీటీ నిర్ణయించింది.

● ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐ కేటగిరీల్లో గరిష్ఠ వేతన పరిమితి పెంచే ఆలోచన ఉందా?

త్వరలోనే సామాజిక భద్రత కోడ్‌ను తీసుకురానున్నాం. ఇందులో ఈపీఎఫ్‌వో గరిష్ఠ అర్హత వేతనం రూ.15వేల నుంచి, అలాగే ఈఎస్ఐ పరిమితి రూ.21 వేల నుంచి ఎంత మేరకు పెంచాలన్న విషయమై నిర్ణయం తీసుకుంటాం.

● పీఎం శ్రమ్‌యోగి మంధన్ యోజనలో చేరికలు ఆశాజనకంగా లేవెందుకని?

దేశంలో 40కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారు. వారికోసం ఈ పథకం ప్రవేశపెట్టిన వెంటనే ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో సభ్యుల సంఖ్య 32 లక్షలకు పరిమితమైంది. ఇక నుంచి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

27న బస్ భవన్ ముట్టడి

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆ సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. కార్మికులకు కొత్తగా వేతన సవరణ చేసి, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరింది. హైదరాబాద్ పీఎస్టీ రోడ్డులోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం చలో బస్ భవన్ ముట్టడికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని పరిరక్షించడంలో యాజమాన్యం, ప్రభుత్వం, గుర్తింపు సంఘం ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ఈనెల 27న కార్మికులతో బస్ భవన్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని 2013 అక్టోబరులో జీవోను విడుదల చేసినప్పటికీ అమలు చేయడం లేదన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ దీక్ష 1న

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను కనీసం ఇప్పటికైనా అమలుచేయాలని పీఆర్‌టీయూటీఎస్ కోరింది. డిమాండ్ల సాధనకు సెప్టెంబరు 1వ తేదీన అన్ని జిల్లాకేంద్రాల్లోనూ సత్యాగ్రహ దీక్ష చేస్తామని ప్రకటించింది.

బీమా లేనివారికీ ఈఎస్ఐ వైద్య సేవలు

- అసంఘటిత రంగ కార్మికులకు అవకాశం
- కేంద్ర కార్మిక, ఉపాధికల్పనా శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్

సనత్‌నగర్, న్యూస్‌టుడే: బీమా లేని అసంఘటిత రంగ కార్మికులకు సైతం ఇకనుంచి ఈఎస్ఐ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని కేంద్ర కార్మిక, ఉపాధికల్పనా శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ వెల్లడించారు. కార్మిక రాజ్య బీమా(ఈఎస్ఐ) సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆసుపత్రుల ప్రాంగణంలో నూతన ఓపీడీ బ్లాక్ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఈఎస్ఐ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని, వైద్య కళాశాలను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా గంగ్వార్ మాట్లాడుతూ.. రూ.10 కన్సల్టేషన్ ఫీజు, నామమాత్ర ఛార్జీలు చెల్లించి అసంఘటిత రంగ కార్మికులు ఎవరైనా ఈఎస్ఐ సేవలు పొందే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు చెల్లించే ఈఎస్ఐ వైకాన్ని 4.75 శాతం నుంచి 4.3 శాతానికి, కార్మికుల నుంచి మినహాయించుకునే సొమ్మును 1.75 నుంచి 0.75కి తగ్గించామన్నారు. కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించనున్న ఓపీడీ బ్లాక్ ద్వారా మరో 200 పడకలతోపాటు ఈఎన్‌టీ, ఆడియో, స

మకరందం

7 కరీంనగర్, గురువారం ఆగస్టు 22, 2019 ఈనాడు

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

makarandam@eenadu.in

'కృష్ణస్తు భగవాన్ స్వయమ్'... కృష్ణుడే పరమతత్త్వం... చరమ లక్ష్యం... ఆయన గురించి చదవడం, చెప్పడం, పాడడం, వినడం... అన్నీ అపురూపమైన అనుభవాలే. 'నీలో లేని చోద్యాలు ఈ ప్రపంచంలో ఏం ఉంటాయి?' అని అక్రూరుడన్నా... 'అటువైపు కృష్ణుడున్నాడు... ఇటువైపు ఎవరున్నారు' అని సంజయుడు హెచ్చరించినా... అవన్నీ పరమాత్మ విరాట్‌రూపాన్ని విశదీకరించే ఉదాహరణలే... క్రియ, బోధ కలగలిసిన అద్భుత తత్త్వం ఆయనది... యుగావసరాలకు అన్వయించుకోదగ్గ మహాగాథ శ్రీకృష్ణుడిది.

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా

ధర్మ సూత్రధారీ హే మురారీ

భక్తుల కోర్కెలు తీర్చే క్రమంలో భగవంతుడు రెండు రకాల విధానాలను అనుసరిస్తాడు. సర్వం తానే స్వయంగా నిర్వహించి, తనపై మనకున్న నమ్మకాన్ని పెంచుకోవడం మొదటి పద్ధతి. మన ప్రయత్నంలో రహస్యంగా సహకరించి, మనపై మనకు నమ్మకాన్ని పెంచి విజేతలుగా తీర్చిదిద్దడం రెండో పద్ధతి. ఇందులో మొదటి దాన్ని దైవికం అని, రెండోదాన్ని పౌరుషం అని శాస్త్రం నిర్వచించింది. పరమాత్మ ప్రతి అవతారంలో ఏదో ఒకమార్గాన్నే ఎంచుకున్నాడు. కానీ కృష్ణావతారంలో మాత్రం రెండు విధాలుగానూ మనకు ఆయన దర్శనమిస్తాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణల్లో భాగవతంలోని కృష్ణుడు ఎవరి సహాయాన్నీ కోరలేదు. స్వయంగా తానే అవతార లక్ష్యం దిశగా సాగిపోయాడు. భారతంలోని కృష్ణుడు మాత్రం రెండో పద్ధతి అనుసరించాడు. చేసిందంతా తానే అయినా ఘనతను మాత్రం పూర్తిగా పాండవుల పరం చేశాడు. వారిని విజేతలుగా నిలబెట్టాడు. భాగవత కృష్ణుడు విశేష రసజ్ఞ మనోజ్ఞ మూర్తి. భారత కృష్ణుడు అసాధారణ అలౌకిక ప్రజ్ఞానిధి. కృష్ణ కథలో ఈ రెండూ విభిన్న కోణాలు. ఈ రెండు రకాల పాత్రల స్వభావాలు విభిన్నమైనవి, అదే సయమంలో సర్వసమగ్రమైనవి.



అదే కృష్ణమాయ!

భాగవత కృష్ణుడి బాల్యచేష్టలు ముగ్ధమోహనాలు. అదే సమయంలో లోకకల్యాణాలు. పసిబాలుడు భయంకర రాక్షస మూకలను మట్టుబెట్టినప్పుడు జనం నివ్వెరపోవడం సహజం. అవతార పురుషుడిగా అనుమానించడం సాధారణం. అలాంటి వారిని చిలిపి చేష్టల ముసుగులో ముంచేసేవాడు. ఇది లోకం దృష్టికి సమ్మోహనకరంగా, అదే సమయంలో లోచూపునకు సంక్లిష్టభరితంగా కనిపించేది. గోపబాలురకు చెలికాడిగా, గోపికలకు వెన్నెల వేలుపుగా ఆటపాటలతో అలరించిన అపూర్వ ఘట్టాలను అనుశీలించేటప్పుడు మనం కూడా వారిలా మారిపోవడాన్నే కృష్ణమాయ అంటారు. రమణీయ రసానుభూతులు పంచడంతో పాటు రాక్షస సంహారం కూడా ఆయన చేశాడు. ఒక పురాణ పురుషుడి సర్వసమగ్ర వ్యక్తిత్వానికి ఇది గొప్ప ఉదాహరణ.

సుస్థిర పాలన కోసం...

భారత కృష్ణుడు ధీరోదాత్తుడు, రాజనీతిజ్ఞుడు, వ్యూహనిర్మాణ చతురుడు, స్ఫూర్తిప్రదాత, మహానేత. ఆయన అవతరించే సమయానికి లోకంలో పరిస్థితులు విషమంగా ఉన్నాయి. కంస, జరాసంధ, కాలయవన, నరక, శిశుపాల, దుర్యోధనాది స్వార్థ పరుల చేతుల్లో అధికారం, సంపద ఖైదీలయ్యాయి. ఇవన్నీ దుష్టుల చేతుల్లో ఉన్నప్పుడు సామాజిక పరిస్థితులు కూడా దయనీయంగా ఉంటాయి. ధర్మంలేని చోట భద్రత, నీతిలేని చోట మనశ్శాంతి ఉండవు. అలాంటి రాజుల చేతుల్లోనుంచి ప్రజలను రక్షించాలి. సువ్యవస్థను స్థాపించాలి. రాజ్యం చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయి ఉంది. అరాచకం, అనైక్యత పెరిగిపోయాయి. ఆ దుస్థితిని, క్లిష్టతను పారదోలేందుకు కేంద్ర రాజ్య వ్యవస్థను ఊహించిన, నిర్దేశించిన అద్భుత రాజనీతిజ్ఞుడు శ్రీ కృష్ణుడు. ధర్మం తప్పిన రాజులందరినీ స్వయంగానో, పాండవుల చేతనో తుదముట్టించాడు. తాను రాజ్యాధికారం కోరుకోకుండా ధార్మిక చింతనాశీలురను పాలకులుగా ఎంచి, రూపొందించి సుపరిపాలనా కేంద్ర వ్యవస్థను నిర్మించాడు. ధర్మజుని నాయకునిగా తీర్చిదిద్దిన నాయక నిర్ణేత శ్రీకృష్ణుడు.

యుద్ధం కూడా యజ్ఞమే!

భగవద్గీత ఆవిర్భావం కూడా ఈ యుగావసరమే. అడవిలో ముక్కు మూసుకుని కూర్చున్న సర్వసంగపరిత్యాగి తన శిష్యులకు ఏకాంతంగా నూరిపోసిన ధర్మోపదేశం కాదిది.. పద్దెనిమిది అక్షౌహిణుల మహాసైన్యం యుద్ధరంగంలో మోహరించి, కయ్యానికి కాలుదువ్వుతున్న ఉత్కంఠ స్థితి. తాత్కాలిక నిర్వేదానికి గురై ధర్మసంకటంలో పడిన మహాయోధుణ్ణి కార్యోన్ముఖుణ్ణి చేసేందుకు ప్రవచించిన ఉపదేశం. ఈ లోకానికంతటికీ వర్తించే ధీరవచనం. గీతాచార్యుడిగా శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం శిఖరసమానమైంది. ఆయుధాన్ని పట్టనని ప్రకటించిన శ్రీకృష్ణుడు, భీమార్జునులను ఆయుధాలుగా మలుచుకుని కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని సాగించాడు. యుద్ధాన్ని క్రతువు అన్నాడు పరమాత్మ. క్రతువు అంటే యజ్ఞం. 'న మమ' అనుకోవడం యజ్ఞంలో ప్రధానాంశం. 'నాది కాదు' అని ఆ మాటకు అర్థం. ఏం చేసినా, ఏం పొందినా 'న మమ' అనే భావనతో ఉండడం యోగి లక్షణం. అహంకార, మమకారాలను ఆహుతి చేసే మహోన్నత పరిణత త్యాగశీలతనే కృష్ణుడు కర్మయోగం పేరిట అర్జునుడికి బోధించాడు. అది ఎప్పటికీ, సర్వమానవాళికీ అనుసరణీయం.

– వై.శ్రీలక్ష్మి

...అప్పుడలా ఎందుకు చేశానంటే!

స్నేహితుడి కోసం గీతాసారం

కృష్ణా! ఓ మాట అడుగుతాను. నిజం చెబుతావా...? మనం ఆపదలో ఉన్నప్పుడు అడగకపోయినా వచ్చి మనకు సాయం చేసేవాడే స్నేహితుడని నువ్వే చెప్పావు కదా. మరి పాండవులు అన్ని కష్టాల్లో కూరుకుపోయినప్పుడు నువ్వేం చేస్తున్నావు? నువ్వు చెబితే ధర్మరాజు జూదం ఆడేవాడు కాదు కదా? లేదా నువ్వే ధర్మరాజు పక్షాన ఆడి అతడిని గెలిపించవచ్చుకదా. మరి నువ్వెందుకు అలా చూస్తుండిపోయావు? అంటూ నేరుగా కృష్ణుడినే అడిగాడు ఉద్ధవుడు. మరొకరైతే కృష్ణుడిని ఈ ప్రశ్న అడగటానికి కూడా ధైర్యం చేసేవారు కాదు. కానీ, ఇక్కడ అడిగినవాడు ఉద్ధవుడు. కృష్ణుడికి పరమ ప్రాణమిత్రుడు. రూపంలో కూడా అచ్చం కృష్ణుడిలాగా ఉండేవాడు. ఎంతటి ప్రాణమిత్రుడంటే నిద్రలో కూడా కృష్ణుడి పేరునే కలవరించేవాడు. అంతటి మిత్రుడు అడిగేసరికి శ్రీకృష్ణుడు కూడా మొహమాటం లేకుండా సమాధానం చెప్పాడు.

ఉద్ధవా! విజయం ఎప్పుడూ వివేకవంతుడినే వరిస్తుంది. దుర్యోధనుడు వివేకవంతుడు. అందుకు ఆటలో నైపుణ్యం ఉన్న శకునితో తన ఆట ఆడించాడు. ధర్మరాజు మాత్రం తానే ఆట ఆడాలని అనుకున్నాడు. పైగా నేను అటువైపు రాకూడదని కోరుకున్నాడు. అందుకే అతడు పిలిచేవరకు రాకూడదని నిశ్చయించుకున్నా. పిలిస్తే మాత్రం తప్పకుండా వెళ్లేవాడిని అన్నాడు. అంటే కృష్ణా! తీవ్రమైన ఆపదల్లో కూరుకుపోయి పిలిస్తే గానీ రావా అంటూ మరోప్రశ్న వేశాడు ఉద్ధవుడు. మిత్రమా! జీవితంలో ప్రతిదీ కర్మానుసారమే జరుగుతుంది. నేను పక్కన ఉండి చూస్తుంటాను కానీ కర్మను మార్చలేను అన్నాడు కృష్ణుడు.

అదేంటి కృష్ణా! నీ భక్తుల పక్కనే ఉంటూ వారు ఆపదలో ఉంటే చూస్తూ ఊరుకుంటావా? అన్యాయం కదూ అన్నాడు ఉద్ధవుడు. కృష్ణుడు నవ్వుతూ... మిత్రమా! నేను పక్కన ఉన్నాననే భావన ఉంటే అసలు తప్పే చెయ్యరు కదా భక్తులు అన్నాడు. తత్త్వం బోధపడింది ఉద్ధవుడికి. ఇంకా ఎన్నో సందేహాలు అడిగాడు. అన్నిటికీ తృప్తిగా సమాధానాలు చెప్పాడు పరమాత్మ. అవతార పరిసమాప్తి కాలంలో ఉద్ధవుడి పేరు మీద లోకం తన మీద వేసే నిందలు, వేసే ప్రశ్నలన్నింటికీ పరమాత్మ సమాధానం చెప్పాడు. ఈ సమాధానాల సమాహారమే 'ఉద్ధవగీత'గా ప్రసిద్ధిపొందింది.

– చైతన్య

ఆ అయిదు భావాలు...

శ్రీకృష్ణుడు లీలామానుష రూపుడు. మానవుడిగా, దైవంగా మార్చిమార్చి తన వైభవాన్ని ప్రదర్శించాడు. శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య, మధుర భావాలను భక్తులు భగవంతుడిని చేరుకునే సులభ మార్గాలుగా భావించాలి. వాటిని స్వయంగా శ్రీకృష్ణుడి జీవితంలో కూడా మనం చూడొచ్చు.

శాంతం: ఎంత ఉద్రిక్త పరిస్థితుల్లోనైనా నందనందనుడు శాంతంగా వ్యవహరించాడు. శిశుపాలుడు నిండు సభలో అవమానపరిచి అనరాని మాటలు అంటున్నా ప్రతిఘటించలేదు. ఉద్రేకపడలేదు. భీష్మాదులు శిశుపాలుడిని హెచ్చరిస్తున్నా తాను మాత్రం పౌరుషానికి పోలేదు. ఇచ్చిన మాట ప్రకారం నూరు తప్పులను శాంతంగానే కాచాడు.

దాస్యం: పెద్దల వద్ద వినయ విధేయతలతో ఉండడమే దాస్యభావం. దేవాదిదేవుడైనా అగ్రజుల వద్ద అణకువగానే మెలిగాడు. గురువు సాందీపుని వద్ద బంటులా పనిచేశాడు. రేపల్లెలో గోవుల కాపరిగా ఆ మూగజీవాలనూ సేవించాడు. అందుకే దాస్యంలో ఆయనను మించిన దివ్యాంశుడు లేరంటారు.

వాత్సల్యం: చిన్న వాళ్లతో ప్రేమగా, ఆదరంగా ఉండడం వాత్సల్యం. ధీరగంభీరుడైన దేవకీపుత్రుడు వాత్సల్యానికి కూడా మారుపేరు. తనను ఆశ్రయించిన వారిని ఆదుకోవడంలో ఆయనను మించిన కరుణామూర్తి మరొకరు కానరారు. ద్రౌపది 'అన్నా! నీవే దిక్కు' అన్నందుకు నిండు సభలో ఆమె గౌరవాన్ని కాపాడాడు. సుయోధనుడు రాజభోగాలను సిద్ధంచేసినా, విదురుని ప్రేమపూర్వక ఆహ్వానాన్నే మన్నించాడు.

సఖ్యం: సన్నిహితులతో, స్నేహితులతో ప్రేమగా ఉండడం సఖ్యం. సఖ్యభావంతో సన్నిహితుల హృదయాల్లో నిలిచిపోయాడు ఈ హృషీకేశుడు. చిన్ననాటి స్నేహితుడు కుచేలుడు నిరుపేదైనా, సతీసమేతంగా అతని పాదాలు కడిగి ఆ జలాన్ని తన తలపై చల్లుకున్నాడు. ఆయన తెచ్చిన అటుకులనే మధురపదార్థాలుగా స్వీకరించాడు. ఇక అర్జునుడికి ఇష్టసఖుడిగా తుదివరకు వెన్నంటి కాపాడాడు.

మధురభావం: తనను ఆరాధించే వాళ్లతో అంతే ఆరాధనతో ఏకమైపోవడం మధురభావం. గోపికలను మధురభావంతో ముంచెత్తి వాళ్లను అనేక లీలల్లో ఓలలాడించాడు. వారికి అలౌకికమైన ఆనందాన్ని అందిస్తూనే అంతిమంగా వారికి మోక్షాన్ని ప్రసాదించాడు. మధురభావం పరమాత్మ ఏ ఇతర అవతారంలోనూ కనిపించదు.

ఇస్లాం సందేశం

ఆ దానాలు ఫలించాయి!

'ఈ రోజు రాత్రి ఎలాగైనా కొంత డబ్బును దానం చేయాలి' అని గట్టిగా నిర్ణయించుకున్నాడో వ్యక్తి. అనుకున్నట్లుగానే అర్ధరాత్రి దాటాక సంచిలో నాణేలను వేసుకుని దానం చేయడానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ఒక వ్యక్తి తారసపడితే ఆ నాణేల మూటను అతనికి దానం చేసి సంతృప్తి



చెందాడు. తెల్లారాక తాను దానం చేసింది ఓ దొంగకు అని తెలిసి విచారపడ్డాడు. ఈ మాట నలుగురికీ తెలిసింది. 'దానం చేయడానికి దొంగే దొరికాడా?' అని అందరూ గేలి చేయసాగారు. తప్పు చేశాననే భావనతో అల్లాహ్‌ను పశ్చాత్తాపంతో వేడుకున్నాడు.

మరుసటి రోజు రాత్రి మళ్లీ దానం చేయడానికి నాణేల మూటతో బయల్దేరాడా వ్యక్తి. దారిలో ఓ నిరుపేద మహిళ తారసపడింది. ఆమెపై జాలి కలిగింది. నాణేల మూటను ఆమెకు ఇచ్చి ఇంటికి చేరుకున్నాడు. మరుసటి రోజు 'పాడుపనులు చేసే మహిళకు దానం చేశావ'ని నలుగురూ మళ్లీ దెప్పిపొడిచారు. ఆపాత్ర దానం చేస్తున్నానే అని ఆ వ్యక్తి మరింత కుమిలిపోయాడు. మూడో రోజైనా తగిన వారిని గుర్తించి దానం చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. రాత్రి మళ్లీ నాణేల సంచితో బయల్దేరాడు. దారిన కనిపించిన ఒకరికి సంచి దానం చేశాడు. ఈ రోజు నిజమైన నిరుపేదకు దానం చేశాననుకొని సంతోషంతో ఇంటికి చేరుకున్నాడు. తెల్లారాక 'నీకు ఈ సమాజంలో పేదలే కనపడలేదా.. పోయి పోయి ఓ ధనవంతుడికి దానం చేశావ'ని అందరూ అతణ్ణి నిలదీశారు. దీంతో మూడు రోజులు తాను చేసిన దానం వృథా అయిందని ఆ వ్యక్తి ఎంతగానో బాధపడ్డాడు. దొంగ, వ్యభిచారి, ధనవంతుడు ఈ ముగ్గురికీ చేసిన దానం బూడిదలో పోసిన పన్నీరైందని ఆవేదన చెందాడు. ఇదే విషయాన్ని ఆ ఊళ్లో ఉన్న ధార్మిక పండితుడితో చెప్పుకొని బాధపడ్డాడు. అప్పుడా పండితుడు 'నీవు చేసిన దానాలు ఎంత మాత్రం వృథా కావు. ఒక దొంగకు దానం చేసి ఆ రోజు దొంగతనం నుంచి అతడ్ని ఆపగలిగావు. వ్యభిచారికి దానమిచ్చి ఆమె పాడు పని చేయకుండా ఆపావు. నీవొక ధనవంతుడికి దానమిచ్చి అతడిలో దానగుణాన్ని పెంచావు. నీ దానాన్ని అల్లాహ్ స్వీకరించాడు' అని ఊరడించాడు. ఆ మాటలతో ఆ వ్యక్తి ఆనందించాడు.

– ఖైరున్నీసాబేగం

తెలుసుకుందాం!

గ్రంథరూప గురువు

మత గ్రంథాలన్నిటినీ ఎంతో పవిత్రంగా చూస్తారు కానీ, సిక్కు మతానికి చెందిన శ్రీ గురు గ్రంథసాహిబ్‌ను ప్రత్యక్ష గురువుగా ఆరాధిస్తారు. దాన్ని ఆదిగ్రంథ్ అని కూడా పిలుస్తారు. గురునానక్ దేవ్‌తో ఈ గ్రంథం మొదలైంది. పదిమంది గురువులు దీన్ని తీర్చిదిద్దారు. ఇందులో 1430 పేజీలు ఉన్నాయి. వీటిని అంగ్‌లు అంటారు. 6000 శపథ్‌లున్నాయి. ఇవన్నీ వాక్య కూర్పులు. వీటిని ఉత్తరభారత సంగీత రాగాల్లో శాస్త్రీయంగా కూర్చారు. మొత్తం 60 రాగాల్లో ఈ గ్రంథాన్ని కూర్చారు. వీటిని రచయిత, నిడివి ఆధారంగా తిరిగి విభజించారు.



గురు గ్రంథ్ సాహిబ్‌ని గురుముఖి లిపిలో రాశారు. దీన్ని అయిదో గురువు అర్జున్‌దేవ్ మొదటి సారిగా తన స్వహస్తాలతో కూర్చారు. అలాగే బహండా, వ్రజ, ఖారీచోలీ, సంస్కృతం, సింధీ, పర్షియన్ భాషల్లోకి తర్జుమా చేశారు.

గురునానక్ 1469లో జన్మించి, తన 70వ ఏట తనువు చాలించారు. ఆ తర్వాత అంగద్ దేవ్, అమర్ దాస్, రామ్‌దాస్, అర్జునదేవ్, హరగోవింద్, హర్ రాయ్, హరికిషన్, తేజ్ బహదూర్, గోవింద్ సింగ్... గురు పరంపరగా పూజలందుకున్నారు. వీరి స్ఫూర్తి ఈ గ్రంథంలో ప్రతిఫలిస్తుంది. గురు గ్రంథ సాహిబ్‌ని శాశ్వత గురువుగా నియమించినవారు గురుగోవింద్ సింగ్.

–కె.రాఘవేంద్రబాబు

క్రీస్తువాణి

విందు చేద్దామా?

సాంఘిక జీవనంలో పెళ్లిళ్లకు, ఇతర వేడుకలకు తరచూ వెళ్తుంటాం. అయితే ఆ వేడుకకు పిలిచిన వ్యక్తి.. అతిథులను పట్టించుకోకపోతే మనసు చివుక్కుమంటుంది. ప్రముఖులను మాత్రమే గౌరవిస్తూ.. మనల్ని నిర్లక్ష్యం చేస్తుంటే.. ఇక్కడికి ఎందుకు వచ్చామా అనిపిస్తుంది. ఈ సందర్భంలో క్రీస్తు చెప్పిన చక్కటి ఉపదేశాలు గుర్తు చేసుకోవాలి..

"నిన్నెవరైనా పెళ్లి విందుకు పిలిస్తే అగ్రపథాన కూర్చోవొద్దు. ఒకవేళ నీ కంటే గొప్పవారు వస్తే.. అతడిని నీ స్థానంలో కూర్చోబెట్టి.. నిన్ను వేరే చోటుకు మార్చవచ్చు. అప్పుడు నీవు సిగ్గుపడాల్సి వస్తుంది. అలాకాక నీవు కడపటి స్థానంలో కూర్చుంటే.. అగ్రపథం లభించే అవకాశం ఉంది. తన్ను తాను తగ్గించుకొను వాడు హెచ్చించబడతాడు.. తన్ను తాను గొప్పగా భావించే వాడు తగ్గించబడతాడు" ఈ క్రీస్తువాణి నేటికీ అనుసరణీయమే.

విందుకు ఎవరిని పిలవాలి అనే విషయంలోనూ ప్రభువు చేసిన సూచన సదా అనుసరణీయం..

"నీ ఇంట్లో జరిగే వేడుకలకు.. నీ స్నేహితులను, సహోదరులను, బంధువులను, ధనవంతులను, పొరుగువారిని పిలిస్తే వారు నిన్ను పిలుస్తారు. అలాకాక బలహీనులను, దివ్యాంగులను, బీదలను పిలువు.. వారు నిన్ను మళ్లీ వారింటికి పిలవలేరు కనుక.. నీవు ధన్యుడవు" అన్నారు ప్రభువు. ఒకాయన తన ఇంట్లో విందు ఏర్పాటు చేసి..

బంధువులను, స్నేహితులను పిలిచాడు. అయితే వారు వేరే పనులు ఉండటంతో.. ఎవరూ విందుకు హాజరుకాలేకపోయారు. అప్పుడు ఆ పెద్దాయన బీదసాదలను పిలిచి.. వారికి కడుపు నిండా విందు భోజనం పెట్టి పంపాడు. పేదల ఆకలి తీర్చానన్న తృప్తితో ఆ యజమాని ఎంతో సంతోషించాడు. ప్రభువు దృష్టిలో అదే ఘనమైన విందు.

– ఎం.సుగుణరావు

ఈనాడు సినిమా

కౌసల్య బౌలింగ్‌లో

సిక్సు కొట్టు కామ్రేడ్

'కాదేదీ ప్రచారానికి అనర్హం' అనుకుంటుంది సినీ పరిశ్రమ. మైకు పట్టుకుని ఏం మాట్లాడినా, వేదిక ఎక్కి ఏం చేసినా అంతా అందులో భాగాలే. పాటల వేడుకలు, విడుదల ముందస్తు హంగామాలూ.. పేరు ఏదైనా సరే, వాటి పరమార్థం ప్రచారమే. అయితే వేడుకల్లో కేవలం స్పీచులతో సరిపెట్టడం లేదు. ఏదో కాస్త విభిన్నంగా ఉండాలని ఆరాటపడుతున్నారు. అందుకే సినిమా వేడుకలు కూడా ఈమధ్య 'సినిమా' అంత వైవిధ్యంగా సాగుతున్నాయి. ఈమధ్య హైదరాబాద్‌లో 'కౌసల్య కృష్ణ మూర్తి' విడుదల ముందస్తు వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి విజయ్ దేవరకొండ అతిథిగా వచ్చాడు. క్రికెట్ నేపథ్యంలో సాగే కథ ఇది. అందుకే విజయ్‌తో బ్యాటు పట్టించారు. ఆ సినిమా నాయిక ఐశ్వర్యా రాజేష్ బౌలర్ అవతారం ఎత్తితే, విజయ్ బ్యాటింగ్ చేశాడు. కాసేపు ఇద్దరూ సరదాగా క్రికెట్ ఆడి, ఆహూతుల్ని అలరించారు. అన్నట్టు ఈ సినిమా కోసం ఐశ్వర్య నిజమైన క్రికెటర్‌లా తర్ఫీదు పొందింది. విజయ్ కూడా కాలేజీ రోజుల్లో క్రికెటరే. బౌలింగూ, బ్యాటింగూ చేసి ఆల్ రౌండర్ అనిపించుకున్నాడు. ఆ అనుభవం ఇక్కడ అక్కరకు వచ్చినట్టుంది.

రాపాక వరప్రసాద్, కల్యాణ్‌దేవ్, పవన్‌కల్యాణ్, హరిప్రసాద్, అల్లు అరవింద్

పిస్తోలుతో కాల్చుకుని చనిపోదామనుకున్నా

- పవన్ కల్యాణ్

"ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథని సినిమాగా తీయాలన్న మాట ఎప్పట్నుంచో వింటున్నా. కానీ ఎవ్వరూ ధైర్యం చేయలేదు. రామ్‌చరణ్ ధైర్యం చేశాడు. ఈ సినిమా చేస్తే చిరంజీవిగారే చేయాలి, తీస్తే రామ్‌చరణే తీయాలి అనిపించేలా 'సైరా' తెరకెక్కింద"న్నారు పవన్ కల్యాణ్. ఆగస్టు 22 చిరంజీవి పుట్టిన రోజు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో అభిమానుల మధ్య చిరు పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "అభిమానుల్లో ఒకడిగా ఇక్కడికి వచ్చాను. జీవితంలో నా స్ఫూర్తి ప్రదాత అన్నయ్య. ఓ అభిమానిగా ఆయన్ని ఎలాంటి సినిమాలో చూడాలని కోరుకున్నానో అలాంటి సినిమా 'సైరా నరసింహారెడ్డి'. ఈ చిత్రంలో నాకు ఇష్టమైన ఇద్దరు వ్యక్తులు పనిచేశారు. ఒకరు అన్నయ్య, మరొకరు అమితాబ్‌బచ్చన్. నా జీవితంలో మూడు సందర్భాల్లో తప్పుడు మార్గం వైపు వెళ్లకుండా అన్నయ్య నన్ను కాపాడారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పదుల సంఖ్యలో చనిపోయినప్పుడు చాలా బాధ అనిపించింది. నాకూ అలాంటి సందర్భమే ఎదురైంది. నేను ఇంటర్ ఫెయిల్ అయినప్పుడు నిరాశ నిస్పృహలకు లోనయ్యా. అన్నయ్య దగ్గరున్న లైసెన్స్ పిస్టోల్ తీసుకుని కాల్చుకుని చనిపోదామనుకున్నా. కానీ ఆరోజు అన్నయ్య చెప్పిన మాటలు నాలో విశ్వాసం నింపాయి. ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ల ఇళ్లల్లో కూడా చిరంజీవి లాంటి అన్నయ్యలు ఉంటే అలాంటి ఘటనలు జరిగేవికావు. యుక్త వయసులో ఉన్నప్పుడు భారతదేశాన్ని ఎవరైనా ఏమైనా అంటే కోపంతో ఊగిపోయేవాడ్ని. ఆ సమయంలో 'నువ్వు కులం, మతం దాటి మానవత్వం వైపు ఆలోచించాలి' అని అన్నయ్య హితబోధ చేశారు. 22 ఏళ్ల వయసులో ఓ ఆశ్రమంలో చేరిపోయా. 'నాకేం అవసరం లేదు. ఇలా ఉండిపోతా' అని చెప్పాను. నువ్వు భగవంతుడివైపు వెళ్లిపోతే సమాజానికి ఎందుకూ ఉపయోగపడవు. బాధ్యతలు ఉంటే ఈ మాటలు మాట్లాడవు అని నన్ను అన్నయ్య ఆపారు. ఆ మాటలే ఈరోజు మీ ముందు నిలబడేలా చేశాయి. 'సైరా' లాంటి గొప్ప సినిమాకి గళం ఇవ్వడం నా అదృష్టం. మా అన్నయ్య ఇలాంటి సినిమా చేయాలని కలలు కన్నాను. కానీ ఇలాంటి గొప్ప సినిమా తీసే శక్తి, సమర్థత నాకు లేకపోయాయి. కానీ నా తమ్ముడు లాంటి రామ్‌చరణ్ ఈ పని చేశాడు. ఏ తండ్రియినా తనయుడ్ని లాంచ్ చేస్తారు. కానీ ఇక్కడ కొడుకే తండ్రిని లాంచ్ చేశాడు. సురేందర్‌రెడ్డి ఈ సినిమాతో తన కలని సాకారం చేసుకున్నారు. ఓ అజ్ఞాత వీరుడి కథ ఇది. అలాంటి వ్యక్తి చరిత్రని తెరకెక్కించిన గొప్ప చిత్రంలో నేను నటించకపోయినా గొంతు ఇవ్వగలిగాను. 'అన్నా నువ్వు బద్దలు కొట్టగలవు.. నువ్వు చరిత్ర తిరగరాయగలవు. అన్నా.. నీకు మేం బానిసలం" అన్నారు. కార్యక్రమంలో అల్లు అరవింద్, కల్యాణ్‌దేవ్, ఎం.ఎల్.ఏ రాపాక వరప్రసాద్, హరిప్రసాద్, సాయిధరమ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

చుల్‌బుల్ పాండే తెలుగు పంచులు


సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్ అభిమానులతో ఈలలేయించిన చిత్రం 'దబాంగ్'. దానికి సీక్వెల్‌గా వచ్చిన 'దబాంగ్ 2' లోనూ చుల్‌బుల్ పాండేగా చెడుగుడు ఆడేశాడు సల్మాన్. ఇప్పుడు ఆ సిరీస్‌లో 'దబాంగ్ 3' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సల్మాన్‌తో 'వాంటెడ్' చిత్రాన్ని తెరకెక్కించిన ప్రభుదేవా దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. తొలి రెండు చిత్రాల్లో నటించిన సోనాక్షి సిన్హా మూడో 'దబాంగ్'లోనూ నాయికగా అలరించనుంది. ప్రముఖ కన్నడ కథానాయకుడు సుదీప్ విలన్‌గా సల్మాన్‌తో ఢీకొట్టనున్నారు. ఇప్పటికే సెట్స్ మీదకు వెళ్లిన ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా డిసెంబరు 20న విడుదల చేయనున్నారు. ఈసారి సల్మాన్ తెలుగులోనూ పంచ్‌లు వేయనున్నారు. 'దబాంగ్ 3'ని హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ విడుదల చేస్తున్నట్లు సల్మాన్ ట్విటర్‌లో వెల్లడించారు. ఈ చిత్రంతో ప్రముఖ దర్శకుడు, నటుడు మహేష్ మంజ్రేకర్ కుమార్తె సైయీ పరిచయమవుతోంది.

కోన వెంకట్

రూ.500 కోట్లతో స్టూడియో

గుంటూరు జిల్లా సూర్యలంకలో రూ.500 కోట్లతో సినిమా స్టూడియో, థీమ్ వాటర్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు సినీ రచయిత కోన వెంకట్ తెలిపారు. గుంటూరు జిల్లా బాపట్లలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖతో కలిసి ఈ ప్రాజెక్టు చేపడతామన్నారు. స్థానిక అధికారుల అనుమతితో సూర్యలంకలో సర్వే చేస్తున్నట్లు వివరించారు. అమెరికాలోని డిస్నీల్యాండ్ థీమ్ పార్క్ తరహాలో దీనిని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

క్రిస్మస్ కానుకగా 'నిశ్శబ్దం'...: అనుష్క, మాధవన్, షాలిని పాండే, అంజలి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'నిశ్శబ్దం'. కోన ఫిల్మ్ కార్పొరేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్నాయి. హేమంత్ మధుకర్ దర్శకుడు. ఈ చిత్రంలో ప్రముఖ హాలీవుడ్ నటుడు మైఖేల్ మ్యాడిసన్ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, ఆంగ్లంలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తామని కోన వెంకట్ చెప్పారు. క్రిస్మస్ కానుకగా డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, బాపట్ల

పూజా హెగ్డే

గీతోపదేశం

అమ్మను మించి దైవమున్నదా
ఆత్మను మించి అద్దమున్నదా
జగమే పలికే శాశ్వత సత్యమిదే
అందరినీ కనే శక్తి అమ్మ ఒక్కటే
అవతార పురుషుడైనా ఓ అమ్మకు కొడుకే

గీతం: అమ్మను మించి దైవమున్నదా
చిత్రం: 20వ శతాబ్దం
రచన: సి.నారాయణరెడ్డి

– పంపినవారు:
కాసర్ల మహేందర్, హన్మకొండ

చావడానికి సమయం లేదంటున్న బాండ్

డేనియల్ క్రేగ్

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ దక్కించుకున్న 'జేమ్స్ బాండ్' సిరీస్‌లో 25వ చిత్రం వస్తున్న సంగతి తెలిసిందే. డేనియల్ క్రేగ్ ఐదో సారి బాండ్‌గా నటిస్తున్నారు. కేరీ ఫుకునగ దర్శకుడు. ఈ చిత్రానికి 'నో టైమ్ టు డై' అనే పేరు ఖరారు చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సినిమా విడుదల తేదీని కూడా ప్రకటించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 8న అమెరికాలో విడుదలవుతున్న ఈ చిత్రం దానికి ఐదు రోజులు ముందుగానే ఏప్రిల్ 3న భారత్‌లో ప్రదర్శితం కానుంది. ఎంఐ6 ఏజెంట్‌గా బాధ్యతల నుంచి తప్పుకుని జమైకాలో విశ్రాంతి తీసుకుంటున్న బాండ్ దగ్గరికి అతని మాజీ సహచరుడు వస్తాడు. ఓ శాస్త్రవేత్తను అపహరించిన వాడిని పట్టుకునే విషయంలో సాయం చేయమని కోరతాడు. దీంతో వేట మొదలుపెట్టిన బాండ్‌కు ఎలాంటి క్లిష్ట పరిస్థితులెదురయ్యాయి? అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అరాచకాలకు తెగబడే విలన్‌ను ఎలా పట్టుకున్నాడన్న కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

భయమేసింది.. సాయం కోసమే ఇంటికెళ్లా!

రాజ్‌తరుణ్

"ప్రమాదం జరగ్గానే భయపడిపోయా. ఆ క్షణం నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. సాయం పొందేందుకే అక్కడి నుంచి ఇంటికి పరిగెత్తుకుంటూ వెళ్లా" అన్నారు యువ కథానాయకుడు రాజ్‌తరుణ్. సోమవారం రాత్రి ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ విషయంపై రాజ్‌తరుణ్ ట్విటర్‌లో స్పందించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఒక్కడినే ఉన్నానని, తనే నడుపుతున్నానని ఆయన తెలిపారు. తాను క్షేమంగానే ఉన్నానని, ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నానని తెలిపారు. 'నేను క్షేమంగా ఉన్నానా లేదా అని చాలా మంది ఫోన్లు చేశారు. మీ అభిమానానికి ధన్యవాదాలు. మలుపులో నా కారు నియంత్రణ కోల్పోయింది. రోడ్డు పక్కనున్న గోడకి ఢీకొట్టింది. ఆ శబ్దంతో ఒక్కసారిగా నా చెవులు మూసుకుపోయాయి. ఒక్కసారిగా పెరిగిన గుండె వేగంతో ఏం జరిగిందో అర్థం కాలేదు. సీటు బెల్టుతోనే ఉన్న నన్ను నేను ఒక్కసారిగా అంతా కలయజూసుకొని, సాయం కోసం అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్లా. జరిగింది ఇదీ" అని తెలిపారు రాజ్‌తరుణ్.

హీరోల్ని అందుకోవడం కష్టం

కథానాయికల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పరభాష నుంచి వస్తారు కదా, ముందు తెలుగు నేర్చుకోవాలి. హీరోలతో పాటు పోటీ పడుతూ డైలాగులు చెప్పాలి. వాళ్లతో సమానంగా స్టెప్పులు కూడా వేయాలి. దానికి తగ్గట్టే కథానాయికలు శ్రమిస్తున్నారు. డ్యాన్సులు ముందుగానే ప్రాక్టీస్ చేసేస్తున్నారు. సెట్‌కి రాకముందే డైలాగులు బట్టీ పట్టేస్తున్నారు. పూజా హెగ్డే కూడా ఈ జాబితాలో ఉంటుంది. "ఎన్టీఆర్, మహేష్, అల్లు అర్జున్.. ఇలాంటి స్టార్ కథానాయకులతో పని చేసే అవకాశం నాకు తొలి రోజుల్లోనే దక్కింది. వీళ్లు మామూలు కథానాయకులు కాదు. డైలాగులు చెప్పడంలో దిట్ట. చుట్టూ ఉన్నవాళ్లు ఏమాత్రం అలసత్వం చూపించినా సెట్లో దొరికిపోతారు. అందుకే నా వరకూ నేను జాగ్రత్తగానే ఉంటాను. 'నా డైలాగులు ముందే ఇచ్చేయాలి' అని దర్శకులకు చెప్పేస్తుంటాను. రాత్రంతా డైలాగులు చదువుతూ కూర్చుంటాను. లేకపోతే మన హీరోల్ని అందుకోవడం కష్టం. ఈ హోమ్‌వర్క్ నాకు ఉపయోగపడింది. తెలుగు తొందరగా నేర్చుకోగలిగా" అంది పూజ.

విజయ్ సేతుపతి

విలన్ వచ్చేశాడు

తమిళంలో మంచి నటుడిగా పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. 'సైరా నరసింహారెడ్డి'లో ఆయన ఓ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. వైష్ణవ్ తేజ్ 'ఉప్పెన'లో ఆయన విలన్‌గా కనిపించనున్నారు. మైత్రీ మూవీస్, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్న చిత్రమిది. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు దర్శకుడు. హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. బుధవారం నుంచి విజయ్ సేతుపతి సెట్లో పాల్గొంటున్నారు. విజయ్, వైష్ణవ్ తేజ్, రాజీవ్ కనకాల సహా వందల మంది జూనియర్ ఆర్టిస్టులపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. దాదాపు 50 శాతం చిత్రీకరణ పూర్తయింది. కృతిశెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


సి.కల్యాణ్, పి.రామ్మోహన్‌రావు, బసిరెడ్డి, కె.ఎస్.రామారావు

పైరసీని అరికట్టేందుకు 'డి సినిమా'

సినిమా డిజిటల్ డెలివరీ ధరలు నిర్మాతలకి అందుబాటులోకి రావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు. ధరలతో పాటు పైరసీని కూడా నియంత్రించగలిగే సేవలతో 'డి సినిమా' డిజిటల్ సర్వీసులు అందుబాటులోకి రానుండడం శుభపరిణామం అన్నారు. డిజి క్వెస్ట్ ఇండియా, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సంస్థల భాగస్వామ్యంతో డి సినిమా డిజిటల్ సర్వీస్‌ని త్వరలోనే తీసుకురానున్నారు. దానికి సంబంధించిన డెమోని బుధవారం హైదరాబాద్‌లోని ఎ.ఎమ్.బి. సినిమాస్‌లో నిర్వహించారు. డిజిక్వెస్ట్ సీఎండీ బసిరెడ్డి మాట్లాడుతూ "పైరసీ నిర్మూలన కోసం రెండేళ్లు ప్రయత్నం చేసి డి సినిమా సేవల్ని తెస్తున్నాం. దీని ద్వారా వచ్చే లాభాల్ని తెలుగు చలన చిత్ర సంస్థలు సమానంగా పంచుకుంటాయి. త్వరలోనే డి సినిమా సేవల గురించి అన్ని సంస్థలు కలిసి ఓ నిర్ణయం తీసుకోబోతున్నాయి" అన్నారు. "నిర్మాతల కష్టం పైరసీపాలు కాకుండా డి సినిమా సేవలు ఆరంభిస్తోంది. అన్ని రాష్ట్రాల్లోనూ అందుబాటులోకి తీసుకురావాల"న్నారు తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్. కె.ఎస్. రామారావు, సునీల్ నారంగ్, కె.ఎల్.దామోదర్‌ప్రసాద్, మోహన్ వడ్లపట్ల, కె.మురళీమోహన్, వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రాంబో సాహసాలకు సిద్ధం

సిల్వెస్టర్ స్టాలోన్

హాలీవుడ్ కథానాయకుడు సిల్వెస్టర్ స్టాలోన్‌ను స్టార్‌గా మార్చేసిన చిత్రం 'రాంబో'. ఈ సిరీస్‌లో ఇప్పటివరకూ నాలుగు చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు ఐదో చిత్రంగా 'రాంబో: లాస్ట్ బ్లడ్' తెరకెక్కింది. ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. అందులో స్టాలోన్ సంభాషణలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. కిడ్నాప్ అయిన స్నేహితుడి కుమార్తెను కాపాడటానికి రాంబో చేసే సాహసాలతో ఈ చిత్రం తెరకెక్కింది. సెప్టెంబరు 20న ఇంగ్లిష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

ఓ విద్యార్థి జీవితంలో...

లక్ష్, సాహితి

లక్ష్, సాహితి జంటగా నటించిన చిత్రం 'బోయ్'. అమర్ విశ్వరాజ్ దర్శకుడు. ఆయనతో పాటు ఆర్.రవి శేఖర్ రాజు నిర్మించారు. ఎల్విన్ జేమ్స్, జయ ప్రకాష్ సంగీతం అందించారు. శుక్రవారం విడుదల కానుంది. హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. నిర్మాత రాజ్ కందుకూరి బిగ్ సీడీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ "ఇలాంటి కథల్ని తెరపైకి తీసుకురావడం కష్టం. ఇటీవల చిన్న చిత్రాలే పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. ఆ కోవలో 'బోయ్' చేరాల"న్నారు. "ఓ విద్యార్థి జీవితంలోని ఆఖరి రోజులు ఎలా గడిచాయనే కథతో తెరకెక్కించాం. లక్ష్, సాహితి చక్కటి అభినయం ప్రదర్శించార"న్నారు దర్శకుడు.

రజనీకాంత్ నాకు స్ఫూర్తి

శేఖర్ వర్మ

"అవకాశం వస్తే విలన్ పాత్రలకూ సిద్ధమే" అన్నారు శేఖర్ వర్మ. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నివాసి'. సతీష్ రేగళ్ల దర్శకుడు. వివియా, విద్య నాయికలు. శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా విలేకర్లతో శేఖర్ మాట్లాడుతూ "ఒక వ్యక్తి ప్రయాణం నేపథ్యంలో 'నివాసి' తెరకెక్కింది. ఎన్నారై కుర్రాడిగా కనిపిస్తా. స్వదేశానికి వచ్చిన ఆ కుర్రాడు తన మూలాలను వెతుక్కుంటూ ప్రయాణం సాగిస్తాడు. అతడి అనుభవాల సమాహారమే ఈ సినిమా. 'మాది కాకినాడ దగ్గర గొల్లపాలెం. నటనలో నాకు రజనీకాంత్‌గారే స్ఫూర్తి. హీరోగా 'అంగుళీక', 'యుగన్' సినిమాలు చేస్తున్నా. బాలకృష్ణ, కె.ఎస్.రవికుమార్ చిత్రంలో ఓ కీలక పాత్ర చేస్తున్నా. బాలకృష్ణగారితో 'జై సింహా'లోనూ నటించా" అన్నారు.

ఆ నలుగురూ బీటెక్ చదువుతున్నారు. ఓ ఆసుపత్రిలోని దృశ్యం వారిచేత ఓ ప్రయోగం చేయించింది. కంటి వ్యాధులు గుర్తించే పరికరం కనుగొనే స్థాయికి తీసుకెళ్లింది. ఇంతకీ వాళ్లెవరూ... ఆ విశేషాలేంటంటే...

నేత్ర రక్షణకు... కదిలిన నేస్తాలు

జె-హబ్ నుంచి టీ హబ్ వరకు...

పట్టుదల ఉండాలే కానీ దేన్నైనా సాధించగలుగుతామంటారు మునిగంటి శ్రీజ, దారపనేని సాయిసౌమ్య, భవ్యశ్రీ కుడికాల, దుర్గం నీలిమ. వీళ్లంతా బీవీఆర్ఐటీ-హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ విమెన్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నారు. పెద్దవాళ్లు వైద్యరంగాన్ని ఎంచుకోమన్నా వీళ్లు మాత్రం ఇంజినీరింగ్ మీదున్న ఆసక్తితో ఎంపీసీలో చేరారు. ఇంజినీరింగ్ విద్యలో భాగంగా వివిధ ప్రాజెక్టులు చేయడానికి వారు అనేక ప్రాంతాలకు వెళ్లేవారు. ఒకరోజు ఓ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడో పెద్దావిడతో మాట్లాడారు. ఆమెది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం ఆమె స్వస్థలం. అంత దూరం నుంచి నగరానికి కంటి ఆపరేషన్ చేయించుకోవడానికి వచ్చింది. పైగా అప్పటికే ఆమెకు రెండు కంటి ఆపరేషన్లు జరిగాయి. అందులో ఒకటి విఫలమైంది. దానికితోడు మరో కంటికి ఇన్‌ఫెక్షన్. ఇన్ని ఆపరేషన్లు జరిగితే... డబ్బు మంచినీటిలా ఖర్చవుతుంది. ఆమెలాంటి పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ఎదుర్కొంటారు. ఇవన్నీ తెలుసుకున్న ఈ నలుగురూ తొలి దశలోనే కంటికి వచ్చే ఇన్‌ఫెక్షన్లను గుర్తిస్తే కనుక... ఇలాంటి సమస్యల్ని చాలామటుకూ తగ్గించొచ్చని అర్థంచేసుకున్నారు. ఆ ఆలోచన వాళ్లను నిలవనీయలేదు. అంతా కలిసినప్పుడల్లా దీని గురించే మాట్లాడుకునేవారు. ఏదో ఒకటి చేయాలనుకునేవారు. చివరకు కంటి సమస్యలు తొలిదశలోనే గుర్తించగలిగేలా ఒక పరికరం తయారు చేయాలని, అది అందరికీ అందుబాటులో ఉండేవిధంగా రూపొందించాలనుకున్నారు. ఈ ఆలోచన వారి అధ్యాపకులకు సైతం నచ్చింది. ఓ సారి జేఎన్‌టీయూలోని జె-హబ్ విద్యార్థుల దగ్గర నుంచి వినూత్న ఆలోచనలను ఆహ్వానించింది. వీరూ తమ ప్రతిపాదనను తెలియజేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

జేఎన్‌టీయూలోని జె-హబ్ ఎగ్జైట్ కార్యక్రమానికి వీరి ఆలోచన ఎంపికైంది. దాంతో ఈ నలుగురూ నగరంలోని ప్రముఖ కంటి నిపుణులను సంప్రదించారు. అక్కడి డాక్టర్లకు తమ ప్రయత్నాలు వివరించారు. వాళ్ల సలహాలూ తీసుకుని... పరికరం తయారీ మొదలుపెట్టారు. జె-హబ్ వారికి ఎంతగానో చేయూతనం దించింది. వీళ్ల ఆలోచనకు మోస్ట్ ప్రామిసింగ్ ప్రాడక్ట్ అవార్డు వచ్చింది. వారికి అవసరమైన వైఫై సదుపాయం, కంప్యూటర్లు, ఇతర సామగ్రి సమకూర్చింది. ఇప్పటికీ అవసరమైనవాటిని అందిస్తోంది. తరువాత వారి ఆలోచనను టీహబ్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ బిల్డ్ బోయింగ్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఏకైక మహిళ స్టార్టప్ ఇదే. వీరికి టీహబ్ సైతం చేయూతనందించనుంది. ప్రస్తుతం వీరు యాక్సలరేటర్ లెవల్‌కి ఎంపికయ్యారు.

> ఇప్పుడున్న డయాగ్నోసిస్ మిషన్లు పరిమాణంలో చాలా పెద్దవి. ఖరీదుతో కూడుకున్నవి. వాటిని నిర్వహించాలంటే ఒక నిపుణుడు అవసరం. అన్నిచోట్లకు తీసుకెళ్లలేం. ఒక్కో వ్యాధిని నిర్ధారించడానికి ఒక్కో మిషన్ ఉంటుంది. వీళ్లు తయారు చేసిన పరికరంతో రెటీనాకు సంబంధించిన ఏ వ్యాధినైనా కనుక్కోవచ్చు. చిన్నగా ఉంటుంది కాబట్టి ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. దీంతో తీసిన ఫొటోతో వైద్యులు వ్యాధిని గుర్తించగలుగుతారు. గ్లకోమా, మాక్యులర్ డీజెనరేషన్, డయాబెటిక్ రెటినోపతి వంటి వ్యాధులు గుర్తించవచ్చు. 'ఈ పరికరాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ఆర్థికంగా చేయూత లభిస్తే ఇలాగే ముందుకు సాగుతా'మని అంటోంటి భవ్యశ్రీ.

ఎన్నో చెక్కిరింతలు... శ్రీజ, భవ్య, నీలిమ, సాయిసౌమ్య ఈ పరికరాన్ని తయారు చేసేటప్పుడు చాలామంది వారిని సూటిపోటి మాటలు అన్నారు. 'ఇటువంటి వైద్య పరికరాలు బీటెక్ చదివే మీరెలా తయారు చేస్తారు... మెడిసిన్‌పై మీకు పట్టు ఉందా... మీ వల్ల కాదు... మీ కష్టం మొత్తం వృథా అవుతుంద'ని అనేవారట. చాలా తక్కువమంది మాత్రమే వారిని ప్రోత్సహించారు. ఓ వైపు చదువుకుంటూనే దీన్ని తయారుచేయడానికి సిద్ధమయ్యారు. మొదట పైప్‌తో తయారు చేశారు. అందులో ఐదు లెన్స్‌లు వినియోగించారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ సలహాల కోసం వైద్యులను సంప్రదించేవారు. వీరి ప్రయత్నాల్ని వారూ ప్రోత్సహించేవారు. 'ఎన్ని సార్లు విఫలమైనా మనమైతే ఒక అడుగు ముందుకు వేశాం కదా... ఇలాగే ప్రయత్నిస్తే తప్పకుండా విజయం సాధిస్తామని అనుకునేవాళ్లం. నెలన్నర జె-హబ్ ఎగ్జైట్ కార్యక్రమంలో నాలుగు వారాలు గడిచిన తరువాత మా ప్రయోగం ఓ కొలిక్కి వచ్చింది. వైద్యులూ పరీక్షించి అనుకున్నది సాధించే స్థాయికి వస్తున్నారని అన్నప్పుడు మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆ కార్యక్రమంలోనే ఈ పరికరం తయారీ పూర్తిగా కాకపోయినా తరువాతైనా దీన్ని వందశాతం చేసితీరాలనే పట్టుదలతో కష్టపడేవాళ్లం...' అని చెబుతుంది భవ్యశ్రీ. చివరకు అనుకున్నట్లుగా ఆరువారాల్లోనే దీన్ని తయారు చేశారు. ఇందులో శ్రీజ ఐనేత్ర యాప్‌ను అభివృద్ధి చేసింది. నీలిమ, సాయిసౌమ్య దీనికి కావాల్సిన హార్డ్‌వేర్ రూపొందించారు. భవ్యశ్రీ స్టడీ ఆఫ్ ఐ డిసీజెస్ అండ్ మార్కెట్ రీసెర్చ్ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. వీరంతా కలిసి దీనికి సంబంధించిన టెక్నాలజీని రూపొందించారు. వీళ్లలో ఇద్దరు ఇంజినీరింగ్ మూడో ఏడాదిలో ఉంటే... మిగిలిన ఇద్దరు చివరి సంవత్సరం చదువుతున్నారు.

ఆలుమగల బంధంలో చిన్న చిన్న అలకలు అందంగా ఉంటాయి. కవ్వింపులు జీవితంలో కొత్త దనాన్ని నింపుతాయి. అవి మితిమీరితేనే సమస్య. ఎందుకా పరిస్థితి... అలాంటి అలకలు, చికాకుల నుంచి బయటపడాలంటే ఏం చేయాలో తెలుసుకుందామా...

కలహాల కాపురానికి బైబై

అనుబంధం

● ప్రణీత, ప్రణయ్ ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఒకే సంస్థలో పనిచేస్తున్నారు. మొదటి ఏడాది ఇద్దరూ జాలీగా గడిపేశారు. రోజులు గడిచేకొద్దీ ఇంటిపనులు పంచుకునే విషయంలో కీచులాడుకోవడం మొదలుపెట్టారు. పెళ్లి చేసుకుని తొందరపడ్డామని ఒకరినొకరు నిందించుకుంటున్నారు. ఇదేమైనా పరిష్కారం కాని సమస్యా?

● రవళి, నితిన్‌లది పెద్దలు కుదిర్చిన పెళ్లే. ఇన్నాళ్లు ఉమ్మడి కుటుంబంలో ఉన్న వారు ఈ మధ్యే వేరు కాపురం పెట్టారు. అప్పటి నుంచి మొదలయ్యాయి గొడవలు. కారణం తన సంపాదనంతా ఆమె వృథా చేస్తుందంటాడు నితిన్. ఇంటికోసమే కదా! ఖర్చుపెడుతున్నా అంటుంది రవళి. దీనికి ముగింపు లేదా?

పైన చెప్పిన ఉదాహరణలే కాదు...టీ నుంచి టీవీ రిమోట్ వరకూ ఏ కారణానికైనా ఇద్దరి మధ్యా పోరు మొదలవ్వొచ్చు.

ఇలాంటి మనస్పర్థలు, అపోహలతో మొదలైన విభేదాలే విడిపోయేంత అగాధాన్ని సృష్టిస్తాయి. భర్త అనారోగ్యంతో ఉన్నాడు కాబట్టి.. రోజూ లడ్డూలు పెడితే మంచిదని ఎవరో చెప్పడంతో అదే చేసిందామె. అతడు అది భరించలేక కోర్టు మెట్లెక్కడం చదివే ఉంటాం. ఇలాంటి సమస్యల్ని కోర్టు వరకూ తీసుకెళ్లకుండా... ఎంత త్వరగా పరిష్కరించుకుంటే కాపురం అంత సజావుగా సాగుతుంది. ఎలాగంటే..

మనసు తెలుసుకోండి...

పెళ్లికాక ముందే... భాగస్వామి మనసు తెలుసుకోవడం మంచిది. అలాని అవతలివారిని మెప్పించాలని ముసుగేసుకోవద్దు. మీరు మీరులా ఉండటం వల్ల భవిష్యత్తులో వచ్చే చాలా సమస్యలకు ముందే అడ్డుకట్ట వేయవచ్చు. పెళ్లయిపోయింది కదాని భాగస్వామి మనసు మీకు పూర్తిగా తెలుసని అనుకోవడమూ సరికాదు. సందర్భాన్ని బట్టి ఎదుటివాళ్లు మారిపోవచ్చు. ఆ పరిస్థితుల్ని అర్థంచేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఎదురయ్యే చిన్న సమస్యల్ని దిద్దుకునే ప్రయత్నం చేయాలి. నచ్చని విషయాలను పదే పదే ప్రస్తావించడం, పాత గొడవల్ని తవ్వడం చేస్తుంటే... ఇద్దరి మధ్య దూరం మరింత పెరుగుతుంది.

సున్నితంగా చర్చించుకోవాలి...

పెళ్లికి ముందే... పిల్లల్ని ఎప్పుడు కనాలి, పెళ్లి తరువాత ఉద్యోగం చేయాలా వద్దా... పంచుకోవాల్సిన బాధ్యతలు, కుటుంబంతో కలిసుండాలా లేదా అనేవి మాట్లాడుకుంటే మంచిది. ఆ తరువాతే భవిష్యత్తు నిర్ణయాలు, ఇతర అంశాలను చర్చించుకోవాలి. సమస్య ఎలాంటిదైనా సరే భార్యాభర్తలే పరిష్కరించుకునేలా చూసుకోవాలి. ఇద్దరి మధ్య అవగాహన ఉంటే మూడో వ్యక్తి ప్రమేయం ఉండదు. ఇరు కుటుంబాల మధ్య పొరదర్శకత, సఖ్యత ఉంటే... భవిష్యత్తులో చాలా సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

కలిసి నిర్ణయించుకునేలా...

దంపతులిద్దరి మధ్య నమ్మకం లేకపోతే కాపురం సజావుగా సాగదు. అన్యోన్యత లోపిస్తే రాజీ పడాలనే తత్వం తగ్గిపోతుంది. ఒకరికొకరు గౌరవం ఇచ్చిపుచ్చుకుంటూ.. అభిప్రాయ భేదాలకు ముగింపు పలికితే ఏ సమస్యా ఉండదు. ఇది సాధ్యం కావాలంటే... ఎలాంటి నిర్ణయమైనా ఇద్దరూ కలిసి తీసుకునేలా చూసుకోవాలి. ఆర్థికం, పిల్లల పెంపకం, ఉద్యోగం... ఏదయినా సరే అది ఇద్దరి నిర్ణయం అయ్యుండాలి. వీలైనంతవరకూ రహస్యాలు లేకుండా చూసుకుంటే మరీ మంచిది. ముఖ్యంగా సంపాదించే వారిదే పైచేయి అనుకోవద్దు. ఏ నిర్ణయాలు తీసుకున్నా, ఎవరెంత సంపాదిస్తున్నా కలిసి చర్చించుకోవాలి.

వ్యక్తిగత జీవితం ముఖ్యం...

ఒకప్పుడు దంపతులంటే... 'నాకు నువ్వు... నీకు నేను..' అని అనుకునే వారు. ఇప్పుడు అలానే ఉంటున్నారు కానీ... స్త్రీలూ పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇద్దరికీ స్నేహితులు, సహోద్యోగులు... ఇలా చాలామందే ఉంటారు. దీన్ని గుర్తుంచుకుని ఒకరికొకరు స్వేచ్ఛ ఇచ్చుకోవడం మంచిది. ఒకరి వ్యక్తిగత అభిరుచుల్ని మరొకరు గౌరవించడం, ప్రోత్సహించడం మంచిదే. అది ఒకరిపై మరొకరికి నమ్మకాన్ని, భరోసానీ అందిస్తుంది. జీవితం సంతోషంగా సాగిపోయేలా చేస్తుంది.

వాదనలెందుకు...

భార్యాభర్తల అనుబంధంలో అపోహలు, కోపతాపాలు...అన్నీ ఉంటాయి. 'తమలపాకుతో తానొకటంటే... తలుపుచెక్కతో నే రెండిస్తా' అనే ధోరణికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఒకరికి కోపం వచ్చినప్పుడు మరొకరు అర్థం చేసుకుని మౌనంగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఒకవేళ కోపంలో ఏదైనా మాట అంటే... కొంత సమయం తరువాత క్షమాపణ చెప్పడానికి వెనుకాడొద్దు. దగ్గరకు తీసుకొని మళ్లీ ఇలాంటివి జరగవు అనే భరోసా ఇవ్వాలి. ముఖ్యంగా పిల్లల ముందు ఎలాంటి విషయాలైనా పెద్దవిగా చేసి గొడవలు పెట్టుకోవడం సరికాదు. భార్యాభర్తల గొడవలు చిన్నతనం నుంచీ పిల్లల మనస్తత్వంపై ప్రభావం చూపే అవకాశం ఎక్కువని అధ్యయనాలు చెబుతున్నాయి. ఏదయినా వాదన మొదలైనప్పుడు ఉద్వేగాలు, ఉద్రేకాలకు లోనుకాకూడదు. ఒకవేళ ఎంత చెబుతున్నా ఎదుటివారు వినన్నప్పుడు ఉత్తరం రూపంలో మీ అభిప్రాయం తెలియజేయాలి. మీ సమస్య తీవ్రత వారికి తెలుస్తుంది. భాగస్వామి నుంచి ఏదయినా మార్పు కోరుకుంటే అందులో వ్యక్తపరచాలి. నచ్చని విషయాలను నిర్మొహమాటంగా చెప్పాలి.

> **సాయం చేసేలా...**
>
> చిన్న చిన్న ఆనందాలే బంధాలను దృఢంగా మారుస్తాయి. ముఖ్యంగా కలిసి ఇంటిపనులు చేసుకోవడం, ఎంత తీరిక లేకపోయినా తరచూ మాట్లాడుకోవడం తప్పనిసరి. ఎప్పుడూ ఎదుటివ్యక్తిలోని ప్రత్యేకతల్నే గమనించాలి. తరచూ ప్రేమను వ్యక్తం చేయడం తప్పనిసరి. ప్రతిదాన్ని భూతద్దంలో చూడకూడదు. భాగస్వామి ఒకమాట తూలినా... మరో మాట అనడం కన్నా మీ బాధను తెలియజేయాలి.

చల్లని వేళ... తులసి చాయ్

ఇంటివైద్యం

వాతావరణం ఏ మాత్రం చల్లగా మారినా... మనసు వేడివేడి చాయ్‌పై మళ్లుతుంది. ఈసారి తులసి, పుదీనా, లవంగం, దాల్చిన చెక్క, యాలకులు... వంటి సుగంధ ద్రవ్యాలతో చేసిన హెర్బల్ టీ ప్రయత్నించి చూడండి. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధకశక్తిని పెంచుతాయి. ఒత్తిడినీ తగ్గిస్తాయి. అనారోగ్యాలు దరిచేరవు.

తులసితో...

కప్పు నీటిని మరిగించి, పొయ్యి కట్టేయాలి. అందులో శుభ్రం చేసిన 12 తులసి ఆకులను వేసి మూత పెట్టాలి. రెండు నిమిషాల తరువాత వేడివేడిగా ఆకులతో సహా తాగాలి. ఇది కఫదోషాన్ని, దగ్గునీ తగ్గిస్తుంది.

వైరల్ జ్వరాల నుంచి రక్షణ అందిస్తుంది. తాజా తులసి ఆకులు అందుబాటులో లేకపోతే ఒకేసారి ఈ ఆకులను తెచ్చుకుని ఎండబెట్టి భద్రపరుచుకోవచ్చు. వీటితో టీ తయారు చేసేటప్పుడు మాత్రం నీటిలో కనీసం నిమిషంపాటు మరగనివ్వాలి. అప్పుడే ఆకుల్లోని సారం నీటిలోకి దిగుతుంది.

లవంగాలతో...

కప్పు నీటిని మరిగించి పొయ్యి కట్టేయాలి. అందులో రెండు లవంగాలు, అరచెంచా యాలకుల పొడితోపాటు కొద్దిగా అల్లం తరుగు వేసి మూత పెట్టాలి. రెండు నిమిషాల తరువాత వడబోసి చెంచా తేనె కలిపి తాగాలి. ఇది ఆకలి, జీర్ణశక్తిని పెంచి, కఫదోషాన్ని తగ్గిస్తుంది.

పుదీనాతో...

కప్పు నీటిని మరిగించి దింపేయాలి. ఇందులో గుప్పెడు పుదీనా ఆకులను వేసి మూత పెట్టాలి. నిమిషం తరువాత వడకట్టి చెంచా చొప్పున నిమ్మరసం, తేనె కలిపి వేడిగానే తాగాలి. ఇది జీర్ణశక్తిని మెరుగుపరిచి, పొట్ట ఉబ్బరం, వాయువుల్ని తగ్గిస్తుంది.

సుగంధ ద్రవ్యాలతో...

యాలకులు, దాల్చిన చెక్క, మిరియాలు, లవంగాలను సమపాళ్లలో తీసుకుని బరకగా పొడి చేసి భద్రపరుచుకోవాలి. కప్పు మరిగించిన నీటిలో పావు చెంచా పొడి వేసి మూత పెట్టాలి. నిమిషం తరువాత వడకట్టి చెంచా తేనె కలిపి వేడివేడిగా తాగాలి. ఇది దగ్గు, జలుబు, కఫం, అలర్జీ, సైనసైటిస్ నుంచి రక్షిస్తుంది.

అల్లంతో...

అల్లాన్ని కడిగి చెక్కు తీసి సన్నగా తరగాలి. కప్పు నీటిని మరిగించి అందులో చిన్న చెంచా అల్లం తరుగు వేసి రెండు నిమిషాలు మరిగించి దింపేయాలి. దీన్ని వడబోసి చెంచా తేనె కలిపి వేడిగా తాగాలి. ఈ చాయ్ ఆకలి, జీర్ణశక్తిని పెంచుతుంది. వికారాన్ని పోగొడుతుంది.

మీ ప్రశ్నలు ఇకపై vasuayur@eenadu.net కు పంపించగలరు.

డాక్టర్ గాయత్రీదేవి
ఆరోగ్యపీఠం

గోళ్ల అందానికి ఆలివ్ నూనె

చేతిగోళ్లు బలహీనంగా ఉన్నా, మృదుత్వాన్ని కోల్పోయినా జాగ్రత్తపడాల్సిందే. ఇంట్లో దొరికే పదార్థాలతోనే వాటి అందాన్ని మెరుగుపరచుకునేందుకు ప్రయత్నించండి.

● నీళ్లల్లో రెండు చుక్కల లిక్విడ్‌బాత్‌సోప్ వేసి గోళ్లను నాననివ్వండి. ఆ తరువాత కొద్దిగా ఆలివ్ నూనెతో మర్దన చేయండి. ఆలివ్ నూనెలో లినోలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది గోళ్లను తేమగా ఉంచుతుంది. మెరిసేలా చేస్తుంది. రెండు చెంచాల ఆలివ్ నూనెలో కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి గోళ్లపై రాయండి. దీనివల్లా అవి తాజాగా మారతాయి.

● ఒక వెడల్పాటి గిన్నెలో గోరువెచ్చని పాలు తీసుకుని అందులో కొన్ని నిమిషాలు గోళ్లను ఉంచండి. తర్వాత నీళ్లతో శుభ్రం చేసి మాయిశ్చరైజర్ రాస్తే సరిపోతుంది. దీనివల్ల గోళ్లు శుభ్రపడడమే కాక తాజాగానూ ఉంటాయి.

● కొబ్బరినూనెలో పోషకాలు ఎక్కువ. ఉండి గోళ్లను బలంగా మారేలా చేస్తాయి. చెంచా చొప్పున కొబ్బరి, ఆలివ్ నూనె, నిమ్మరసం కలిపి గోరువెచ్చగా చేసుకోవాలి. కప్పు గోరువెచ్చటి నీటిలో ఈ మిశ్రమాన్ని వేసి అందులో ఇరవై నిమిషాల పాటు గోళ్లను ఉంచాలి. ఇప్పుడు గోళ్లను శుభ్రం చేసి పెట్రోలియం జెల్లీ రాస్తే సరిపోతుంది.

పిల్లల భవిష్యత్తుకోసం.. ఏం చేయాలి?

నేను ప్రైవేటు ఉద్యోగిని. నాకు 28 ఏళ్లు. భర్త చనిపోయాడు. ఇద్దరు పిల్లలు. పాప, బాబు. వాళ్లకోసం ఇప్పటినుంచీ నెలకు పది వేల రూపాయల చొప్పున ఆదా చేయాలనుకుంటున్నా. పిల్లల ఉన్నత చదువులు, పాప భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విధంగా ఎలా పొదుపు చేయాలి? సలహా ఇవ్వగలరు. - రమ

ఒంటరి మహిళగా కుటుంబ అవసరాలు తీరుస్తూనే పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయడం చాలా కష్టమైన విషయం. మానసికంగానే కాదు, ఆర్థికంగానూ మిమ్మల్ని మీరు దృఢంగా మార్చుకోవాలి. నెలకు పదివేల రూపాయల చొప్పున దీర్ఘకాలంపాటు పొదుపు చేయాలనుకుంటున్నారు. ఇందులో ఆరు నుంచి ఏడు వేల రూపాయల్ని సిప్ రూపంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయండి. మంచి రాబడి వస్తుంది. ఇప్పటి నుంచే పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తే భవిష్యత్తులో ఎక్కువ రాబడి పొందే అవకాశం ఉంటుంది. ప్రజా భవిష్య నిధిలోనూ కొంత మొత్తం పెట్టుబడి పెట్టొచ్చు. నష్టభయం ఉండదు. 7.9 శాతం రాబడి వస్తుంది. పన్ను మినహాయింపూ ఉంటుంది. వీటితోపాటు అవసరం అనుకున్నప్పుడు డబ్బు వెంటనే తీసుకునే విధంగా అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోండి. ఇందుకోసం లిక్విడ్ ఫండ్‌లో మదుపు చేయాలి. కొంత మొత్తం రాబడి వస్తుంది. మీకు సరిపోయే టర్మ్ పాలసీ ఒకటి తీసుకోండి. ఇందులో కట్టే ప్రీమియం తక్కువే. మీ సంవత్సరాదాయానికి 15 రెట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

- స్వప్న కంతేటి,
ఆర్థిక రంగ నిపుణురాలు

మీ ప్రశ్నలు ఇకపై vasufinance@eenadu.net కు పంపించగలరు.

సబ్జెక్టు పరిజ్ఞానం, మంచి మార్కులు అరచేతిలో ఉన్నా ఉద్యోగం కోసం వేచిచూసే యువత ఎక్కువే. కారణం- ప్రాక్టికల్ పరిజ్ఞానం లేకపోవడం. సంస్థల విషయానికొస్తే.. ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంచుకున్నా ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇవ్వక తప్పడం లేదు. దీంతో సమయం, పెట్టుబడి వృథా. ఈ రెండింటికీ పరిష్కార మార్గాన్ని చూపిస్తోంది అప్రెంటిస్‌షిప్. అందుకే చాలా సంస్థలు దీనికి ప్రాముఖ్యాన్నిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌ల ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని అందిస్తూనే.. వారిలో మెచ్చినవారిని ఉద్యోగులుగా స్వీకరిస్తున్నాయి!

నేర్పిస్తాం.. నగదూ ఇస్తాం!

ఒకవైపు బోధన, రెండోవైపు పనిని చేయించడం ద్వారా నేర్పడం..ఈ రెండింటి కలయికే అప్రెంటిస్‌షిప్. దీనిలో విద్యార్థులకు తరగతి గది థియరీ బోధన కంటే నేరుగా నేర్చుకోవడంపైనే ఎక్కువ దృష్టి ఉంటుంది. పైగా పరిశ్రమ నిపుణుల నుంచి నేర్చుకునే అవకాశం. నచ్చిన పరిశ్రమ తీరు తెన్నులను దగ్గర్నుంచి చూసి, తెలుసుకునే వీలు దీనిలో కనిపిస్తుంది. ఉద్యోగ మార్గాన్ని సుగమం చేస్తుంది. ఈ ఏడాది ఇండియా స్కిల్ రిపోర్ట్ ప్రకారం- మన విద్యార్థులకు ఉద్యోగానికి సరిపడిన పరిజ్ఞానం, నైపుణ్యాలు 57% వరకూ మాత్రమే ఉంటున్నాయి. ఆచరణాత్మక నైపుణ్యాలు తగినంత లేకపోవడమే ఇందుకు కారణం. మన విద్యావ్యవస్థలో సబ్జెక్టు పరిజ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ప్రయోగపూర్వకంగా నేర్చుకునేది చాలా తక్కువ. అందుకే ఎంపిక చేసుకున్నవారు ఎంత ప్రతిభావంతులు అయినప్పటికీ పని విషయానికొచ్చేసరికి వారికి సంబంధిత శిక్షణను ఇవ్వడం సంస్థలకు తప్పనిసరి అవుతోంది. ఇందుకు సంస్థలు ఎంతో సమయాన్నీ, డబ్బునూ వెచ్చించాల్సి వస్తోంది.

> భారతీయ రైల్వేలు సాంకేతిక ఉద్యోగాల నియామకాల్లో 20 శాతం పోస్టులను అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసిన వారికి కేటాయిస్తున్నాయి. జనవరి, 2019లో వెలువడిన లెవెల్-1 లక్ష పోస్టుల్లో ఇరవై వేల ఖాళీలను వారితోనే భర్తీ చేయనున్నాయి.

ఈ పరిస్థితిని అధిగమించడానికి చాలా సంస్థలు అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రాక్టికల్ ఓరియెంటెడ్ ట్రైనింగ్‌లను రూపొందిస్తున్నాయి. స్కూలు స్థాయి నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ స్థాయిల వరకు అప్రెంటిస్‌షిప్‌లను అందిస్తున్నాయి. శిక్షణతోపాటు కొంత మొత్తంలో స్టైపెండ్‌నూ చెల్లిస్తున్నాయి.

లాభాలేంటి?

● అప్లికేషన్ థియరీని నేరుగా ఉపయోగించడం ద్వారా విషయాన్ని త్వరగా అర్థం చేసుకునే వీలుంటుంది. ● నేరుగా అనుభవమున్నవారితో పనిచేస్తూ, వారి అనుభవాలను పాఠాలుగా నేర్చుకోవచ్చు. వృత్తిపరంగా ఏవైనా సందేహాలు ఎదురైనా వెంటనే ప్రాక్టికల్‌గా నివృత్తి చేసుకునే అవకాశం. ● ఉద్యోగ సంబంధిత మెలకువలను అలవరచుకునే అవకాశం ఉంటుంది. ● ప్రారంభ వేతనం తక్కువే అయినప్పటికీ, అనుభవం, పరిశ్రమ పరిజ్ఞానం పరంగా రెజ్యూమెకు అదనపు బలాన్ని జోడించుకున్నట్లవుతుంది. పైగా ఖర్చులకు తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ● అప్రెంటిస్‌షిప్‌లో భాగంగా పరిశ్రమ నిపుణులనూ, సీనియర్లనూ కలిసే వీలుంటుంది. మంచి పరిచయాలు ఏర్పడతాయి. భవిష్యత్తులో ఇవి ఉపయోగపడతాయి. చాలాసార్లు అప్రెంటిస్‌షిప్ అందించిన సంస్థే ఉద్యోగావకాశాన్నీ ఇస్తోంది.

● ఐఓసీఎల్

కాలవ్యవధి: ఏడాది

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. టెక్నికల్, నాన్‌టెక్నికల్, టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్‌లను అందిస్తోంది.

ఎవరు అర్హులు: విభాగాలనుబట్టి పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్ వరకూ ఎంచుకుంటున్నారు. రీజియన్లవారీగా ప్రకటనలు విడుదల చేసి ఎంచుకుంటుంటారు. 18-24 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారిని ఎంచుకుంటారు. స్టైపెండ్ ఉంటుంది. **నమోదు ఎలా:** ఆసక్తి ఉన్నవారు సంస్థ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుంది. www.iocl.com

● ఎన్ఎస్‌డీసీ

కాలవ్యవధి: 6 నెలల నుంచి 36 నెలలు

నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. లాభాపేక్ష లేని సంస్థ. తక్కువ మొత్తంలో తరగతి గది బోధన, ఎక్కువ ప్రాక్టికల్ శిక్షణ దీనిలో భాగం. మీడియా, రిటైల్, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, మాన్యుఫాక్చరింగ్, బ్యూటీ, బ్యాంకింగ్ ఇంకా ఎన్నో అంశాల్లో అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పిస్తోంది.

ఎవరు అర్హులు: పద్నాలుగు, ఆపై వయసున్న వారెవరైనా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదో తరగతి కనీస విద్యార్హత. పరిశ్రమ నిపుణులు బోధిస్తారు. స్టైపెండ్ చెల్లిస్తారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయ్యాక ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందజేస్తారు. ఎంచుకున్న విభాగం, విద్యార్హతలను బట్టి ప్రోగ్రామ్ వ్యవధి ఆధారపడి ఉంటుంది. **నమోదు ఎలా:** ఆసక్తి ఉన్నవారు సంస్థ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. https://nsdcindia.org/

● ఫోక్స్‌వాగన్

కాలవ్యవధి: మెకానిక్ మెకట్రానిక్స్- మూడేళ్లు, వెల్డింగ్- రెండేళ్లు.

ఇది ముఖ్యంగా రెండు విభాగాలు- మెకానిక్ మెకట్రానిక్స్, వెల్డింగ్ విభాగాల్లో అప్రెంటిస్‌షిప్ అవకాశాన్ని అందిస్తోంది. రెండింటికీ పదోతరగతి పూర్తయిన వారు అర్హులు. మెకానిక్ మెకట్రానిక్స్‌కు పదో తరగతి మేథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో 70% మార్కులు సాధించి ఉండాలి. **ఎవరు అర్హులు:** పదో తరగతిలో 60% మార్కులుండాలి. ఆప్టిట్యూడ్ టెస్ట్/ స్కిల్ టెస్ట్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆటోమొబైల్ పరిశ్రమలో జర్మన్ టెక్నాలజీ ఆధారంగా వస్తున్న కొత్త మెషినరీల గురించి తెలుసుకుంటారు. స్టైపెండ్ ఇస్తారు. సాధారణంగా వీటి ఎంపికకు సంబంధించి ప్రకటనలు ఏడాదికి ఒకటి నుంచి రెండుసార్లు విడుదలవుతుంటాయి. **నమోదు ఎలా:** తమ సీవీతోపాటు స్కూల్ సర్టిఫికెట్ కాపీలను ఈ-మెయిల్ చేయాల్సి ఉంటుంది. వీటిలో ఎంపిక చేసినవారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

https://www.volkswagen.co.in/en/about/apprentice-program.html

● విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్

కాలవ్యవధి: ఏడాది

గ్రాడ్యుయేట్, టెక్నీషియన్, టెక్నికల్, ట్రేడ్ అప్రెంటిస్‌షిప్‌లను అందిస్తోంది. **ఎవరు అర్హులు:** ఏరోనాటికల్/ ఏరోస్పేస్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మెటలర్జీ, ప్రొడక్షన్ విభాగాల్లో బీఈ/ బీటెక్, ఇంజినీరింగ్ డిప్లొమా 65% మార్కులతో ఉత్తీర్ణులైనవారు, డిగ్రీ (బీఎల్ఐఎస్‌సీ/ కేటరింగ్ టెక్నాలజీ/ హోటల్ మేనేజ్‌మెంట్) కనీసం 60% మార్కులతో ఉత్తీర్ణులైనవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఏటా వీటి ప్రకటనలు విడుదలవుతుంటాయి.
నమోదు ఎలా: ఆసక్తి ఉన్నవారు సంస్థ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. **వెబ్‌సైట్:** www.vssc.gov.in/

(మరికొన్ని సంస్థలు అందిస్తున్న అప్రెంటిస్‌షిప్ వివరాల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.)

● బాష్

కాలవ్యవధి: ఏడాది

ఈ సంస్థ 'గ్రాడ్యుయేట్ అప్రెంటిస్' ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. చేయడం ద్వారా నేర్చుకోవడం దీనిలో భాగం. వివిధ విభాగాల్లో పనిచేసే వీలు కల్పిస్తారు. రోజువారీ విధులు, ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశంతోపాటు నిపుణుల సలహాలు, వ్యక్తిగత మార్గదర్శకత్వమూ ఉంటుంది. దీంతోపాటు తరగతి గది శిక్షణ ఉంటుంది. **ఎవరు అర్హులు:** ఇంజినీరింగ్ - మెకానికల్ సంబంధిత బ్రాంచిలు (మెకానికల్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్, ఆటోమొబైల్, మెకట్రానిక్స్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ చదివినవారు అర్హులు. అభ్యర్థులు రెగ్యులర్ విధానంలోనే చదివి ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షలు రాసినవారూ అర్హులే. ప్రతి సెమిస్టర్/ ఏడాది మొదటి ప్రయత్నంలోనే పూర్తిచేసుండాలి. **నమోదు ఎలా:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తిగతంగానూ, కళాశాల ద్వారానూ దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్ష, టెక్నికల్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

https://www.bosch.inareerstudents-and-graduates/graduate-apprentice/

తాజా ప్రకటనలివీ!

సీఎస్ఐఆర్- నేషనల్ మెటలర్జికల్ లేబొరేటరీ

కాలవ్యవధి: ఏడాది

జంషెడ్‌పూర్‌లోని ఎన్ఎంఎల్.. ఎలక్ట్రికల్, మెకానిక్ రెఫ్రిజిరేషన్ అండ్ ఏర్ కండిషనింగ్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్, కార్పెంటర్ విభాగాల్లో అప్రెంటిస్‌షిప్‌లను అందిస్తోంది. పదోతరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులైన వారిని ఎంచుకుంటున్నారు. వయసు 14-25 ఏళ్ల మధ్య ఉండాలి. వాక్‌ఇన్/ ట్రేడ్/ స్కిల్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు. స్టైపెండ్ ఉంటుంది. ఆగస్టు 29, 2019న ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఇతర వివరాలకు చూడాల్సిన **వెబ్‌సైట్:** www.nmlindia.org

హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్

కాలవ్యవధి: ఏడాది, రెండేళ్లు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, వెల్డర్, టర్నర్, క్రేన్ ఆపరేటర్ మొదలైన విభాగాల్లో మొత్తం 126 అప్రెంటిస్‌షిప్‌లను అందిస్తున్నారు. 8 నుంచి 10, సంబంధిత విభాగాల్లో ఐటీఐ పూర్తిచేసినవారికి వీటిని అందించనున్నారు. వయసు జులై 1, 2019 నాటికి 14 నుంచి 40 లోపు ఉండాలి. మెరిట్ ఆధారిత ఎంపిక ఉంటుంది. అర్హులైనవారు http://hecltd.com/jobs-at-hec.php లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.750. దరఖాస్తు చేసుకోవడానికి **ఆఖరి తేదీ:** ఆగస్టు 26, 2019. విజయవంతంగా పూర్తిచేసినవారికి సర్టిఫికెట్ కూడా ఇస్తారు.

నోటీస్ బోర్డు

అప్రెంటిస్‌షిప్

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)... రాజస్థాన్‌లోని ఖేత్రి కాపర్ కాంప్లెక్స్‌లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 129 **ట్రేడులు:** ఫిట్టర్, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, సర్వేయర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ తదితరాలు. **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత. **వయసు:** 14-30 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 19 **వెబ్‌సైట్:** https://hindustancopper.com/

ప్రవేశాలు

స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ)... స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. **కోర్సులు:** డాక్యుమెంటరీ అండ్ ఎథ్నోగ్రఫిక్ ఫిల్మ్ మేకింగ్, స్క్రీన్ రైటింగ్, ఫోక్‌లోర్ అండ్ ఇంటాంజబుల్ కల్చరల్ హెరిటేజ్, ఓపెన్ యాక్సెస్ ఫర్ లైబ్రేరియన్స్, రిసెర్చ్ మెథడాలజీ. **కాలవ్యవధి:** 12 వారాలు **సీట్ల సంఖ్య:** ఒక్కో కోర్సులో 25. **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** సెప్టెంబరు 9 **వెబ్‌సైట్:** http://ignca.gov.in/

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎగ్జిమ్ బ్యాంకులో ఐటీ ప్రొఫెషనల్స్

ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంక్)... ఐటీ పర్సనల్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: డిప్యూటీ మేనేజర్ (ఐటీ)-04, మేనేజర్ (ఐటీ ఫినాకిల్ డెవలపర్)-03. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం. **వయసు:** డిప్యూటీ మేనేజర్-28 ఏళ్లు, మేనేజర్-32 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **పరీక్ష తేది:** అక్టోబరు 5 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 9 **వెబ్‌సైట్:** www.eximbankindia.in

ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్

భోపాల్‌లోని ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్.. ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: సీనియర్ మెడికల్ ఆఫీసర్-01, ట్రైనీ ఆఫీసర్ (లా, హెచ్ఆర్, ఫైనాన్స్)-08. **అర్హత:** ఎంబీబీఎస్, ఎల్ఎల్‌బీ, సీఏ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఆగస్టు 23 నుంచి సెప్టెంబరు 11 వరకు. **వెబ్‌సైట్:** www.nhdcindia.com

దరఖాస్తు చేశారా?

● **నేషనల్ హైవేస్ అథారిటీలో యంగ్ ప్రొఫెషనల్స్**
అర్హత: లా డిగ్రీ, క్లాట్-2018 (పీజీ) స్కోరు; చివరితేది: ఆగస్టు 23

● **నవోదయ విద్యాలయాల్లో 2370 పోస్టులు**
పోస్టులు: టీజీటీ, పీజీటీ, పీఈటీ, ఎల్‌డీసీ తదితరాలు; చివరితేది: ఆగస్టు 25

● **ఏపీ స్టేట్ బేవరేజస్‌లో సేల్స్ పోస్టులు**
అర్హత: ఇంటర్, బీకాం, ఏదైనా డిగ్రీ; చివరితేది: ఆగస్టు 25

● **ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో 203 ఇంజినీరింగ్ పోస్టులు**
అర్హత: ఇంజినీరింగ్ డిగ్రీ, అనుభవం; చివరితేది: ఆగస్టు 26

Back up అంటే సమర్థింపేనా?

రాతల్లో, సంభాషణల్లో Phrasal verbs ను సందర్భోచితంగా ఉపయోగిస్తే మనసులోని విషయాలను ఎదుటివారికి ప్రభావవంతంగా చెప్పవచ్చు. ఇప్పుడు Back up అనే Phrasal verbను ఎలా ఉపయోగించాలో ఉదాహరణల సాయంతో చూద్దాం.

Jayasankar: We met yesterday, and we are meeting again today. Any news from Srinivas? (మనం నిన్న కలుసుకున్నాం. మళ్ళీ ఈ రోజు కలుసుకుంటున్నాము. శ్రీనివాస్ దగ్గరనుంచి ఏమైనా వార్తలు తెలిశాయా?)

Sreedhar: No news at all. He is often very silent and does not talk to us. He is that way very quiet. He doesn't talk much to his friends, and he always talks very little. (ఏం వార్తలూ లేవు. అతను ఎప్పుడూ మౌనంగా ఉంటాడు, మనతో ఎక్కువగా మాట్లాడడు. తన స్నేహితులతో ఎక్కువగా మాట్లాడడు, చాలా తక్కువగా మాట్లాడతాడు)

ఎం. సురేశన్

Jayasankar: You know, Badri in his math test cheated the teacher and the teacher did not notice that at all. (నీకు తెలుసా, బద్రి తన లెక్కల పరీక్షలో టీచర్‌ని మోసం చేసి, మార్కులు కొట్టేశాడు. ఆ టీచర్ అతని మోసాన్ని కనిపెట్టలేకపోయాడు)

Sreedhar: That is true. You know,

PHRASAL VERBS

I am not going to do my job any more. My wife backed me up over my decision to quit the job. (అది నిజమే. అన్నట్టు- నీకు తెలుసా, నేను నా ఉద్యోగాన్ని మానేస్తున్నాను. నా భార్య నేను ఉద్యోగం వదలాలనే నిర్ణయాన్ని బలపరిచింది)

Jayasankar: Why did she do so? It is a very good job and you are getting a fat salary. Why do you want to quit the job? (ఆమె ఎందుకలా చేసింది? అది నీకు చాలా మంచి ఉద్యోగం, నీకు చాలా మంచి జీతం వస్తుంది. ఎందుకు నువ్వా ఉద్యోగాన్ని వదిలివేయాలనుకుంటున్నావు?)

Sreedhar: She does not like the job, because I often come late to home, and she wants me to find another job. She is not at all happy about my job and wants me quit the job. (ఆమెకు ఈ ఉద్యోగం అసలు ఇష్టం లేదు, ఇంటికి తరచూ ఆలస్యంగా వస్తున్నానని. నన్ను ఇంకో ఉద్యోగం వెదుక్కోమంటోంది. నన్నీ ఉద్యోగం మానేయమంటోంది)

Jayasankar: You are getting a fat salary, man. Why do you want to quit the job? (అయ్యో, నీకు మంచి జీతం వస్తోంది. ఎందుకు నువ్వీ ఉద్యోగం మానేయాలనుకుంటున్నావు?)

Sreedhar: Any way, my wife wants me to quit the job and find another job which will close by 5 in the evening and I can return home. (ఏదయినా సరే, మా ఆవిడ నన్నీ ఉద్యోగం మానేయమంటోంది. ఇంకో ఉద్యోగం వెదుక్కోమంటుంది, అయిదింటికల్లా ఇంటికి తిరిగి వచ్చేసేటట్టు.)

Jayasankar: If that is what you think, it is very easy for you to quit the job. (అదే నువ్వు అనుకుంటూంటే, నువ్వా ఉద్యోగం సులభంగా మానేయవచ్చు)

Look at the following words from the conversation

1) Cheat = Deceive (మోసం చేయటం)

Venkat: You know, our friend Vinod has found the math teacher very good and he deceived him in the math test. (నీకు తెలుసా, మన స్నేహితుడు వినోద్, లెక్కల టీచర్ చాలా మంచివాడని గ్రహించి, లెక్కల పరీక్షలో ఆయనను మోసం చేశాడు)

Lakshmikanth: He is very good at such things. He cheated the math teacher and got very good marks in the exam. (అతనలాంటి విషయాల్లో చాలా గొప్ప. లెక్కల టీచర్‌ని మోసం చేసి పరీక్షలో చాలా మంచిమార్కులు సంపాదించుకున్నాడు)

2) Back up = Support (సమర్థించటం)

Jayaram: My wife is no longer satisfied with my job. She wants me to quit the job and find another job. (నా భార్య నా ఉద్యోగ విషయంలో తృప్తి పడటం లేదు. ఆమె నన్ను ఈ ఉద్యోగం వదిలేయమనీ, ఇంకో ఉద్యోగం చూసుకోమనీ చెప్తోంది)

Sundar: I do not understand why she wants you to quit the job. You are getting a fat salary, and that will help your sons to continue their education. Your wife wants to back you up to quit the job (నాకర్థం కావటం లేదు, నిన్నెందుకు ఆ ఉద్యోగం వదిలేయమంటుందో, నువ్వు గొప్ప జీతం పొందుతున్నావు, నీ పిల్లల చదువులు కొనసాగటానికి అది సహాయపడుతుంది. నీ భార్య ఉద్యోగం వదిలెయ్యటాన్నే సమర్థిస్తోంది).

భూమికి చేరువలో భారీ గ్రహం

పాలపుంతలోనే గుర్తించిన ఖగోళ శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: భూమికి చేరువలో ఓ భారీ గ్రహాన్ని ఖగోళ శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. భూగోళంతో పోలిస్తే దాని పరిమాణం మూడు వేల రెట్లు ఎక్కువ. పాలపుంతలోనే 'బీటా పిక్టోరిస్' అనే నవజాత నక్షత్రం చుట్టూ అది పరిభ్రమిస్తోంది. 'బీ పిక్టోరిస్ సీ'గా నూతన గ్రహానికి నామకరణం చేశారు. భూమికి 63 కాంతి సంవత్సరాల దూరంలో 'బీటా పిక్టోరిస్' ఉంది. దాని వయసు కేవలం 2.3 కోట్ల ఏళ్లు. సూర్యుడి వయసు(450 కోట్ల ఏళ్లకుపైనే)తో పోలిస్తే ఈ నక్షత్రం చాలా చిన్నది. పరిమాణంలో మాత్రం అది సూర్యుడికి రెట్టింపు ఉంటుంది. 'బీటా పిక్టోరిస్' చుట్టూ పరిభ్రమిస్తున్న 'బీ పిక్టోరిస్ బీ' గ్రహాన్ని 2009లోనే శాస్త్రవేత్తలు గుర్తించారు. తాజాగా 'బీ పిక్టోరిస్ సీ'ని కనుగొన్నారు. నక్షత్రం చుట్టూ దాదాపు 1,200 రోజులకు ఒకసారి ఈ భారీ గ్రహం పరిభ్రమణాన్ని పూర్తిచేస్తోంది. సూర్యుడు-భూమి మధ్య దూరంతో పోలిస్తే.. బీటా పిక్టోరిస్, బీ పిక్టోరిస్ సీ మధ్య దూరం 2.7 రెట్లు అధికమని ఫ్రాన్స్‌కు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ రీసెర్చ్' శాస్త్రవేత్త మేరీ లగ్రాంజే తెలిపారు. బీ పిక్టోరిస్ బీ, బీ పిక్టోరిస్ సీ గ్రహవ్యవస్థలు రెండూ ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదని వెల్లడించారు.

పెద్దపులి ఇక కథలకే పరిమితం

- వేటగాళ్ల వేటుకు పులిజాతి బలి
- వందేళ్ల కిందట లక్ష పులులు
- 2010 గణాంకాల ప్రకారం మిగిలినవి 3,900

జెనీవా: 'నాయనా పులివచ్చె' కథలిక విన్పించకపోవచ్చు. ఎందుకంటే అసలు పెద్దపులి జాతే కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. అదెలాగంటారా? వందేళ్లకు పూర్వం భూమ్మీద లక్ష పెద్దపులులు ఆకుపచ్చలోకాలలో లక్షణంగా జీవించాయట. కానీ ఇప్పుడు వ్యాఘ్రాల సంఖ్య కొన్ని వేలల్లోనే ఉంది. ఆగ్నేయాసియాలో వీటి ఉనికే ప్రశ్నార్థకమైంది.

పులిచర్మాలకు, గోళ్లకు, ఎముకలకు ఉన్న అంతర్జాతీయ గిరాకీ కారణంగా వేటగాళ్లు విజృంభించారు. కొత్త శతాబ్దారంభం నుంచి నేటిదాకా కేవలం 19 ఏళ్లలో 2,300 పులులు వధకు గురయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అంచనా వేయవచ్చు.

ఏటా సగటున అక్రమరవాణాదార్ల నుంచి అధికారులు 120 పులులను స్వాధీనపర్చుకుంటున్నారు. 2000 సంవత్సరం నుంచి వారానికి 2 పులులను పట్టుకుంటున్నారు. 1900 సంవత్సరంలో భూమిమీద లక్ష పులులు సంచరించాయని అంచనా వేశారు. ఆగ్నేయాసియాలో అక్రమ రవాణాదార్లు ప్రైవేటుగా పులిసంతతి వృద్ధికేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు. 2000 సంవత్సరం నుంచి 2018 వరకు స్వాధీనం చేసుకున్న పులులలో 2,359 పులులు కొందరు ఇలా పెంచుకుంటున్నవే. వాటి శరీర భాగాలకు ఉన్న గిరాకీ కారణంగానే వ్యాఘ్రాల వధ సాగుతోంది. జెనీవాలో జరుగుతున్న వన్య ప్రాణి సంరక్షణ సదస్సు సందర్భంగా ఆగ్నేయాసియా పెద్దపులుల సంరక్షణ వ్యవహారాల అధిపతి కణితా కృష్ణమూర్తి ఆసక్తిదాయక అంశాలతో ఒక నివేదిక విడుదల చేశారు. గత 19 ఏళ్ల గణాంక సమాచారాన్ని విశ్లేషించారు.

- 1900లో భూమిపై ఉన్న పులులు లక్ష.
- 2010 గణాంకాల ప్రకారం మిగిలినవి 3,900.

ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న జగిత్యాల కలెక్టర్

అవార్డు ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి రాంవిలాస్ పాసవాన్

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ బుధవారం రాత్రి దిల్లీ 'ఎక్సలెన్సీ ఇన్ గవర్నెన్స్' అవార్డు అందుకున్నారు. అత్యుత్తమ సేవలకుగాను దేశంలోని 700 మంది కలెక్టర్లపై అధ్యయనం చేసిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు కలెక్టర్ శరత్‌ను అవార్డుకు ఎంపిక చేసింది. కొత్త దిల్లీ బబెరాయ్ బాల్‌రూంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, రాంవిలాస్ పాసవాన్, రవిశంకర్ ప్రసాద్, డాక్టర్ జితేంద్రసింగ్ పాల్గొనగా అవార్డు కింద ప్రశంసాపత్రంతోపాటు రూ.1లక్ష నగదు అందించారు.

భాజపాకు అదనపు బలం

లక్ష్యాన్ని మించిన సభ్యత్వ నమోదు

దిల్లీ: కమల దళంలో 3.78 కోట్ల మంది కొత్తగా చేరారు. భాజపా జులై 6 నుంచి నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం ముగిసింది. కొత్తగా 3,78,67,753 మందికి సభ్యత్వం కల్పించారు. 11 కోట్ల మందికి సభ్యత్వం ఉన్నట్లు పార్టీ చెబుతుండగా, దీనికి 20 శాతం (2.2 కోట్లు) అదనంగా చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అనుకున్న లక్ష్యానికి మించి 1.6 కోట్ల మందిని అదనంగా భాజపా చత్రఛాయలోకి తీసుకొచ్చారు.

'అక్షయపాత్ర'కు 'విస్టా' విరాళం

దిల్లీ: భారత్‌లో బడిపిల్లలకు మధ్యాహ్న భోజనం అందచేస్తున్న 'అక్షయపాత్ర ఫౌండేషన్'కు అమెరికాకు చెందిన 'విస్టా ఈక్విటీ పార్ట్‌నర్స్' సంస్థ పదిలక్షల అమెరికన్ డాలర్లు(సుమారు రూ.7.14 కోట్లు) విరాళాన్ని ప్రకటించింది. భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విస్టా, సంబంధిత భాగస్వామ్య సంస్థల తరపున 'అక్షయపాత్ర ఫౌండేషన్'కు ఈ మొత్తాన్ని అందించనున్నారు.

రఫేల్ రాకకు రంగం సిద్ధం

- వచ్చే నెలలో భారత్ అమ్ములపొదిలో చేరనున్న యుద్ధ విమానాలు
- ఫ్రాన్స్‌కు వెళ్లనున్న రాజ్‌నాథ్, ధనోవా

ఈనాడు, దిల్లీ: రఫేల్ యుద్ధవిమానాల రాకకు రంగం సిద్ధమైంది. వచ్చే నెలలోనే భారత్ అమ్ముల పొదిలో చేరనున్నాయి. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఎయిర్‌చీఫ్ మార్షల్ బీఎస్ ధనోవా వచ్చే నెలలో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌కు వెళ్లి తొలి విమానాన్ని స్వీకరించనున్నారు. ఒకటి నుంచి నాలుగుదాకా యుద్ధ విమానాలను అప్పగించనున్నట్లు రక్షణశాఖ వర్గాల సమాచారం. సెప్టెంబర్ 20న నిర్వహించే కార్యక్రమంలో ఉన్నత స్థాయి సైనికాధికారులతోపాటు, రఫేల్ తయారీ సంస్థ డసౌ ఏవియేషన్ సీనియర్ ఉన్నతాధికారులు కూడా హాజరవనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై ఫ్రాన్స్ అధికారులతో చర్చించేందుకు భారత వైమానిక దళానికి ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే పారిస్ చేరుకుంది. అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు, పైలట్లకు శిక్షణ పూర్తిచేసి రఫేల్ యుద్ధవిమానాలకు స్వాగతం పలికేందుకు ఐఏఎఫ్ సంసిద్ధంగా ఉంది. హరియాణాలోని అంబాలా, పశ్చిమబెంగాల్‌లోని హసిమరలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లలో వీటిని మోహరించనున్నట్లు తెలుస్తోంది. వీటిని భారత్‌కు అవసరమైన నిర్దిష్టమైన మార్పులతో రూపొందినట్లు సమాచారం. రూ.58 వేల కోట్ల వ్యయంతో 36 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు 2016 సెప్టెంబర్‌లో ఫ్రాన్స్‌తో భారత్ ఒప్పందం కుదుర్చుకొన్న సంగతి తెలిసిందే. అణు సామర్థ్యం ఉన్న ఈ విమానాలు గగనతలం నుంచి గగనతలంపైకి, గగనతలం నుంచి భూతలంపైకి దాడులు చేయగలవు.

గగనవీధుల్లో అభినందన్

మిగ్‌21ను నడిపిన వింగ్‌కమాండర్

దిల్లీ: భారత్, పాక్‌ల మధ్య వైమానిక పోరాటంలో సంచలనానికి కేంద్రబిందువైన భారత వైమానిక దళం(ఐఏఎఫ్) పైలట్ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ తిరిగి మిగ్ 21 యుద్ధవిమానాన్ని నడిపారు. ఫిబ్రవరి 27న జరిగిన భారత్, పాక్ గగనతల పోరులో పాక్‌కు చెందిన ఎఫ్-16 జెట్‌ను నేలకూల్చి, తన యుద్ధవిమానం దాడికి గురవడంతో కిందికి దూకి, పాక్ చేతికి చిక్కి విడుదలైన అభినందన్ సుమారు ఆరు నెలల తర్వాత కాక్‌పిట్ ఎక్కారు. రాజస్థాన్‌లోని ఐఏఎఫ్ బేస్‌లో పని చేస్తున్న ఆయన విమానం నడపడం ప్రారంభించినట్లు సైనిక ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అభినందన్‌కు వీర్‌చక్ర అవార్డు సైతం ప్రకటించారు. బెంగళూరులోని ఐఏఎఫ్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ అభినందన్ యుద్ధవిమానం నడిపేందుకు మూడు వారాల క్రితమే పచ్చజెండా ఊపింది.

ఎన్డీటీవీ ప్రమోటర్లపై సీబీఐ కేసు

దిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలపై ఎన్డీటీవీ ప్రమోటర్లు ప్రణయ్‌రాయ్, రాధికారాయ్ తదితరులపై సీబీఐ కేసు నమోదు చేసింది. 2007-09 మధ్య సదరు ఉల్లంఘన జరిగినట్లు పేర్కొంది. కంపెనీ సీఈవో విక్రమాదిత్య చంద్ర, మరో ప్రభుత్వ అధికారిపైనా బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రణయ్,రాధికారాయ్‌లు, కేవీఎల్ నారాయణరావు, విక్రమాదిత్య చంద్ర ప్రభుత్వాధికారులతో కుమ్మక్కై నేరపూరితంగా ఎఫ్‌డీఐ మార్గంలో అవినీతి సొమ్మును తీసుకొచ్చేందుకు కుట్రపన్నారని సీబీఐ ఆరోపించింది. ఈ ఆరోపణల్ని ఎన్డీటీవీ ఖండించింది.

చంద్రయాన్-2లో సజావుగా రెండో ప్రక్రియ

ఈనాడు డిజిటల్, బెంగళూరు: విజయవంతంగా చంద్రుడి కక్ష్యలో ప్రవేశించిన చంద్రయాన్-2.. మరో దశను దాటింది. చంద్రుడి చుట్టూ 114 x 18,072 కి.మీ. కక్ష్యలో మంగళవారం అడుగుపెట్టిన చంద్రయాన్-2 బుధవారం మధ్యాహ్నం 12:50 గంటల సమయంలో రెండోసారి కక్ష్యను 118 x 4,412 కి.మీ.కు తగ్గించుకుంది. ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోయే ప్రక్రియ సెప్టెంబరు 2న ప్రారంభమవుతుందనేది తెలిసిందే. పుట్టినింటి నుంచి మెట్టినింటికి వెళ్లే నవ వధువుగా ఈ దశను ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కె.శివన్ అభివర్ణించారు. ఆ తర్వాత ప్రక్రియలన్నీ ఇస్రో యంత్రాంగం పరిధి నుంచి దాటిపోతాయన్నారు. ఆపై ఆర్బిటర్‌లో తాము పొందుపరిచిన వ్యవస్థలే స్వతంత్రంగా పని చేయటం ప్రారంభిస్తాయని వివరించారు. 'ల్యాండర్ చంద్రునికి అతి సమీపంగా వెళుతూ సెన్సర్ల ద్వారా ల్యాండింగ్ ప్రాంతాన్ని గుర్తిస్తుంది. ఎత్తు, లోతు, గట్టి రాళ్లు, ఇలా ప్రతి అంశాన్ని పరిశీలిస్తుంది. చంద్రునిపై అడుగుపెట్టిన తర్వాతే ల్యాండర్, రోవర్‌లను ఆన్ చేయాలన్నది ఇస్రో ప్రణాళిక అని వివరించారు. ల్యాండర్ చంద్రుడిపై దిగే దశలో చేసిన ప్రయత్నాలన్నీ 37 శాతమే విజయవంతమైనట్లు డాక్టర్ శివన్ చెబుతుండటంతో చంద్రయాన్-2పై మరింత ఉత్కంఠ నెలకొంది.

ఇక స్వచ్ఛ ఎవరెస్ట్

వాడి పారేసే ప్లాస్టిక్‌ను నిషేధించిన నేపాల్



ఈ శిఖరాన్ని అధిరోహించడానికి ఇక ఒక్కో బృందం చెల్లించాల్సిన (ప్రతిపాదిత) రుసుము సుమారు రూ. 25,00,000	ఏటా దీన్ని అధిరోహించేవారు, సందర్శించేవారు 50,000 మంది
ఈ ఏడాది సీజన్‌లో ఎవరెస్ట్‌ను అధిరోహించిన వారి సంఖ్య 885	వీరిలో చనిపోయినవారు 11 మంది

2019 జనవరి నుంచి సేకరించిన వ్యర్థాలు: 10 టన్నులు

ఎవరెస్ట్! ఈ పర్వతారోహణ కొందరికి సాహసం. మరికొందరికి జీవితాశయం. అయితే ఏటా వేల మంది పర్యాటకులు, సందర్శకులు పారేసే ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, కవర్లు, ఇతరత్రా వస్తువులతో ఈ ప్రాంతం ప్లాస్టిక్ దిబ్బగా మారుతోంది. దీంతో నేపాల్ సర్కారు 'స్వచ్ఛ' నిర్ణయం తీసుకుంది. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను ఎవరెస్ట్ ప్రాంతంలో నిషేధించింది. వచ్చే జనవరి నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది.

అదే బాటలో భారతీయ రైల్వే...

ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను నిషేధించాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. గాంధీ జయంతి రోజైన అక్టోబరు 2 నుంచి దీన్ని అమలులోకి తీసుకురానుంది.

బ్రిటన్‌లో 'న్యూడ్ జోన్'

బ్రిటన్‌లోనూ విప్లవాత్మక మార్పు లొచ్చాయి. కాయగూరలు, పండ్లు, దినుసులు వంటి వాటికి ప్లాస్టిక్ తొడుగులు లేకుండా నేరుగా విక్రయిస్తున్నారు. 'న్యూడ్ జోన్', 'ఫుడ్ ఇన్ ద న్యూడ్' అంటూ కొన్ని సంస్థలు ప్రత్యేకంగా బోర్డులుపెట్టి వీటిని విక్రయిస్తున్నాయి.

వాణిజ్య రంగంలో భారత్-ఎస్టోనియా సహకారం

టాలిన్: వాణిజ్య రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, ఎస్టోనియా తీర్మానించుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఈ-గవర్నెన్స్, సైబర్ భద్రత రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఎస్టోనియా అధ్యక్షురాలు కెర్‌స్టి కాల్‌జులైడ్‌తో టాలిన్‌లో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు బుధవారం భేటీ అయిన అనంతరం ఇరు దేశాలు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

42 లక్షల మంది గురువులకు శిక్షణ

'నిష్ఠా'ను ప్రారంభించిన కేంద్రం

ఎవరికి? ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు

విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసేందుకు దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నిర్ణయించింది. 'నిష్ఠా' (నేషనల్ ఇనిషియేటివ్ ఫర్ స్కూల్ హెడ్స్, టీచర్స్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్స్) పేరిట ప్రత్యేక పథకాన్ని బుధవారం ప్రారంభించింది. ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై అవగాహన అవసరమని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రమేశ్ పొఖ్రియాల్ తెలిపారు.

ఎంతమందికి?

42,00,000

లక్ష్యం

విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన పెంపు. వారిని సంపూర్ణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడం.

శిక్షణాంశాలు

- చక్కగా చదువుకోవడం, ఆరోగ్యంగా ఉండడంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం.
- గ్రంథాలయ, పర్యావరణ, యువజన క్లబ్బుల నిర్వహణ.. పెరటి తోటల పెంపకం.
- నాయకత్వ లక్షణాలను అలవర్చడం.
- కృత్రిమ మేధ, వృత్త్యంతర శిక్షణ, పర్యావరణంపై అవగాహన పెంపు.
- పోక్సో చట్టం, దివ్యాంగుల హక్కులతోపాటు, లైంగిక వేధింపులకు గురి కాకుండా పిల్లలకు అవగాహన కల్పించడం.

దశల వారీగా..

తొలిదశలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసిన 33,120 మంది కీ రిసోర్స్ పర్సన్లకు, స్టేట్ రిసోర్స్ పర్సన్లకు 120 ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారు. అనంతరం వారంతా తమ ప్రాంతంలోని ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు, ఆ టీచర్లు పాఠశాలల్లోని పిల్లలకు శిక్షణ ఇస్తారు.

గుండు కొట్టి తిప్పించారు

వైద్యకళాశాలలో ర్యాగింగ్

ఇటావా(యూపీ): ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇటావాలోని సైఫై వైద్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో కొత్త విద్యార్థులను అవమానించారు. వారికి గుండు గీయించారు. తర్వాత తెల్లటి కోట్లు ధరించిన ఆ విద్యార్థులంతా వరుస కట్టి వంగి వంగి సలాములు చేసుకుంటూ ప్రాంగణంలోకి వచ్చేలా చూశారు. తొలిసంవత్సరం వైద్యవిద్యార్థులు ఇలా నడిచి వెళుతున్న దృశ్యం బుధవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.

సహాయక చర్యల్లో పాల్గొంటున్న హెలికాప్టర్ కూలి ముగ్గురి మృతి

మరణించిన వారిలో పైలట్, కోపైలట్

దేహ్రాదూన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీలో మోరీ ప్రాంతంలో సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఒక హెలికాప్టర్ బుధవారం కుప్పకూలింది. దీంతో హెలికాప్టర్ పైలట్, కోపైలట్ సహా అందులో ప్రయాణిస్తున్న మరో స్థానికుడు అక్కడికక్కడే మృతి చెందారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతంలో తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక ఇళ్లు నేల కూలి ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారికి అవసరమైన సామగ్రిని అందజేసి వస్తుండగా అనూహ్యంగా హెలికాప్టర్ తీగల్లో చిక్కుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది.

'శాంతిదూత' హోదాను రద్దు చేయాలి

ప్రియాంకా చోప్రాపై ఐరాసకు పాక్ లేఖ

ఇస్లామాబాద్: ప్రముఖ భారత నటి ప్రియాంకా చోప్రాను 'శాంతిదూత (పీస్ అంబాసిడర్) హోదా' నుంచి తొలగించాలని ఐక్యరాజ్యసమితి(ఐరాస)ని పాకిస్థాన్ కోరింది. కశ్మీర్‌కు సంబంధించి భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వంతపాడటంతో పాటు... భారత్-పాకిస్థాన్‌ల నడుమ అణు యుద్ధం జరగాలని ఆమె ఆకాంక్షిస్తున్నారని ఆరోపించింది. అణ్వాయుధాలను ముందుగా ప్రయోగించకూడదని భారత్ నియమం పెట్టుకున్నా... పరిస్థితులను బట్టి ఈ నిర్ణయం మారవచ్చంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను చోప్రా స్వాగతించారని ప్రస్తావించింది. శాంతి దూత పాటించాల్సిన కనీస నియమాలకు విరుద్ధంగా ఆమె వ్యవహరిస్తున్నందున... ఆ పదవి నుంచి ఆమెను తొలగించాలని అభ్యర్థించింది. ఈ మేరకు యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెన్రిటా హెచ్ ఫోర్‌కు పాకిస్థాన్ మానవ హక్కుల మంత్రి షిరీన్ మజారి ఇటీవల లేఖ రాశారు.

బారాముల్లాలో లష్కరే ఉగ్రవాది హతం

శ్రీనగర్, జమ్మూ: జమ్మూ-కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించిన అనంతరం ఆ రాష్ట్రంలో తొలి ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. బారాముల్లా జిల్లాలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో లష్కరే తయిబా ఉగ్రవాది, బారాముల్లాకు చెందిన మొమిన్ గోరీ హతమయ్యాడు. ఎస్పీవో బిలాల్ అహ్మద్ వీర మరణం పొందగా, సబ్‌ఇన్‌స్పెక్టర్ అమర్‌దీప్ పరిహార్ తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం మొదలైన కాల్పులు బుధవారం వరకు కొనసాగాయి.

దిల్లీలో హింసాత్మకంగా మారిన నిరసన ప్రదర్శన

రవిదాస్ ఆలయ కూల్చివేతకు వ్యతిరేకంగా తరలివచ్చిన వేలమంది దళితులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని రవిదాస్ ఆలయ కూల్చివేతను నిరసిస్తూ వేల మంది దళితులు బుధవారం నిర్వహించిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో పోలీసులు లాఠీఛార్జి జరిపారు. ఇందులో అనేకమంది గాయపడ్డారు. భీమ్ ఆర్మీ అధిపతి చంద్రశేఖర్ ఆజాద్ సహా 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో భారీగా బలగాలు మోహరించాయి. ఆందోళనకారులు గాయపడ్డారన్న వార్తలను పోలీసులు ఖండించారు. ఆందోళనకారులు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి దిల్లీ చేరుకున్నారు. భీమ్ ఆర్మీ కార్యకర్తలు నీలి రంగు జెండాలు, టోపీలతో ఝుండేవలన్‌లోని అంబేద్కర్ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు యాత్రగా వెళ్లారు. 'జై భీమ్' నినాదాలు హోరెత్తించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు దిల్లీ అభివృద్ధి ప్రాధికార సంస్థ (డీడీఏ) ఈ నెల 10న రవిదాస్ ఆలయాన్ని కూల్చివేసింది.

భీమ్ ఆర్మీ కార్యకర్తలపై లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

పిచ్చుకలకు 'ఇళ్లు' కట్టాడు!

తమిళనాడు: ప్రకృతి ప్రేమికుడైన ఆ యువకుడు పిచ్చుకల సంరక్షణకు నడుం బిగించాడు. వాటి మనుగడ ప్రశ్నార్థకం కాకూడదన్న తలంపుతో వినూత్నంగా ఆలోచించాడు. చెక్కతో గూళ్ల మాదిరి చిన్న ఇళ్లను నిర్మించి ఉచితంగా పంచుతున్నాడు. ఇలా నాగపట్టణ వాసి శరవణన్ ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. పిచ్చుక 'ఇళ్ల'ను ఉచితంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు కూడా పంపిణీ చేస్తున్నాడు. చూడచక్కగా కనిపిస్తున్న ఆ గూళ్లను తీసుకెళ్లి చాలామంది పిచ్చుకలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. 'విళుతు ఐయ్యక్కమ్' అనే సామాజిక సంస్థను నిర్వహిస్తున్న అతని సంకల్పం ఇప్పుడు ప్రశంసలు అందుకుంటోంది.

సంస్కృత గ్రామాన.. ఆవేదన

అసోం: అది కరీంగంజ్ జిల్లా పటియాలా.. ఆ చిన్నపల్లెకో ప్రత్యేకత ఉంది. గ్రామస్థులంతా సంస్కృతాన్ని ప్రేమిస్తారు.. అదే భాషలో మాట్లాడుకుంటారు. ఇక్కడ మన ప్రాచీన భాషకు ఇంత ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ప్రజలకు అసంతృప్తే మిగులుతోంది. దేశంలో సంస్కృత గ్రామాలు 7 మాత్రమే ఉండగా.. పటియాలను ఆ జాబితాలో చేర్చలేదన్నదే వారి ఆవేదన. అంతేకాదు ఆ ఊరికి ఎలాంటి సదుపాయాలు కూడా లేవు. కనీస అభివృద్ధికే దూరమే. ఈ వేదనలు తీరకున్నా.. గ్రామస్థులు మాత్రం సంస్కృత భాషను విస్తృతం చేసేందుకూ ఎనలేని కృషి చేస్తున్నారు. సంస్కృత్ సంరక్షణ్, ప్రచార్ ప్రసార్ సమితి.. అంటూ రెండు కమిటీలు ఏర్పాటు చేసి అందరికీ నేర్పిస్తున్నారు. గ్రామంలో సంస్కృత విద్యాపీఠాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అమ్మ చేసిన సాహసం!

దిల్లీ: యమునా నది ఉప్పొంగింది.. చుట్టూ జల ప్రళయం.. చీకటి.. ఎంతకీ తగ్గని వరద ఉధృతి.. ఆ తల్లి సాహసమే చేసింది. నదికి సమీపంలోని ఉస్మాన్‌పుర్ ప్రాంతం వరదలకు జలమయం అయింది. అక్కడే ఓ గుడిసెలో నివాసం ఉంటున్న నూర్జహాన్ గర్భిణి.. మంగళవారం రాత్రి వరద బీభత్సానికి ఆ ఇల్లు నేలమట్టం అయింది. సమయానికి భర్త కూడా ఇంట్లో లేడు. ఇద్దరు పిల్లలనే కాకుండా కడుపులో మోస్తున్న బిడ్డనూ కాపాడుకోవాలన్న ఆత్రంతో ఓ చెక్క పట్టుకుని మెల్లగా ఓ చెట్టెక్కేసింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపింది. కాసేపటికి వచ్చిన ఆమె భర్త కూడా భయంతో వారి వద్దకు చేరాడు. ఇలా రాత్రంతా చెట్టుపైనే ఆ కుటుంబం గడిపింది. ఉదయం 11 గంటల సమయంలో పోలీసులకు విషయం తెలియడంతో వైద్యులతో సహా వచ్చి వారిని కాపాడారు.

సమయోచితం.. బాపూజీ సిద్ధాంతాలు

ముంబయి: బాపూజీ గనక నేడు జీవించి ఉంటే.. సమాజంలో ప్రబలంగా ఉన్న విద్వేషం, అసహన పోకడలపై ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా స్పందించి ఉండేవారు. నేటి పరిస్థితుల్లో గాంధీ సిద్ధాంతాలు అత్యంత సమయోచితం.. సముచితం.. స్ఫూర్తిదాయకం.. - మహాత్ముని మునిమనుమడు తుషార్ గాంధీ అన్న మాటలివి. 'ఈటీవీ భారత్' ప్రత్యేక ముఖాముఖిలో ఆయన తన భావాలను పంచుకున్నారు.

అజరామరం..

"బాపూజీ సిద్ధాంతాలు అజరామరం. అత్యంత సహజసిద్ధం. ప్రపంచవ్యాప్తంగా వీటికి అభిమానం, ఆదరణ, ఆమోదం పెరుగుతున్నాయి. ఆయన ఆదర్శాలే పట్టుగొమ్మలు. నాగరకతకు, సమాజ ఆవిర్భావానికి పటిష్ఠమైన పునాదిరాళ్లు. నేటి సమాజంలో హత్యలు, అరాచకాలు పెరుగుతున్నాయి. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారు వాటిని తమ దైనందిన జీవితంలో భాగంగా పరిగణిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఉలుకూపలుకూ లేకుండా ప్రేక్షక పాత్ర వహిస్తే.. మౌనంగా అరాచకాలను ఆమోదిస్తున్నట్లే.."

సామాజిక వైద్యులు..

"భారత జాతిపిత వైద్యుడి వంటివారు. సమాజంలో సమస్యలకు తక్షణ ఉపశమనం, పైపూత కోసం ఆయన పాకులాడలేదు. మూలాల్ని అన్వేషించి, శాశ్వత నివారణకు యత్నించారు. నేటి 'స్వచ్ఛ భారత్' గాంధీజీ సిద్ధాంతాల పాక్షిక అనుసరణ. పరిశుభ్రత అనేది అత్యంత కీలకం. అంతకంటే ముందు ఆత్మప్రక్షాళన మరింత అవసరం. సౌభ్రాతృత్వ భావన ప్రతిఒక్కరి పరమావధి కావాలి."

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ
▼ 268	▼ 98
37060	10919

డోజోన్స్	నాస్‌డాక్
▲ 227	▲ 66
26189	8014

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి	ముడిచమురు
▲ 71.55 పైసలు 16	60.38 ▲
(ఒక అమెరికా డాలరుకు)	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	21న	మార్పు%	నిఫ్టీ	21న	మార్పు%
HERO MOTO	714.25	1.69	TATA MOTORS	112.40	-9.25
INFOSYS	799.45	0.85	YES BANK	65.40	-8.15
BAJAJ AUTO	2764.80	0.80	INDIABULLS	483.55	-7.26
EICHER MOTORS	16000.50	0.66	TATA STEEL	343.00	-4.26
MARUTI SUZUKI	6228.90	0.61	BPCL	327.80	-4.22
TECH MAHINDRA	672.80	0.58	GRASIM INDU	698.80	-4.18
HUL	1850.00	0.36	GAIL (INDIA)	122.50	-3.81

21న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)
(వంకు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	320	గోదావరి	330
చిల్లరగా (ఒక గుడ్డు)	3.80	వరంగల్	323
బెంగళూరు	355	విశాఖపట్నం	361
22వ తేదీకి...		చెన్నై	365
విజయవాడ	335	చిత్తూరు	358
		నమక్కల్	368

వెంటాడిన ఆర్థిక మందగమన భయాలు

268 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

మార్కెట్ సమీక్ష

ఆర్థిక మందగమనం సెగ సూచీలను కిందకు లాగుతోంది. వరుసగా రెండో రోజూ సూచీలు డీలా పడ్డాయి. అంతర్జాతీయంగానూ పరిస్థితులు అంతంత మాత్రమే ఉండటంతో దేశీయ మార్కెట్లపై మదుపర్లలో విశ్వాసం రోజురోజుకూ సన్నగిల్లుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్యాంకింగ్, వినియోగ వస్తువులు, ఆర్థిక షేర్లకు విక్రయాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సెన్సెక్స్ 268 పాయింట్లు, నిఫ్టీ 98 పాయింట్ల మేర నష్టపోయాయి. అంతర్జాతీయ సూచీల కొస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 16 పైసలు లాభపడి 71.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 37,298.73 పాయింట్ల వద్ద ప్రతికూలంగా ప్రారంభమైంది. ఆరంభ కొనుగోళ్ల మద్దతుతో సూచీ 37,406.55 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. అయితే తర్వాత వచ్చిన విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 37,022.52 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 267.64 పాయింట్ల నష్టంతో 37,060.37 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 98.30 పాయింట్లు కోల్పోయి 10,918.70 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,034.20-10,906.65 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో టాటా మోటార్స్ అత్యధికంగా 9.29 శాతం నష్టపోయింది. యెస్ బ్యాంక్ 8.21%, టాటా స్టీల్ 4.26%, ఓఎన్‌జీసీ 3.12%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.77%, ఎల్‌అండ్‌టీ 2.41%, ఎస్‌బీఐ 2.20%, ఐటీసీ 2.01% చొప్పున నష్టపోయాయి. హీరో మోటోకార్ప్ అత్యధికంగా 1.68 శాతం లాభపడింది. ఇన్ఫోసిస్ 0.84%, బజాజ్ ఆటో 0.77%, టెక్ మహీంద్రా 0.59%, హెచ్‌యూఎల్ 0.48% మేర లాభపడ్డాయి.

క్లాస్‌మేట్ 3డీ కవర్ నోట్ పుస్తకాలు

హైదరాబాద్ (సోమాజిగూడ), న్యూస్‌టుడే: క్లాస్‌మేట్ బ్రాండ్‌పై నోట్ పుస్తకాలను విక్రయించే ఐటీసీ సంస్థ, మరింత ఆకర్షణీయంగా 3డీ కవర్‌తో పల్స్ 3డీ నోట్‌బుక్స్‌లను విపణిలోకి విడుదల చేసినట్లు ఐటీసీ విద్య, స్టేషనరీ విభాగాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ శైలేంద్ర త్యాగి చెప్పారు. విస్తృత డిజైన్లతో ఈ కవర్‌లు లభిస్తాయని బుధవారం ఇక్కడ తెలిపారు. నోట్ బుక్ కవర్‌ను ఎన్నిసార్లు అయినా మార్చుకునే సౌలభ్యం లభిస్తుందన్నారు. కవర్‌ను కావాల్సిన విధంగా డిజైన్ చేసుకోవచ్చని, సెల్ఫీని కూడా అమర్చుకునే సదుపాయంతో తీర్చిదిద్దినట్లు వివరించారు. అన్ని అగ్రశ్రేణి విక్రయశాలలతో పాటు అమెజాన్, బిగ్‌బాస్కెట్ వంటి ఆన్‌లైన్ పోర్టళ్లలో కూడా లభిస్తాయని వెల్లడించారు.

ఈనాడు ఇంటర్వ్యూ కంటైనర్ కార్పొరేషన్ సీఎండీ వి.కల్యాణరామ

కంటైనర్లలో బియ్యం రవాణా

- ఈ ఆర్థిక సంవత్సరంలోనే శ్రీకారం
- తెలంగాణలో అధునాతన డ్రైపోర్టు నిర్మిస్తాం
- వైజాగ్ నుంచి రికార్డు స్థాయిలో నేపాల్‌కు రవాణా
- వచ్చే అయిదేళ్లలో 80 శాతం మార్కెట్ వాటా

'సరకు రవాణాకు దేశీయంగా, అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించాం. తెలంగాణలో డ్రైపోర్టు నిర్మిస్తాం. ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ తీరంతో పాటు నౌకాశ్రయాలు అధికంగా ఉన్నందున, లక్ష్యాల మేరకు ఎగుమతులు చేయగలుగుతాం. సరకును బల్క్‌గా రవాణా చేసే విధానానికి శ్రీకారం చుడుతున్నాం. గోదాముల కొరత అధిగమించేందుకు ఎఫ్‌సీఐ బియ్యాన్ని మిల్లుల నుంచి నేరుగా కేరళకు రవాణా చేస్తున్నాం. వచ్చే నాలుగేళ్లలో రూ.6,000 కోట్ల పెట్టుబడితో మరిన్ని సదుపాయాలు కల్పించనున్నాం' అని కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వి.కల్యాణరామ చెప్పారు. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆయన 'ఈనాడు' ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. ముఖ్యాంశాలివీ..

ఈనాడు - హైదరాబాద్

? తెలంగాణలో డ్రైపోర్టు నిర్మాణ ప్రణాళికలు ఏమిటి

తెలంగాణలో అత్యాధునిక డ్రైపోర్టును హైదరాబాద్ సమీపంలోని నాగులపల్లిలో నిర్మించాలన్నది యోచన. 64 ఎకరాలు కావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. స్థలం కేటాయిస్తే, నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. హైదరాబాద్ నుంచి భిన్న దేశాలకు సరకు రవాణా ఇప్పటికే భారీగా జరుగుతోంది. రానున్న రోజుల్లో డిమాండ్ మరింత ఉంటుంది. ఆ అంచనాలతోనే ఆధునాతన డ్రైపోర్టు నిర్మించాలని నిర్ణయించాం.

? ఆంధ్రప్రదేశ్‌లో నౌకాశ్రయాల పనితీరు ఎలా ఉంది

చాలా బాగుంది. విశాఖపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ద్వారా దేశవిదేశాలకు ఎగుమతులు భారీగా సాగుతున్నాయి. విశాఖపట్నం నుంచి జులైలో రికార్డు స్థాయిలో 40 ర్యాక్స్ ద్వారా నేపాల్‌కు నిత్యావసరాలతో పాటు వివిధ ఉత్పత్తులు ఎగుమతి చేశాం. సాధారణంగా నెలకు 16 ర్యాక్స్‌కు మించి ఎగుమతయ్యేవి కావు. మేము అనుసరిస్తున్న విధానాలతో త్వరితంగా, సులువుగా సరకు రవాణా అవుతున్నందున, వ్యాపారులు కూడా ముందుకొస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల నుంచి పూర్తి సహకారం అందుతోంది.

? కంటైనర్లలో ఎలా నిల్వ చేస్తారు

ఆసక్తి ఉన్న వారికి కంటైనర్లను గోదాములుగా వినియోగించుకునే వీలు కల్పిస్తాం. గోదాముల నిర్మాణానికి భారీగా వ్యయం అవుతుంది. అదే కంటైనర్లయితే బాడుగకు తీసుకుంటే సరిపోతుంది. మా ద్వారా ఉత్పత్తులను రవాణా చేసుకుంటే, ఎలాంటి అదనపు రుసుము లేకుండా 15 రోజుల పాటు కంటైనర్లు వినియోగించుకునే సదుపాయాన్ని ఇస్తున్నాం. ప్రస్తుతం 12 వేల కంటైనర్లు ఉన్నాయి. మరో 11 వేల కంటైనర్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించాం. ప్రస్తుతం 270 రైల్వే ర్యాక్స్ ఉన్నాయి. నాలుగైదేళ్లలో ఆ సంఖ్యను ఆరొందలకు పెంచుతాం.

? నౌకా రవాణా ఏ స్థాయిలో ఉంది

ఉత్తరాది నుంచి గుజరాత్ మీదుగా సరకు రవాణా ప్రయోజనకరంగా ఉంది. కాండ్ల పోర్టు నుంచి ట్యుటికోరిన్‌కు వారాంతాలో సరకు రవాణా చేస్తున్నాం. తూర్పు తీరంలో కూడా చేపట్టాం. బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌కు అనుసంధానం చేస్తున్నాం. రోడ్డు మార్గంలో వెళితే సరిహద్దుల్లో వారాల తరబడి వాహనాలు వేచి ఉండాలి. నౌకా రవాణాతో ఆ సమస్య పరిష్కరించాం.

? సంస్థలో వాటా తగ్గించుకునే ఆలోచన ప్రభుత్వానికి ఏమైనా ఉందా

ఆ విషయంలో ఎలాంటి సమాచారం లేదు. అలాంటి నిర్ణయమేదైనా ప్రభుత్వ స్థాయిలో జరుగుతుంది. ప్రస్తుతం ప్రభుత్వానికి 54 శాతం వాటా మాత్రమే ఉంది. మిగిలిన 46 శాతం వాటా ప్రజల వద్దే ఉంది.

? వచ్చే అయిదేళ్ల ప్రణాళికలు ఏమిటి

దేశీయంగా, అంతర్జాతీయంగా మార్కెట్ వాటాను 80 శాతానికి పెంచాలన్నది లక్ష్యం. ప్రస్తుతం 75.6 శాతం ఉంది. అంతర్జాతీయ సరుకు రవాణాలో 76 శాతం, దేశీయంగా 66 శాతం ఉంది. మార్కెట్ వాటా పెంచుకునేందుకు నూతన వ్యాపార మార్గాలు అన్వేషిస్తున్నాం.

? నూతన వ్యాపార అవకాశాలు ఎలాంటివి

సరకును బల్క్‌గా రవాణా చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందుకు కంటైనర్లు వినియోగిస్తాం. ఉత్పత్తుల్లో 80 శాతం వరకు ఇలానే రవాణా చేయాల్సి ఉంటుంది. కంటైనర్ సదుపాయాలు లేక బస్తాల్లో రవాణా చేస్తున్నారు. ఇందువల్ల పర్యావరణ సమస్యలతో పాటు ఖర్చు కూడా అధికమే. సిమెంటు, ఇండస్ట్రియల్ సాల్ట్, దేశీయ ఉప్పు, ఆహార ధాన్యాలను కూడా బల్క్‌గా రవాణా చేసే వీలుంది. మా అంచనా ప్రకారం ఏడాదికి 500 మిలియన్ టన్నుల రవాణాకు అవకాశం ఉంది. తొలి మూడు నాలుగేళ్లలో 50 మిలియన్ టన్నుల ఎగుమతికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలోనే బల్క్ రవాణా ప్రారంభిస్తాం.

? గోదాముల కొరతను ఎలా అధిగమిస్తారు

దేశంలో గోదాముల కొరత తీవ్రస్థాయిలో ఉంది. దీన్ని అవకాశంగా మార్చుకునేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నాం. తయారీదారుల నుంచి నేరుగా సరకులను నిర్దేశిత ప్రాంతాలకు రవాణా చేసే విధానాన్ని దేశంలో తొలిసారిగా తెలంగాణ నుంచి శ్రీకారం చుట్టాం. కేరళ రాష్ట్రానికి అవసరమైన ఉప్పుడు బియ్యం తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐ పంపుతోంది. ఎఫ్‌సీఐతో సంప్రదించి, మిల్లుల నుంచి బియ్యాన్ని నేరుగా మా కంటైనర్లలో నింపి కేరళకు పంపే విధానాన్ని ప్రయోగాత్మకంగా ఇటీవల చేపట్టాం. ఇందువల్ల ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ చేయాల్సిన అవసరం లేదు. వృథా అయ్యేది లేదు. ఆర్థికంగా ఎఫ్‌సీఐకి చాలా ఉపయుక్తం. దేశీయ సరుకు రవాణా(డొమెస్టిక్ లాజిస్టిక్స్‌ను) పెంచేందుకు దేశంలో 17 డ్రైపోర్టులను నిర్మిస్తాం. ఈ ఏడాది రూ. 750 కోట్లు కేటాయించాం.

మారుతీ సుజుకీ ఎక్స్‌ఎల్6

- ధర రూ.9.79- 11.46 లక్షలు

దిల్లీ: చిన్న కార్ల విభాగంలో తిరుగులేని మారుతీ సుజుకీ.. పెద్ద కార్ల తోనూ దుమ్మురేపేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా బుధవారం బహుళ వినియోగ వాహనం (ఎంపీవీ) 'ఎక్స్‌ఎల్6' కారును విపణిలోకి తీసుకొచ్చింది. ఎక్స్‌ఎల్6 మోడల్ 5 స్పీడ్ మాన్యువల్, 4-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్లలో లభిస్తుంది. మాన్యువల్ వేరియంట్ల ధర వరుసగా రూ.9.79 లక్షలు, రూ.10.36 లక్షలుగా నిర్ణయించారు. ఇక ఆటోమేటిక్ వెర్షన్ ధరలు రూ.10.89 లక్షలు, రూ.11.46 లక్షలుగా ఉన్నాయి. ఆరు సీట్లు కలిగిన ఈ కారులో రెండో వరుసలో కెప్టెన్ సీట్లు ఉంటాయి. కొత్త మోడల్ 1.5 లీటర్ పెట్రోల్ పవర్‌ట్రైన్‌లో లభిస్తుంది. స్మార్ట్ హైబ్రిడ్ వ్యవస్థతో లిథియం-అయాన్ బ్యాటరీ అనుసంధానించారు. కార్యక్రమంలో మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈఓ కెనిచి అయుకవా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశాంక్ శ్రీవాస్తవా పాల్గొన్నారు. కంపెనీ ప్రీమియం విక్రయశాల 'నెక్సా' ద్వారా ఎక్స్‌ఎల్6 విక్రయాలు చేపట్టనున్నారు.

కొత్త ఎక్స్‌ఎల్6తో మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈఓ కెనిచి అయుకవా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశాంక్ శ్రీవాస్తవా

పార్లే-జిలో 10,000 ఉద్యోగాల కోత!

దిల్లీ: పార్లే-జి 10,000 మంది వరకు ఉద్యోగులను తొలగించే అవకాశం కనిపిస్తోంది. ఆర్థిక వ్యవస్థ మందగమనం ప్రభావంతో బిస్కెట్ల అమ్మకాలు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. ముఖ్యంగా పార్లే-జికి ఎంతో కీలకమైన గ్రామీణ ప్రాంతాల్లో బిస్కెట్ల అమ్మకాలు గణనీయంగా క్షీణించడం వల్ల ఉత్పత్తిని తగ్గించుకోనున్నట్లు పార్లే విభాగ అధిపతి మయాంక్ షా వెల్లడించారు. ఉత్పత్తి కోత నేపథ్యంలో 8,000-10,000 మందిని వరకు తొలగించాల్సి రావొచ్చని తెలిపారు. 1929లో వ్యవస్థాపితమైన పార్లే-జిలో కాంట్రాక్టు ఉద్యోగులతో కలుపుకొని దాదాపు 1,00,000 మంది వరకు పనిచేస్తున్నారు.

అధిక జీఎస్‌టీ రేటుతో తగ్గిన గిరాకీ: 2017 జులైలో జీఎస్‌టీ విధానం అమల్లోకి వచ్చాక పార్లే బిస్కెట్ బ్రాండ్లకు గిరాకీ తగ్గిందని మయాంక్ అన్నారు. అధిక జీఎస్‌టీ రేటుతో ఒక ప్యాకెట్ కనిష్ఠంగా రూ. 5 వరకు పెరిగిందన్నారు. దీంతో ప్యాకెట్‌లో బిస్కెట్లను తగ్గించాల్సి వచ్చిందన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని తక్కువ ఆదాయవర్గం నుంచి గిరాకీ తగ్గిపోయిందని తెలిపారు. బిస్కెట్లపై జీఎస్‌టీ రేట్లను సమీక్షించాల్సిందిగా గతేడాది జీఎస్‌టీ మండలిని, అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి కూడా విన్నవించామని మాయంక్ వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదని తెలిపారు. బ్రిటానియా ఎండీ వరుణ్ బెర్రీ కూడా బిస్కెట్లకు అధిక జీఎస్‌టీ రేట్లపై ఆందోళన వ్యక్తం చేశారు.

కార్డు లావాదేవీలపై ఇ-మాండేట్‌కు అనుమతి

వర్తకులకు, వినియోగదార్లకు ఊరట

ముంబయి: క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల ద్వారా తరచూ చేసే లావాదేవీల (రికరింగ్ ట్రాన్సాక్షన్స్)పై ఇ-మాండేట్ ప్రక్రియకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అనుమతులు ఇచ్చింది. అయితే రూ.2000ను గరిష్ఠ పరిమితిగా నిర్ణయించింది. కార్డులపై ఇ-మాండేట్‌ను ఉపయోగించడం కోసం పరిశ్రమ వర్గాల నుంచి విజ్ఞప్తులు అందడంతో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా తరచూ చేసే లావాదేవీలకు ఇ-మాండేట్ అనేది సులువైన చెల్లింపు ప్రక్రియ. ఉదాహరణకు ఏదైనా టెలిఫోన్ బిల్లు, బీమా ప్రీమియం వంటివి కట్టాలనుకుంటే.. మొదటి సారి ఆన్‌లైన్‌లో కట్టే సమయంలో ఇ-మాండేట్‌ను ఎంచుకుంటే ప్రతిసారీ బిల్లు ఎపుడు కట్టాలి అన్నది చూసుకోన వసరం ఉండదు. ఇది అటు మర్చంట్లకు, ఇటు వినియోగదారులకు మేలు చేస్తుంది. అయితే ఈ ఇ-మాండేట్ సదుపాయం కింద జరిపే ఒక్కో లావాదేవీకి గరిష్ఠ పరిమితిని రూ.2000గా ఆర్‌బీఐ నిర్ణయించింది. అదే సమయంలో కార్డుదారు నుంచి ఈ లావాదేవీలపై ఎటువంటి ఛార్జీలు వసూలు చేయరాదని కూడా స్పష్టం చేసింది. అన్ని కార్డులు(డెబిట్, క్రెడిట్), వాలెట్లతో పాటు ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్(పీపీఐలు)లకూ ఈ ఆదేశాలు వర్తిస్తాయి.

ఆర్‌టీజీఎస్ ఇక ఉదయం 7 నుంచే

ఆర్‌టీజీఎస్ వ్యవస్థ ద్వారా భారీ స్థాయి నగదు బదిలీలను ఆగస్టు 26 నుంచి ఉదయం 7 నుంచే నిర్వహించుకోవచ్చని ఆర్‌బీఐ బుధవారం ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. ప్రస్తుతం రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్(ఆర్‌టీజీఎస్) కింద వినియోగదారు లావాదేవీలు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు; అంతర్ బ్యాంక్ లావాదేవీలు ఉదయం 8 నుంచి రాత్రి 7:45 వరకు వరకు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం నెఫ్ట్ కూడా ఉదయం 8 నుంచి రాత్రి 7 వరకు పనిచేస్తున్న సంగతి తెలిసిందే. నెఫ్ట్ ద్వారా రూ.2 లక్షల వరకు నగదు బదిలీలను చేయడానికి వీలుండగా.. ఆర్‌టీజీఎస్‌ను రూ.2 లక్షలకు పైబడిన మొత్తాలకు వినియోగిస్తున్నారు.

31,000 కియా కార్ల బుకింగ్

నేడు ముంబయిలో సెల్టోస్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ స్థాయి కారును భారత్ నుంచి ఉత్పత్తి చేస్తున్నందుకు గర్వపడుతున్నామని కియా మోటార్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కూక్యున్ షిమ్ అన్నారు. తమ మధ్య శ్రేణి ఎస్‌యూవీ సెల్టోస్ వాహన రంగంలో ఒక ప్రామాణికంగా మారుతుందని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 36లో కార్ కియా షోరూం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్ 6 ప్రమాణాలతో వస్తున్న సెల్టోస్‌కు ఇప్పటికే మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఇప్పటి వరకూ 31,000 కార్ల బుకింగ్ జరిగిందని తెలిపారు. గురువారం ముంబయిలో తొలిసారిగా కియా సెల్టోస్‌ను విడుదల చేయబోతున్నట్లు చెప్పారు. కొత్త నిబంధనలకు అనుగుణంగా కాలుష్యం, రక్షణకు సంబంధించిన అన్ని ప్రమాణాలను పాటించినట్లు తెలిపారు. 180 దేశాల్లో తమ వాహనాలను విక్రయిస్తున్నట్లు, వాహనాల తయారీలో ప్రపంచంలో ఎనిమిదో స్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. విక్రయానంతర సేవల విషయంలోనూ ఉన్నతంగా ఉండేలా చూస్తామని చెప్పారు. కొత్తగా మార్కెట్లోకి వస్తున్నప్పటికీ.. అత్యధిక విక్రయ, సర్వీసు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.కోటి నజరానా!

ఇన్‌సైడర్ ట్రేడింగ్ సమాచారమిస్తే సెబీ బహుమతి

- 35% కనీస వాటా పరిమితి పెంపు ప్రతిపాదనపై సమీక్ష అవసరం
- బోర్డు సమావేశంలో కీలక ప్రతిపాదనలకు ఆమోదం
- సెబీ ఛైర్మన్ త్యాగీ

వాటాదార్ల, మదుపర్ల ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశంతో సెబీ పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఇన్‌సైడ్ ట్రేడింగ్ సమాచారం ఇచ్చినవారికి నజరానా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మ్యూచువల్ ఫండ్‌లు నమోదిత సెక్యూరిటీల్లోనే పెట్టుబడులు పెట్టేలా నిబంధనలను తీసుకొచ్చింది. ఎఫ్‌పీఐల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు నిబంధనలను సరళీకరించింది. బైబ్యాక్ నిబంధనల్లోనూ మార్పులు చేసింది. అంకురాల షేర్లు ఏడాది తర్వాత ప్రధాన ప్లాట్‌ఫాంపైకి మారేందుకు కూడా అనుమతిచ్చింది. బుధవారం జరిగిన సెబీ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.. సమావేశానంతరం సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగీ ఈ వివరాలను వెల్లడించారు.

ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేస్తున్నట్లుగా సమాచారమిస్తే రూ.కోటి వరకు నజరానా ఇవ్వనున్నట్లు సెబీ బుధవారం వెల్లడించింది. షేరును ప్రభావితం చేసే అప్రకటిత సమాచారం ఆధారంగా కొందరు మాత్రమే ట్రేడింగ్ చేయడాన్ని ఇన్‌సైడర్ ట్రేడింగ్‌గా వ్యవహరిస్తారు. ఎవరైనా ఈ కార్యకలాపాలకు పాల్పడుతుంటే వారి వివరాలను గోప్యంగా హాట్‌లైన్ ద్వారా సమాచారం చేరవేసేందుకు సెబీ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ బహుమానం వ్యక్తులు, కార్పొరేట్లు మాత్రమే పొందే వీలుంది. తప్పులు, మోసాలను గుర్తించడమే విధి కాబట్టి ఆడిటర్లకు ఈ నజరానా పొందే అవకాశం లేదు. కనీసం రూ.కోటి వరకు అక్రమ లాభాన్ని పొందకుండా నిలువరించినా.. లేదంటే వసూలు చేసినా, ఆ వ్యక్తి నజరానా పొందేందుకు అర్హుడవుతాడు. అక్రమ ఆర్జన వసూలైన దానిలో కనీసం 10 శాతాన్ని గరిష్ఠంగా రూ.కోటి వరకు బహుమానంగా ఇస్తారు. అలాగే చిన్నచిన్న తప్పులకు పాల్పడిన వాళ్లు కూడా దర్యాప్తునకు సహకరిస్తే సెటిల్‌మెంట్ లేదా శిక్ష తగ్గింపు అవకాశాన్ని కూడా సెబీ కల్పించనుంది.

ఏడాది తర్వాత ప్రధాన ప్లాట్‌ఫాంకు అంకురాలు

అంకుర సంస్థల షేర్లు ఇన్నోవేటర్స్ గ్రోథ్ ప్లాట్‌ఫాం (ఐజీపీ) నుంచి స్టాక్ మార్కెట్‌లోని ప్రధాన ప్లాట్‌ఫాంకు మారే నిమిత్తం కొత్త నిబంధనావళిని బుధవారం సెబీ ప్రకటించింది. ఈ నిబంధనల ప్రకారం.. ఏడాది తర్వాత సాధారణ ట్రేడింగ్‌కు మారేందుకు అంకురాలకు సెబీ అనుమతినిచ్చింది. అయితే ఇందుకు కొన్ని షరతులను ప్రతిపాదించింది. వాటాదార్ల సంఖ్యను కనీసం 200కు అంకురాలు పెంచుకోవాల్సి ఉంటుంది. .వరుసగా మూడేళ్లపాటు లాభాలను నమోదుచేసి ఉండాలి. అలాగే కనీసం 75 శాతం వాటా అర్హులైన సంస్థాగత మదుపర్ల చేతిలో ఉండాలి. ప్రమోటర్లు 20 శాతం వాటాను మూడేళ్లపాటు కొనసాగించాలి.

నమోదిత సెక్యూరిటీల్లోనే ఫండ్‌ల పెట్టుబడులు

మ్యూచువల్ ఫండ్ మదుపర్ల ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశంతో బుధవారం సెబీ కీలక నిర్ణయాలు తీసుకుంది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు తమ పెట్టుబడులను దశలవారీగా నమోదిత, నమోదుకానున్న ఈక్విటీ, డెట్ సెక్యూరిటీల్లోకి బదిలీ చేయాలని తెలిపింది. అలాగే రేటింగ్ లేని డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడులను ప్రస్తుతమున్న 25 శాతం నుంచి 5 శాతానికి తగ్గించుకోవాలని సూచించింది. నమోదుకాని మార్పిడి రహిత డిబెంచర్లలో గరిష్ఠంగా 10 శాతం వరకు ఫండ్‌లు పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పిస్తూ కూడా సెబీ నిర్ణయం తీసుకుంది. 2020 జూన్ కల్లా వీటిని దశలవారీగా సెబీ అమల్లోకి తేనుంది. నమోదిత సెక్యూరిటీలన్నింటికీ తప్పనిసరిగా రేటింగ్ ఉంటుంది. అధిక నష్టభయం ఉండే సెక్యూరిటీల వల్ల మ్యూచువల్ ఫండ్ సంస్థల్లోని మదుపర్ల పెట్టుబడులకు ముప్పు పొంచి ఉంటుందని సెబీ భావిస్తోంది. ఇలాంటి నష్టభయాల నుంచి మదుపర్ల ప్రయోజనాలను పరిరక్షించే లక్ష్యంతో పై నిర్ణయాలు తీసుకుంది.

25 శాతానికి తగ్గించుకోవడమే పూర్తవ్వలేదు

నమోదిత కంపెనీల్లో కనీస ప్రజల వాటాను 35 శాతానికి పెంచే ప్రతిపాదనను అమల్లోకి తేవడానికి ముందు వివిధ అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని అజయ్ త్యాగి వెల్లడించారు. ప్రస్తుతం నమోదిత కంపెనీల్లో కనీస ప్రజల వాటా పరిమితి 25 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. దీనిని 35 శాతానికి పెంచేందుకు ఇటీవలి బడ్జెట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఈ అంశంపై అడిగిన ఓ ప్రశ్నకు త్యాగి స్పందిస్తూ, 'నమోదిత ప్రభుత్వ రంగ సంస్థల్లో 45 శాతం సంస్థలు ఇప్పటికీ 25 శాతం పరిమితి నిబంధనను పాటించలేదు. వాటికి 2020 ఆగస్టు వరకు గడువిచ్చాం. ఇతర దేశాల్లో వాటా పరిమితి మార్గదర్శకాలు ఎలా ఉన్నాయో అధ్యయనం చేయాలి. ఈ అంశాలన్నింటిపై రానున్న రోజుల్లో సమీక్ష జరుపుతామని త్యాగి పేర్కొన్నారు.

మరికొన్ని నిర్ణయాలు ఇవీ...

- స్మార్ట్ సిటీలు, వాటిపై పనిచేస్తున్న సంస్థలు మున్సిపల్ బాండ్ల జారీ ద్వారా నిధులు సమీకరించేందుకు సెబీ అనుమతినిచ్చింది.
- రుణ చెల్లింపుల్లో విఫలమైన, జాప్యం చేసిన వారి వివరాలను రేటింగ్ ఏజెన్సీలతో పంచుకోవడాన్ని తప్పనిసరి చేస్తూ నిబంధనలను విడుదల చేసింది.

- నమోదిత కంపెనీల బైబ్యాక్ షేర్ల నిబంధనలను సెబీ సడలించింది. ముఖ్యంగా ఎన్‌బీఎఫ్‌సీ, గృహ రుణ విభాగంలో అనుబంధ సంస్థలున్న కంపెనీల బైబ్యాక్ నిబంధనల్లో మార్పు చేసింది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలకు బుధవారం సెబీ ఆమోదముద్ర వేసింది.
- విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐలు) కేవైసీ నిబంధనలను కూడా సెబీ సరళీకరించింది. ఎఫ్‌పీఐల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం, సులభతరం అయ్యేందుకు ఈ పరిణామం దోహదం చేయనుంది.

చీఫ్ సెలక్టర్‌గా కుంబ్లేనే సరైనోడు

దిల్లీ: చీఫ్ సెలక్టర్‌గా అనిల్ కుంబ్లేనే సరైనోడని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. "సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా కుంబ్లేనే సరైన ప్రత్యామ్నాయమని నా అభిప్రాయం. ఆటగాడిగా అతనికి దిగ్గజ ఆటగాళ్లు సచిన్, సౌరభ్, రాహుల్‌తో సాన్నిహిత్యముంది. కోచ్‌గా కుర్రాళ్లతో పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం చీఫ్ సెలక్టర్‌కు ఏడాదికి రూ.కోటి వేతనం ఉంది. దీన్ని పెంచితే ఎక్కువమంది ఆసక్తి ప్రదర్శిస్తారు" అని వీరూ చెప్పాడు. సచిన్ తెందుల్కర్ రికార్డులను చాలా వరకు విరాట్ కోహ్లి బద్దలు కొట్టగలడని సెహ్వాగ్ అన్నాడు. అయితే సచిన్ అత్యధిక టెస్టుల రికార్డు (200)ను మాత్రం ఎవరూ బద్దలు కొట్టలేరని చెప్పాడు

ఛాంపియన్

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

విండీస్ ఆపగలదా!

జోరు మీదున్న భారత్

నేటి నుంచే తొలి టెస్టు

రా.7 నుంచి సోని స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో

టీ20ల్లో అదరగొట్టింది. వన్డేల్లో దుమ్ము రేపింది. ఇప్పుడు అదే జోరుతో టెస్టు సమరానికి సిద్ధమైపోయింది టీమ్‌ఇండియా. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆతిథ్య వెస్టిండీస్‌తో తొలి టెస్టు నేటి నుంచే. కోహ్లీసేనే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో టీమ్ ఇండియా ఆడనున్న తొలి టెస్టు మ్యాచ్ ఇదే.

9 వెస్టిండీస్‌పై భారత్ గెలిచిన టెస్టు సిరీస్‌లు. విండీస్ (12)ది పైచేయిగా ఉంది.

నార్త్ సౌండ్ (అంటిగ్వా)

వెస్టిండీస్‌పై టీ20, వన్డే సిరీస్‌లు గెలిచి జోరు మీదున్న భారత్‌కు మరో సిరీస్‌పై కన్నేసింది. గత కొన్నేళ్లుగా టెస్టుల్లో స్థిరంగా రాణిస్తున్న కోహ్లీసేన ఈ సిరీస్‌లో ఎలా ఆడుతుందనేది ఆసక్తికరం. వన్డే, టీ20ల్లో భారత్ జోరు చూస్తే టెస్టుల్లో గెలవడం పెద్ద కష్టం కాదని అనిపించొచ్చు. కానీ భిన్నమైన స్వభావం గల వివియన్ రిచర్డ్స్ మైదానంలో పిచ్‌పై ఆతిథ్య విండీస్‌ను ఎదుర్కోవడం భారత్‌కు అంత సులభం కాబోదు. దీనికి తోడు గత సిరీస్‌లో సొంతగడ్డపై బలమైన ఇంగ్లాండ్‌ను 2-1తో ఓడించి సత్తా చాటింది యువ కరీబియన్ జట్టు. ఈసారి టీమ్‌ఇండియాకు ఎంత పోటీ ఇస్తుందో చూడాలి.

వాళ్లు తక్కువేం కాదు: ఇప్పుడు వెస్టిండీస్ అంటే టీ20 జట్టే అన్న మాట వినిపిస్తోంది. కానీ ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లు జట్టులో చేరిన తర్వాత వాళ్ల ఆటలో మార్పొచ్చింది. ముఖ్యంగా టెస్టుల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. హోల్డర్ నేతృత్వంలోని కరీబియన్ జట్టు ప్రపంచకప్‌కు ముందు ఇంగ్లాండ్ లాంటి జట్టును ఓడించి సిరీస్ గెలవడమే ఇందుకు నిదర్శనం. డారెన్ బ్రావోతో పాటు షై హోప్, క్రెయిగ్ బ్రాత్‌వైట్, జాన్ క్యాంప్‌బెల్, ఛేజ్, రోచ్ లాంటి ఆటగాళ్లున్న విండీస్‌ను తక్కువ అంచనా వేస్తే ఇబ్బందులు తప్పవు. విండీస్ భారీ కాయుడు రకీమ్ కార్న్‌వాల్ ఈ మ్యాచ్ ద్వారా టెస్టుల్లో అరంగేట్రం చేసే అవకాశముంది.

పిచ్, వాతావరణం

మ్యాచ్ జరిగే ఐదురోజులు వర్షం కురిసే అవకాశాలు లేవు. అయితే కొద్దిగా మేఘావృతం కావొచ్చు. తొలి రెండు రోజులు పిచ్ పేసర్లకు సహకరించే అవకాశాలున్నాయి. చరిత్ర చూస్తే ఫాస్ట్ బౌలర్లే ఎక్కువ శాతం ఈ పిచ్‌పై వికెట్లు పడగొట్టారు. విండీస్ తరపున రోచ్, హోల్డర్, గాబ్రియల్. . భారత్ తరపున బుమ్రా, షమి ప్రభావం చూపే అవకాశాలున్నాయి. అయితే మ్యాచ్ గడుస్తున్న కొద్దీ స్పిన్నర్లకు సహకారం లభిస్తుంది.

జట్టులోకి ఎవరొస్తారో..

ఈ మ్యాచ్‌లో భారత్‌కు పెద్ద సమస్య జట్టు కూర్పే. మిడిలార్డర్‌లో అజింక్య రహానె, రోహిత్‌శర్మల మధ్య పోటీ నెలకొంది. వార్మప్ మ్యాచ్‌లో రాణించిన రోహిత్.. రహానెకు పోటీ అయ్యాడు. వికెట్‌కీపర్ రిషబ్ పంత్‌కు కూడా తుది జట్టులో చోటు దక్కుతుందా అనేది ఆసక్తికరం. టెస్టు స్పెషలిస్టు కీపర్ వృద్ధిమాన్ సాహా అందుబాటులో ఉన్న నేపథ్యంలో పంత్‌కు స్థానం లభిస్తుందో లేదో చూడాలి. ఇదే కాక ఐదుగురు స్పెషలిస్టు బౌలర్లా లేదా నలుగురా అనే విషయం పై కూడా టీమ్ మేనేజ్‌మెంట్ తేల్చుకోలేకపోతోంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య లేకపోవడంతో మరో బ్యాట్స్‌మన్‌ను తీసుకోవాలా లేదా బౌలర్‌ను చేర్చుకోవాలా అనేది ప్రశ్నగా మారింది. టెస్టు స్పెషలిస్టులు చెతేశ్వర్ పుజారా, అశ్విన్, ఇషాంత్ శర్మలతో పాటు వన్డే, టీ20 సిరీస్‌లో ఆడని స్టార్ పేసర్ బుమ్రా చేరడంతో భారత్ బలంగా కనిపిస్తోంది. మయాంక్ అగర్వాల్‌కు తోడుగా ఎవరు ఎవరు ఓపెనింగ్ చేస్తారన్నది ఆసక్తికరం. అందుకోసం రాహుల్, హనుమ విహారి మధ్య పోటీ ఉంది.

రకీమ్ కార్న్‌వాల్

ఈ బారీ కాయుడు ఈ టెస్టుతో అరంగేట్రం చేసే అవకాశం ఉంది

96

భారత్, విండీస్ ఆడిన మొత్తం టెస్టులు. విండీస్ 30 గెలిస్తే.. భారత్ 20 నెగ్గింది. 46 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి.

2002 నుంచి భారత్ .. వెస్టిండీస్‌పై టెస్టు సిరీస్ ఓడిపోలేదు. చివరిగా కోహ్లి సారథ్యంలోని టీమ్‌ఇండియా 2016లో 2-0తో గెలిచింది. కోహ్లీకి ఉపఖండం ఆవల కెప్టెన్‌గా ఇదే తొలి సిరీస్ విజయం కూడా.

జట్లు

భారత్: కోహ్లి (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, కేఎల్ రాహుల్, పుజారా, విహారి, రహానె, రోహిత్, పంత్, కుల్‌దీప్, అశ్విన్, జడేజా, ఇషాంత్, షమి, బుమ్రా, భువనేశ్వర్, సాహా

వెస్టిండీస్: హోల్డర్ (కెప్టెన్), క్రెయిగ్ బ్రాత్‌వైట్, డారెన్ బ్రావో, బ్రూక్స్, క్యాంప్‌బెల్, ఛేజ్, కార్న్‌వాల్, డౌరిచ్, గాబ్రియల్, హెట్‌మయర్, హోప్, కీమో పాల్, రోచ్.

ఆంటిగ్వాలోని జాలీ బీచ్‌లో బుధవారం సరదాగా భారత క్రికెటర్లు

భారత హాకీ జట్లకు టైటిళ్లు

టోక్యో: ఒలింపిక్స్ హాకీ టెస్టు ఈవెంట్లో భారత పురుషులు, మహిళల జట్లు అదరగొట్టాయి. అద్భుత ప్రదర్శనతో టైటిళ్లు కైవసం చేసుకున్నాయి. బుధవారం జరిగిన ఫైనల్లో భారత పురుషుల జట్టు 5-0 గోల్స్‌తో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. 7వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గోల్ చేసి జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లగా.. ఆ తర్వాత షంషేర్ సింగ్ (18వ) ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. అక్కడ నుంచి భారత్ జోరు మరింత పెరిగింది. నీలకంఠ శర్మ (22వ), గుర్‌సహిబిత్ (26వ), మన్‌దీప్ సింగ్ (27వ ని) స్వల్ప వ్యవధిలో గోల్స్ కొట్టి జట్టును విజయపథంలో నడిపించారు. మహిళల విభాగం ఫైనల్లో భారత్ 2-1తో ఆతిథ్య జపాన్‌ను ఓడించింది. భారత్ తరపున నవ్‌జ్యోత్ (11వ), లాల్‌రెమిసియామి (33వ) గోల్స్ కొట్టారు.

నేటి నుంచే యాషెస్ మూడో టెస్టు

లీడ్స్: ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. గురువారం నుంచే యాషెస్ మూడో టెస్టు. మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో ఇంగ్లాండ్ ఉండగా.. ఆధిక్యాన్ని కొనసాగించాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. అయితే సూపర్ ఫామ్‌లో ఉన్న స్టీవ్ స్మిత్ గాయంతో మ్యాచ్‌కు దూరం కావడం ఆసీస్‌కు పెద్ద ఎదురు దెబ్బే. డ్రాగా ముగిసిన రెండో టెస్టు సందర్భంగా జోఫ్రా ఆర్చర్ బౌన్సర్ మెడకు తగలడంతో స్మిత్ కంకషన్‌కు గురైన సంగతి తెలిసిందే. తొలి టెస్టులో గెలిచిన ఆసీస్ సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది.

యాషెస్ మూడో టెస్టు

మధ్యాహ్నం 3.30 నుంచి సోని స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో

శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య కీలక టెస్టు మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ రెండు జట్ల మధ్య చివరిదైన రెండో టెస్టు గురువారం కొలంబోలో ఆరంభం కానుంది.

ప్రిక్వార్టర్స్‌లో సింధు

సైనా, శ్రీకాంత్ ముందంజ

బాసెల్ (స్విట్జర్లాండ్)

ప్రతిష్టాత్మక ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. తొలి రౌండ్లో బై ద్వారా ముందంజ వేసిన సింధు.. రెండో రౌండ్లో సాధికారిక విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో ఐదో సీడ్ సింధు 21-14, 21-15తో పాయ్ యు (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. అన్ని రంగాల్లోనూ పాయ్‌పై ఆధిపత్యం కనబరిచిన భారత స్టార్ ఈ టోర్నీలో మొదటి విజయం నమోదు చేసింది. 43 నిమిషాల పాటు సాగిన పోరులో ఐదో ర్యాంకర్ సింధుకు పోటీనే ఎదురవలేదు. తొలి గేమ్‌లో 5 పాయింట్ల వరకే ప్రత్యర్థి పోటీ ఇవ్వగలిగింది. ఆ తర్వాత ఆటంతా సింధుదే. 9-5తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సింధు అక్కడ్నుంచి వెనుదిరిగి చూడలేదు. స్మాష్‌లు, క్రాస్‌కోర్ట్ షాట్‌లతో చెలరేగింది. మంచి ప్లేస్‌మెంట్స్‌తో పాయింట్లు రాబడుతూ 15-10తో ఆధిక్యం సంపాదించింది. కొద్దిసేపటికే 20-14తో ముందంజ వేసిన సింధు క్రాస్‌కోర్ట్ రిటర్న్ సంధించి 21-14తో తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. తర్వాత గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించింది. మరో మ్యాచ్‌లో సైనా 21-10, 21-11తో సొరయా (నెదర్లాండ్స్)ను ఓడించింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో శ్రీకాంత్ 13-21, 21-13, 21-16తో జిల్బర్‌మ్యాన్ (ఇజ్రాయిల్)పై గెలిచాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్లో సుమీత్ రెడ్డి- మను అత్రి 16-21, 19-21తో ఆరో సీడ్ హాన్ చెంగ్- హావొ డాంగ్ (చైనా) చేతిలో ఓడారు. మహిళల డబుల్స్ రెండో రౌండ్లో సిక్కి రెడ్డి- అశ్విని పొన్నప్ప 20-22, 16-21తో ఏడో సీడ్ యిన్ హ్యూ- డు యూ (చైనా) చేతిలో, జక్కంపూడి మేఘన- పూర్విష రామ్ 8-21, 18-21తో తనక- కొహరు (జపాన్) చేతిలో పరాజయం చవిచూశారు.

బుల్స్‌కు పుణెరి కళ్లెం

చెన్నై

ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ బెంగళూరు బుల్స్ జోరుకు పుణెరి పల్టాన్ కళ్లెం వేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పుణెరి 31-23 తేడాతో బెంగళూరుపై విజయం సాధించింది. ట్యాక్లింగ్‌లో సుర్జీత్ సింగ్ (6), జాదవ్ (5) చెలరేగి బుల్స్‌ను ఓ పట్టు పట్టారు. రైడింగ్‌లో మంజీత్ (7) మెరిశాడు. రెండు జట్లు హోరాహోరీగా తలపడడంతో మ్యాచ్ పోటాపోటీగా ఆరంభమైంది. ఇరు జట్ల ఆటగాళ్లు పాయింట్ల కోసం తీవ్రంగా పోరాడారు. రెండు జట్లు తొలి అర్ధభాగాన్ని 10-10తో ముగించాయి. ద్వితీయార్ధంలో పుణెరి జూలు విదిల్చింది. ప్రత్యర్థి రైడర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. బుల్స్ అగ్రశ్రేణి రైడర్ పవన్ సెరావత్ (5)ను లక్ష్యంగా చేసుకొన్న పుణెరి డిఫెండర్లు అతణ్ని కట్టడి చేయగలిగారు. 26వ నిమిషంలో బుల్స్‌ను ఆలౌట్ చేసిన పుణెరి 19-11తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అక్కడి నుంచి ఆ జట్టు దూకుడు తగ్గలేదు. క్రమంగా పాయింట్లు సాధిస్తూ ఆధిక్యం పెంచుకుంటూ వెళ్లింది. మరో మూడు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా 28-18తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. అదే జోరుతో మ్యాచ్ కైవసం చేసుకుంది. మరో మ్యాచ్‌లో జైపుర్ పింక్‌పాంథర్స్ 28-26తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

ప్రొ కబడ్డీలో ఈనాడు

బంగాల్ × పట్నా
(రా.7:30 నుంచి)



పాకిస్థాన్ క్రికెటర్ హసన్ అలీ ఓ ఇంటివాడయ్యాడు. భారత్‌కు చెందిన షమియా అర్జూను బుధవారం దుబాయ్‌లో పెళ్లాడాడు.

కూర్పే భారత్ సమస్య

సౌరభ్ గంగూలీ

కోహ్లి సేనకు ఇది సరికొత్త ఆరంభం. వెస్టిండీస్‌తో టీ20, వన్డే సిరీస్‌లు సొంతం చేసుకున్న జట్టు ఇక ఐదు రోజుల మ్యాచ్‌లతో ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో తన ప్రస్థానం మొదలెట్టనుంది. ప్రపంచకప్‌లో, భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లో నిరాశాజనక ప్రదర్శన చేసిన విండీస్ టెస్టుల్లో ఏలా అడుతుందో చూడాలి. మరోవైపు టీమ్‌ఇండియాకు ప్రధాన సమస్య.. జట్టు కూర్పు. సాహా కంటే కూడా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో మంచి ప్రదర్శన చేసిన పంత్‌కే అవకాశాలెక్కువగా ఉన్నాయి. హార్దిక్ పాండ్య గైర్హాజరీతో ఆల్‌రౌండర్‌గా జడేజా జట్టులోకి వచ్చే చాన్స్ కొట్టేశాడు. రోహిత్, రహానెల్లో ఎవరిని ఆడించాలి అనేది సమస్యగా మారింది. తన ఫామ్‌ను కొనసాగించి.. ఓపెనర్‌గా స్థిరపడేందుకు రోహిత్‌కు అవకాశమిచ్చి, మిడిలార్డర్‌లో రహానెను బరిలో దించాలని నా అభిప్రాయం.

SEAGRAM'S
ROYAL STAG
MEGA MUSIC CDs

విహారి అక్కడే ఆడాలి

గౌతమ్ గంభీర్

విండీస్లో టెస్టు క్రికెట్ పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. భారత బ్యాట్స్‌మెన్ అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబరచాలి. డ్యూక్ బంతితో ఆడాలని విండీస్ భావించడం మంచి నిర్ణయం. గతంలో విండీస్ కూకాబుర్రా బంతులతో ఆడేది. కూకాబుర్రాతో పోల్చుకుంటే ఇంగ్లాండ్‌లో తయారయ్యే డ్యూక్ బంతులు బ్యాట్స్‌మెన్‌కు ఎక్కువ సవాల్ విసురుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్ ఇన్నింగ్స్‌ను ఆరంభించాలి. టాప్ ఆర్డర్‌లో ఆడించి హనుమ విహారి కెరీర్‌ను ప్రమాదంలోకి నెట్టడం సరికాదు. విహారి మిడిలార్డర్ ఆటగాడు. అతడు అక్కడే ఆడాలి. మూడో స్థానంలో పుజారా.. నాలుగులో కోహ్లి, ఐదులో రోహిత్ బరిలో దిగాలి. నా దృష్టిలో రోహిత్ కీలకం. వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్‌కే నా తొలి ప్రాధాన్యం.

THE ULTIMATE INVERTER BATTERY
EXIDE INVATUBULAR

● మరో ఐదేళ్లు పేటీఎంకే

దిల్లీ: స్వదేశంలో టీమ్‌ఇండియా ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు దేశవాళీ టోర్నీల స్పాన్సర్‌షిప్ హక్కులను పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరోసారి దక్కించుకుంది. 2019 నుంచి 2023 వరకు ఈ ఒప్పందం కొనసాగనుంది. ఆ సంస్థ ఒక్కో మ్యాచ్‌కు రూ.3.80 కోట్లు చెల్లించనుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

MARUTI SUZUKI

NEXA

Q. WHAT DO YOU STRIVE FOR?
TO LIVE IN COMFORT AND STYLE.

INTRODUCING
XL6
FEELS JUST RIGHT

Bring it to life
Here's how: goo.gle/Lens

Scan the print ad with Google Lens to watch exciting content of the XL6.

Scan the QR code for an exciting Facebook AR experience.

CREATE. INSPIRE.

Quad Chamber LED Headlamps with DRLs

All-black Interiors with Captain Seats

Smartplay Studio

Automatic Transmission with Hill Hold & ESP

NEXA Safety Shield
Standard Across All Variants

- DUAL FRONT AIRBAGS
- ABS WITH EBD
- PEDESTRIAN PROTECTION COMPLIANT
- FULL FRONTAL IMPACT COMPLIANT, FRONTAL OFFSET IMPACT COMPLIANT, SIDE IMPACT COMPLIANT
- ISOFIX
- HEARTECT PLATFORM

T&C Apply. Features and accessories shown may not be part of standard fitment. Black glass shade on the vehicle is due to lighting effect. Images used are for illustration purposes only.

Contact us at
1800-200-[6392]
1800-102-[NEXA]
www.nexaexperience.com
NOW YOU CAN ALSO BOOK ONLINE

WARANGAL: NEXA WARANGAL EAST (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 9133398806), **KARIMNAGAR: NEXA RAMPUR** (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 8897096633), **NIZAMABAD: NEXA NIZAMABAD EAST** (VARUN MOTORS PH: 9160991616), **NALGONDA: NEXA NALGONDA NORTH** (PAVAN MOTORS PVT LTD PH: 9100051403).

SUZUKI connect
ADVANCED TELEMATICS SOLUTION
A REVOLUTIONARY WAY TO CONNECT TO YOUR CAR
- Vehicle Tracking
- Emergency Alert
- Driving Behaviour Analysis
- Live Vehicle Status
- Vehicle Alerts

Offered separately as Genuine NEXA Accessory